RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

| శనివారం 06.12.2025 | సంపుటి :12 సంచిక : 137 | పేజీలు :12 వెల : రూ. 4/- |
|---|---|---|

హైదరాబాద్ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698





## మార్చిలో వరంగల్ విమానాశ్రయ పనులు

# ప్రారంభిస్తాం



### బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి గాలికొదిలేశారు

ఫాంహౌస్‌లు కట్టుకుని వేల కోట్లు వెనకేసుకున్నారు

నర్సంపేటలో రూ.532కోట్ల పనులకు సీఎం శంకుస్థాపన

వరంగల్ విమానాశ్రయం కోసం గత సీఎం కేసీఆర్ ఏనాడు ప్రయత్నించలేదు. పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించి కొత్తగా ఒక్క ఎయిర్‌పోర్టును కూడా సాధించలేదు. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఇచ్చిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు మాత్రమే మనకు దిక్కు. హైదరాబాద్‌లో కనిపించే వృద్ధి వరంగల్‌లోనూ ఉండాలని నిర్ణయించాం. మామునూరు ఎయిర్‌పోర్టుకు త్వరలోనే భూసేకరణ పూర్తి చేస్తాం. వచ్చే మార్చిలో మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణపనులు ప్రారంభం అవుతాయి

\- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- వరివేస్తే ఉరే అని రైతులను కేసీఆర్ బెదిరించారు
- మేము సన్నవడ్లకు 500 బోనస్ ఇస్తున్నాం
- రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నాం
- రాష్ట్రంలో కోటి 10 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం
- 3 కోట్ల 10 లక్షల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం
- ఉచిత విద్యుత్‌కు పేటెంట్ కాంగ్రెస్ మాత్రమే
- హైదరాబాద్ తరహాలో వరంగల్ అభివృద్ధి చేస్తున్నాం
- నిరుద్యోగులు పోటీపరీక్షలకు సిద్ధం కావాలి
- రాజకీయాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు
- ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి

వరంగల్ ప్రతినిధి(జనంసాక్షి): బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉండగా గత పదేళ్లలో భారీగా ఆస్తులు సంపాదించారు.. కానీ ఈ ప్రాంతం అభివృద్ధిని గాలికి వదిలేశారని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ ఆనాడు వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్లేనని అన్నారు.. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం.. వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తూ.. వరికి ప్రోత్సాహకాలిచ్చామని తెలిపారు. సన్న వడ్దుల పండిస్తే 500 బోనస్ ఇస్తున్నామని అన్నారు. ఉచిత విద్యుత్ పేటెంట్ మా పార్టీదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత పాలకులు మిగతా 2లో..

### డిజిటల్ రూపంలో తెలంగాణ విజన్ డాక్యుమెంట్:సీఎం రేవంత్

2లో..

# మా బంధం బలమైనదే

## భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం

### చమురు విషయంలో అమెరికా ఆంక్షలు లెక్కచేయం

### భారత్‌కు ఇంధన సరఫరా కొనసాగిస్తాం

- సొంత కరెన్సీలతో వ్యాపారానికి చేరువగా ఉన్నాం
- అణువిద్యుత్ తదితర రంగాల్లో సహకారం కొనసాగిస్తాం
- ఉగ్రవాదంపై పోరులో భారత్‌తో కలసి నడుస్తాం
- ఉక్రెయిన్‌తో యుద్ధంపై మోడీ సూచనలు స్వాగతిస్తున్నాం
- మోడీతో సంయుక్త మీడియాతో సమావేశంలో పుతిన్
- భారత్ ఎల్లప్పుడూ శాంతిపక్షమే
- దౌత్యంతోనే రష్యా, ఉక్రెయిన్‌లు విభేదాల పరిష్కారం
- పుతిన్‌తో భేటీలో ప్రధాని మోడీ స్పష్టీకరణ




న్యూఢిల్లీ(జనంసాక్షి): టెర్రరిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భారత్‌తో కలిసి నడుస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. టెర్రరిజాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు భారత్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ, పుతిన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ.. 'మోదీతో నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. భారత్ ఆతిథ్యం ఎంతో సంతోషాన్నిచ్చింది. అనేక అంశాల్లో ఇరుదేశాల మధ్య అవగాహన కుదిరింది. విభిన్న అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నాం. భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది. ఇరుదేశాల మధ్య ట్రేడ్ మరింత మిగతా 2లో..

## పాన్ మసాలా తయారీపై సెస్సు

### బిల్లును ఆమోదించిన లోక్‌సభ


న్యూఢిల్లీ(జనంసాక్షి):పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ శుక్రవారం ఆమోదం తెలిపింది. గురువారం ఈ బిల్లును లోక్‌సభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టారు. ఈ సెస్సు ద్వారా సమకూరిన నిధులను జాతీయ భద్రత, ప్రజారోగ్యానికి వినియోగించనున్నారు. 'హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్సు బిల్లు, 2025'పై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారు. ఈ సెస్సు ద్వారా సమకూరిన నిధులను రాష్ట్రాలతో పంచుకుంటామని మిగతా 2లో..



## రెపోరేటును 25 బేసిన్ పాయింట్లు తగ్గింపు

### ఆర్‌బిఐ మరోసారి కీలక నిర్ణయం

ముంబై(జనంసాక్షి):రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి శుభవార్త ప్రకటించింది. కీలక వడ్డీ రేట్లను మరో 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తున్నట్టు పేర్కొంది. దీంతో రెపో రేటు 5.25 శాతానికి దిగొచ్చింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. అయితే.. ఈ ఏడాదిలో ఇప్పటికే వడ్డీ రేట్లపై ఆర్బీఐ ట్రిపుల్ బొనాంజా ప్రకటించింది. ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో కీలక వడ్డీరేట్లపై 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. ఆ తర్వాత జూన్ నెలలో మిగతా 2లో..







# స్తంభించిన ఇండిగో సేవలు

ఆగిన వెయ్యి విమానాలు • త్వరలోనే సాధారణ పరిస్థితులు

• రద్దయ్యే ఫ్లైట్ల సంఖ్య తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం:సీఈవో

• ఉన్నతస్థాయి దర్యాప్తునకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇండిగో విమాన సర్వీసుల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతూనే ఉంది. శుక్రవారం వెయ్యికి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ క్రమంలో సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ మరోసారి స్పందిస్తూ.. ప్రయాణికులకు కలుగుతోన్న అసౌకర్యానికి క్షమాపణ చెప్పారు. శనివారం ఈ సంఖ్య వెయ్యి కన్నా తక్కువ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిసెంబర్ 10-15 మధ్య కాలంలో పరిస్థితులు సాధారణ స్థాయికి వచ్చే అవకాశం ఉందని పేర్కొంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు."గత కొన్ని రోజులుగా తీసుకుంటున్న ముందస్తు చర్యలు సరిపోవడం లేదని రుజువైంది. మిగతా 2లో..

### ప్రభుత్వ గుత్తాధిపత్యమే కారణం

ఇండిగో గందరగోళంపై రాహుల్ వ్యాఖ్యలు

2లో..

## తెలంగాణ అభివృద్ధిలో రైజింగ్ గ్లోబల్ సమిట్ కీలకపాత్ర

### సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సోనియా సందేశం



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ అభివృద్ధిలో రైజింగ్ గ్లోబల్ సమిట్ కీలక పాత్ర పోషించనుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సోనియాగాంధీ సందేశం పంపించారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, ప్రణాళికల్లో భాగస్వాములు కావాలనుకునే వారికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుందన్నారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ వ్యవసాయాభివృద్ధి ప్రాజెక్టులకు సమ ప్రాధాన్యం ఇచ్చేలా మూడంచెల వ్యూహంతో తెలంగాణ ముందుకు సాగుతోందని సోనియా తన సందేశంలో పేర్కొన్నారు.తెలంగాణలోని మానవ, సహజ వనరులు, ప్రజల మిగతా 2లో..

# ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు



- అందించాలన్నదే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- అర్బన్ ఏరియాల్లో కూడా బహుళ అంతస్థుల నివాసాలు
- హిల్ట్ పాలసీపై కేటీఆర్‌వి అర్థం లేని విమర్శలు : మంత్రి పొంగులేటి

హైదరాబాద్(జనంసాక్షి): తమ ప్రభుత్వం వచ్చాక పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అరులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కేటాయించే బాధ్యత తీసుకున్నట్లు పేర్కొన్నారు. వచ్చే మూడేళ్లలో అర్బన్ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం. ఇక్కడ జీ ప్లస్ త్రీ, జీ ప్లస్ ఫోర్ విధానంలో నిర్మిస్తాం. మధ్యతరగతి వర్గాలకూ మంజూరయ్యేలా చర్యలు చేపట్టాం. ప్రస్తుతం 3.82 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో మూడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. త్వరలో లక్ష ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధం అవుతాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మూడు లక్షల ఇళ్లకు గృహప్రవేశం పూర్తి అవుతుందని వివరించారు. వచ్చే ఏప్రిల్ నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం అవుతుందని చెప్పుకొచ్చారు. కోర్ అర్బన్ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం కూడా ప్రణాళిక సిద్ధమైందని వెల్లడించారు. గ్రౌండ్ ప్లస్ ఫోర్ బిల్డింగ్ నిర్మించి పేదలకు ఇచ్చే ప్రణాళికలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. త్వరలో అర్బన్ ప్రణాళిక ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఓ ఆర్ ఆర్‌కు ఆనుకుని నలువైపులా ఉన్న స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఒక్కో చోట 10వేల ఇళ్లు నిర్మించి నో ప్రాఫిట్, నో లాస్ కింద మధ్యతరగతి ప్రజలకు ఇస్తామని వివరించారు. గ్లోబల్ సమ్మిట్‌లో ప్రణాళికలు ప్రకటిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పేర్కొన్నారు. గగత కేసీఆర్ ప్రభుత్వం హౌసింగ్ శాఖను నిర్వీర్యం చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ శాఖను తిరిగి తాము బలోపేతం చేశామని వివరించారు. గతంలో నిర్మించి మధ్యలో వదిలేసిన ఇళ్లకు కూడా ఇందిరమ్మ పథకం వర్తింపజేయాలని తాము ఆలోచిస్తున్నామని చెప్పుకొచ్చారు. రూరల్‌లో, అర్బన్‌లో ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు కూడా త్వరలో శుభవార్త చెబుతామని పేర్కొన్నారు. ఒక విడతలోనే ఇళ్లు ఇచ్చి తాము చేతులు దులుపుకోమని చెప్పుకొచ్చారు. హిల్ట్‌పాలసీ పై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మిగతా 2లో..

## బా'భౌ'య్

హైదరాబాద్‌లో మరో బాలుడిపై వీధికుక్క దాడి

2లో..

## ఏసీబికి చిక్కిన హనుమకొండ అడిషనల్ కలెక్టర్

2లో..

## సీడీఎఫ్‌గా మునీర్

కీలక బాధ్యతలు అప్పగిస్తూ పాక్ సంచలన నిర్ణయం

2లో..

## సీఎం ఆదేశిస్తే రాజీనామాకూ వెనుకాడను

## బీసీ రిజర్వేషన్లతో కాంగ్రెస్ మోసం

- సాయి ఈశ్వర్ మరణానాకి ప్రభుత్వానిదే బాధ్యత
- అతని కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌లు డిమాండ్




హైదరాబాద్(జనంసాక్షి):సాయిఈశ్వర్ మరణానాకి ప్రభుత్వానిదే బాధ్యతని బిఆర్ఎస్ ఆరోపించింది. బిసి రిజర్వేషన్ల పేరుతో మోసం చేయడం వల్లనే అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడని విమర్శించింది. బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి చేసిన దారుణమైన మోసానికి సాయి ఈశ్వర్ అనే యువకుడి నిండు ప్రాణం బలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడాన్ని తట్టుకోలేకే ఈశ్వర్ ఆత్మాహుతి చేసుకున్నాడని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికే కుదించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచారని కేటీఆర్ మండిపడ్డారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా సాయి ఈశ్వర్ మరణానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కులగణనను మొదలుకుని న్యాయస్థానాల్లో నిలబడని జీవోల దాకా కాంగ్రెస్ ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా కామారెడ్డి డిక్లరేషన్‌కు సమాధి కట్టిందని కేటీఆర్ అన్నారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి మిగతా 2లో..

# శరణార్థులకు శరాఘాతం




### వర్క్ పర్మిట్లపై కాలవ్యవధి కుదింపు • అమెరికా కీలక నిర్ణయం..!

వాషింగ్టన్(జనంసాక్షి):వలసదారులపై కఠిన విధానాలు అమలుచేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. శరణార్థులకు ఇచ్చే వర్క్ పర్మిట్‌ల కాలవ్యవధిని కుదిస్తున్నట్లు యూఎస్ సిటిజన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్ ఓ ప్రకటనలో తెలిపింది. శరణార్థులు, ఆశ్రయం పొందాలనుకునేవారు, గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నవారు అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ కార్డ్ కింద అనుమతులు జారీ చేస్తారు. దీనికి అయిదేళ్ల కాలవ్యవధి ఉండేది. తాజా సవరణలతో దాన్ని 18 నెలలకు కుదించారు. భద్రతా కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఎస్‌సీఐఎస్ తెలిపింది. ఇటీవల అధ్యక్ష భవనానికి సమీపంలో ఇద్దరు నేషనల్ గార్డులపై ఓ దుండగుడు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దేశంలోకి వలస వచ్చేవారిపై కఠిన సమీక్షలు అవసరమని ట్రంప్ పరిపాలనా యంత్రాంగం భావిస్తోంది. ఈ క్రమంలోనే వర్క్ పర్మిట్ల కాలవ్యవధిపై నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.



ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ అనేది ఓ వ్యక్తికి నిర్దిష్ట కాలవ్యవధి వరకు అమెరికాలో పని చేసేందుకు అధికారం ఉందని నిరూపించే పత్రం. ఇది ఉంటేనే వలసదారులు అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు అనుమతులు లభిస్తాయి. గ్రీన్‌కార్డు పెండింగ్‌లో ఉన్నవారు, వారి జీవిత భాగస్వాములు, పిల్లలు, ఎఫ్-1, ఎం-1 వీసాలపై వచ్చే విద్యార్థులు, డిపెండెంట్ వీసాలపై వచ్చేవారు అమెరికాలో ఉద్యోగం చేయాలనుకుంటే అవసరమైన పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది.

## హైకోర్టుకు 'హిల్ట్'

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ

హైదరాబాద్(జనంసాక్షి):హిల్ట్ పాలసీపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. హిల్ట్ పాలసీపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిటిషన్లు దాఖలు చేశారు. 9,292 ఎకరాల భూ కేటాయింపుల విషయంలో రూపొందించిన జీఓ నిబంధనలకు విరుద్ధంగా ఉందని హైకోర్టుకు ఆయన తెలిపారు. దీనిపై సీబీఐ లేదా ఈడీ దర్యాప్తు చేయించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు ఉన్న రికార్డులను సీజ్ చేసి ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని కోర్టుకు విన్నవించారు. మిగతా 2లో..

## తెలంగాణ అభివృద్ధిలో రైజింగ్ గ్లోబల్ సమిట్ కీలకపాత్ర

వ్యాపార, సాంకేతిక నైపుణ్యాలు, అంతర్జాతీయ ప్రతిభ అభివృద్ధికి సమ్మిట్ మరింత తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 8, 9వ తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ నిర్వహించనున్నందుకు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోనియాగాంధీ అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చేస్తున్న కృషి విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. సదస్సులో పాల్గొననున్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు

స్పందించారు. హిల్ట్ పాలసీపై కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ అధికారంలోకి వస్తే హిల్ట్ పాలసీ రద్దు చేస్తామని అంటున్నారని... నోటికొచ్చినట్లుగా కేటీఆర్ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ అని.. వారి హయాంలో ఇష్టం వచ్చినట్లుగా చేశారని ఫైర్ అయ్యారు. తమ ప్రభుత్వం చాలా వినూత్న నిర్ణయాలు తీసుకుంటుందని.. కేసీఆర్ హయాంలో లాగా తాము చేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## బీసీ రిజర్వేషన్లతో కాంగ్రెస్ మోసం

ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి ఆడిన రాక్షస రాజకీయ క్రీడలో తమ్ముడు సాయి ఈశ్వర్ బలైపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. బీసీ బిడ్డ ఆత్మబలిదానానికి కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీ సమాజం ఎన్నటికీ క్షమించదని తెలిపారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్య అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అధికార దాహానికి బలైన ప్రాణం ఇది అని పేర్కొన్నారు. సాయి ఈశ్వర్ ఆత్మకు శాంతి కూరాలని ఆ దేవుడిని హరీశ్‌రావు ప్రార్థించారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, రూ. 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని సాయి ఈశ్వర్ ఇటీవల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తీన్మార్ మల్లన్నను కలవడానికి వెళ్లిన సాయిఈశ్వర్ గురువారం సాయంత్రం.. ఆయన ఆఫీసు ముందు పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు ÷రిరజన్, పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న వారు మంటలను ఆర్పివేసి సాయిఈశ్వర్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయిఈశ్వర్ ప్రాణాలు కోల్పోయాడు

## సీడీఎఫ్‌గా మునీర్

### కీలక బాధ్యతలు అప్పగిస్తూ పాక్ సంచలన నిర్ణయం

**ఇస్లామాబాద్(జనంసాక్షి):** దాయాది దేశం పాకిస్తాన్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు ఆ దేశ ప్రభుత్వం ఉన్నత పదవిని కట్టబెట్టింది.పాకిస్తాన్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ గా ఆసిమ్ మునీర్‌ను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పాక్ అధ్యక్ష కార్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో, ఆసిమ్ మునీర్‌కు మరిన్ని అధికారులు లభించే అవకాశం ఉంది.భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ ఆర్మీని బలోపేతం చేసే దిశగా పాకిస్తాన్ అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే పాక్.. తమ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ దళాలను ఏకీకృతం చేసేందుకు సీడీఎఫ్ పదవిని సృష్టించింది. ఇందుకు షహబాజ్ షరీఫ్ ప్రభుత్వం 27వ రాజ్యాంగ సవరణ చేసింది. మరోవైపు.. పాక్ ఆర్మీ చీఫ్‌గా పనిచేసిన మునీర్ పదవీ కాలం గత నెల 29తో ముగిసింది. దీంతో, సీడీఎఫ్ పదవిని ఆసిమ్ మునీర్‌కు ఇవ్వాలని ప్రభుత్వం భావించింది.ఈ నేపథ్యంలో ఐదేళ్ల కాలానికి ఏక కాలంలో సైనిక దళాల చీఫ్‌గా వ్యవహరించేందుకు సీడీఎఫ్ పదవికి ఆసిమ్ మునీర్‌ను నియమించాలని పాక్ ప్రధాని సమర్పించిన సిఫార్సును అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ ఆమోదించారు. ఈ మేరకు పాక్ అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. ఈ నియామకంతో పాక్‌లో అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా మునీర్ నిలవనున్నారు. న్యాయపరమైన విషయాల్లో అధ్యక్షుడితో సమానంగా రక్షణ పొందనున్నారు. ఆయన్ను ప్రాసిక్యూట్ చేసే అవకాశం కూడా ఉండదు. ఐదేళ్ల పాటు ఈ పదవిలో మునీర్ కొనసాగనున్నారు.

## ఏసీబికి చిక్కిన హనుమకొండ అడిషనల్ కలెక్టర్

### రూ. 60వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత

**హన్మకొండ ప్రతినిధి(జనంసాక్షి):** లంచం తీసుకోవడం నేరం అని అవగాహన కల్పించాల్సిన అధికారులే లంచాలకు ఆశపడుతున్నారు. లంచగొండి ఉద్యోగులను ఏసీబీ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొందరు అధికారుల్లో మాత్రం మార్పురావడం లేదు. తాజాగా హనుమకొండ అడిషనల్ కలెక్టర్ ఏసీబీకి పట్టుబడ్డారు. రూ. 60 వేలు లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. హనుమకొండ అదనపు కలెక్టర్, జిల్లా ఇన్‌ఛార్జి విద్యాశాఖ అధికారి వెంకట్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన రూ.60,000 లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. విద్యాశాఖ వ్యవహారానికి సంబంధించి ఈ లంచం తీసుకున్నట్లు సమాచారం. వెంకట్ రెడ్డితో పాటు మరో ఉద్యోగిని కూడా ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. ఇంకా హనుమకొండ కలెక్టరేట్లో ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నారు. హనుమకొండ కలెక్టరేట్ లో రైడ్స్ చేసిన ఏసీబీ అధికారులు.. ఓ ప్రైవేట్ స్కూల్ రెన్యువల్ చేసేందుకు సంస్థ యాజమన్యం నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు. వెంకట్ రెడ్డి ప్రస్తుత హనుమకొండ డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ స్కూల్ రెన్యువల్ కోసం లంచం డిమాండ్ చేసి రూ. 60 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

## హైకోర్టుకు హైడ్రా కమిషనర్

### ధర్మాసనానికి రంగనాథ్ క్షమాపణ

**హైదరాబాద్(జనంసాక్షి):** హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలంగాణ హైకోర్టుకు హాజరై క్షమాపణ చెప్పారు. బతుకమ్మకుంట కేసు విచారణలో భాగంగా ఆయన హాజరయ్యారు. ఈ కేసులో హైడ్రాపై ఎ.సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈక్రమంలో న్యాయస్థానం ఆదేశాలతో రంగనాథ్ శుక్రవారం కోర్టుకు వచ్చారు. గతంలోనే హాజరు కావాల్సి ఉండగా హాజరు కాలేదు. దీంతో హైకోర్టు తీవ్రంగా పరిగణించి ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆయన హాజరయ్యారు. హైదరాబాద్ బతుకమ్మకుంట పరిధిలోని ప్రైవేటు స్థలానికి సంబంధించి యథాతథస్థితిని కొనసాగించాలని జూన్ 12న ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలంటూ సుధాకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అక్టోబరు 31న విచారించిన హైకోర్టు.. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో నవంబరు 27న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే బాచుపల్లిలో అత్యవసర పనులు ఉన్నందున హాజరుకా లేకపోతున్నానని.. మినహాయింపు కోరుతూ రంగనాథ్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ బి.ఆర్.మధుసూదన్‌రావులతో కూడిన ధర్మాసనం నవంబర్ 27న విచారణ చేపట్టింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది స్వరూప్ ఊరిళ్ల వాదనలు వినిపిస్తూ తప్పనిసరి అధికారిక విధులతోపాటు, తన హాజరుతో కోర్టును ఇబ్బంది పెట్టరాదన్న కారణంగా మినహాయింపు కోరుతున్నారనగా ధర్మాసనం తీవ్రంగా స్పందిస్తూ ఆయన కోర్టు పట్ల చూపిన దయకు అభినందనలు తెలియజేస్తున్నామని వ్యాఖ్యానించింది.

## మార్చిలో వరంగల్ విమానాశ్రయపనులు ప్రారంభిస్తాం



ఫాంహౌస్ లు కట్టుకున్నారు, విమానాలు కొన్నారు.. ఉద్యమగడ్డ వరంగల్ కు మాత్రం ఏమీ ఇవ్వలేదని ఘాటు విమర్శలు చేశారు. గత పాలకులు రైతు రుణమాఫీ చేయలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేసింది.. రాష్ట్రంలో కోటి 10 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం.. 3 కోట్ల 10 లక్షల మందికి ఈ ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయం కోసం గత సీఎం కేసీఆర్ ఏనాడూ ప్రయత్నించలేదు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి కొత్తగా ఒక్క ఎయిర్‌పోర్టు ను కూడా సాధించలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా శుక్రవారం నర్సంపేటలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.508 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. వరంగల్ పర్యటనకు వస్తే స్ఫూర్తి కలుగుతుందన్నారు. పోరాట యోధుల స్ఫూర్తితో పాలన కొనసాగిస్తున్నామని.. కానీ గత పాలకులు ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నరు.. కార్లు కొన్నారు.. పదేండ్లు పాలించిన వాళ్లే ఆస్తులు పెంచుకున్నారని ఆరోపించారు. ఈ ప్రాంత ప్రజలకు పదేండ్లలో ఏమీ రాలేదన్నారు. వరి వేస్తే ఉరి అని ఆనాడు కేసీఆర్ అన్నారు.. కానీ మేం సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామని తెలిపారు. దుక్కిదున్నే ప్రతి రైతుకు 24 గంటల కరెంటు ఇస్తున్నామని.. ఉచిత కరెంట్ పేటెంట్ హక్కు కాంగ్రెస్‌దేనని స్పష్టం చేశారు. రెండేండ్ల క్రితం గడీలను కూల్చి ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని.. పదేండ్లు దోచుకున్న వారి గడీలకు కరెంటు పీకేశామన్నారు. మార్చి 31లోపు వరంగల్ ఎయిర్ పోర్టు పనులు స్టార్ట్ చేస్తామని తెలిపారు. ఈ నెలాఖరులోపు మమునూరు ఎయిర్ పోర్టు భూసేకరణ పూర్తి అవుతుందని చెప్పారు. పదేళ్లలో కేసీఆర్ ఒక్కరోజైనా వరంగల్ ఎయిర్ పోర్టు గురించి ఆలోచించాడా అని ప్రశ్నించారు. విదేశాలలో చదువుకున్నామని పొడుగుపోడుగు మాటలు చెప్పే వాళ్లకు తెలంగాణలో రెండవ ఎయిర్ పోర్టు తేవాలనే సోయి ఎందుకు లేదని నిలదీశారు. వరంగల్ గడ్డకు చెందిన ఎందరో వీరులు తమ పరాక్రమాన్ని ప్రపంచానికి చూపారు. కాకతీయ యూనివర్సిటీ పోరాటాలు ఎప్పుడూ స్ఫూర్తినిస్తాయి. తెలంగాణ వస్తే.. సమస్యలు పరిష్కారం అవుతాయని ఈ జిల్లా ప్రజలు ఆశించారు. కుర్చీలో కూర్చున్న వారి ఆస్తులు పెరిగాయి కానీ, ప్రజల జీవితాలు మారలేదు. మీ ఓటునే ఆయుధంగా మార్చి.. గడీల పాలనను కూల్చారు. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తవుతోంది. వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్టే అని ఆనాటి సీఎం కేసీఆర్ అన్నారు. ఈ ప్రభుత్వం మాత్రం.. రైతు పండించిన చివరి గింజ వరకు కొంటోంది. కాంగ్రెస్ వస్తే.. కరెంట్ ఉండదని ఆనాటి సీఎం దుష్ప్రచారం చేశారు. రైతు బంధు బంద్ అవుతుందని ప్రజలను బెదిరించారు. కాంగ్రెస్ పవర్‌లోకి వచ్చాక.. రాష్ట్రాన్ని దోచుకున్న వారి పవర్ మాత్రమ్ కట్ అయ్యింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌పై పేటెంట్ హక్కు ఉన్నది కాంగ్రెస్‌కు మాత్రమే. గత సీజన్‌లో 9 రోజుల్లోనే రూ.9వేల కోట్లను రైతు భరోసా కింద ఇచ్చాం. ఈ దేశంలో వరి అత్యధికంగా పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు పేదలకు కొత్తగా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో 1.10 కోట్ల రేషన్ కార్డుల ద్వారా.. 3.10 కోట్ల మంది లబ్దిదారులకు సన్నబియ్యం ఇస్తున్నాం. రేషన్ కార్డుల్లో కొత్తవారికి చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించాం. సన్నబియ్యం ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నాం అని సీఎం అన్నారు. రేవంత్ తో సహా వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి. వరంగల్ ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు సీఎం రేవంత్ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నర్సంపేటపై వరాల జల్లు కురిపించారు సీఎం రేవంత్. రూ.532.24 కోట్లతో నర్సంపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు సీఎం. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ÷ఔ.130 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, వసతి గృహాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు రూ. 56.40 కోట్లతో నర్సంపేట నుంచి నెక్కొండ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 20 కోట్లతో నర్సంపేట పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వైఎస్ హయాంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి పేదవాళ్లకు ఇచ్చారు.. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చి పేదల్ని మోసం చేశారు.. పేదల ఆత్మ గౌరవం పెంచేందుకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం.. 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ కు ఏమేమి ఉన్నాయో వరంగల్ కు కూడా అవే తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. మార్చి 31 లోపల వరంగల్ లో ఎయిర్ పోర్టును ప్రారంభించుకుంటామన్నారు. వరంగల్ లో అండర్ డ్రైనేజ్, ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించుకుంటాం.. సౌర విద్యుత్ ని ఉత్పత్తి చేసే బాధ్యతను మహిళలకు అప్పగించామని సీఎం వెల్లడించారు.

## సీఎం ఆదేశిస్తే రాజీనామాకూ వెనుకాడను

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం వ్యాఖ్యలు

**హైదరాబాద్(జనంసాక్షి):** రాజీనామాపై ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజీనామా అంశాన్ని సీఎం నిర్ణయంతో ముడిపెట్టాడు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే రాజీనామా చేయమని వెనకాడనన్నారు. తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఫైట్ చేయడం, గెలవడం తన రక్తంలోనే ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని హిమాయత్‌నగర్, నారాయణగూడలో రూ.1.40కోట్లతో చేపట్టనున్న డ్రైనేజీ, రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అనర్హత వేటు అంశంపై దానం స్పందించారు. రాజీనామా ప్రస్తావన ఇంకా రాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. నాకు ఎన్నికలు కొత్త కాదు.. ఇప్పటికి 11 సార్లు కొట్లాడిన చరిత్ర ఉంది. అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. నా వాదనలు వినిపిస్తానని అన్నారు. రేవంత్‌రెడ్డి మరో పదేళ్లు సీఎంగా కొనసాగితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుంది. రైజింగ్ తెలంగాణ కోసం తలపెట్టిన గ్లోబల్ సమ్మిట్‌ను ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తుందని దానం నాగేందర్ అన్నారు. అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుతుందని గుర్తు చేశారు. 'సుప్రీం కోర్టులో అప్పీల్ చేశా.. కేసు కోర్టులో పెండింగ్ ఉంది.. స్పీకర్ దగ్గర కూడా అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉంది.. సుప్రీంకోర్టులో నా వైపు నుంచి వాదనలు వినిపిస్తా.. సందర్భాన్ని బట్టి రాజీనామాపై నిర్ణయం తీసుకుంటా.. సీఎం ఎలాంటి నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉంటా.. ఎన్నికలు ఎదుర్కోవడం నాకు కొత్తేం కాదు.. ఎన్నో ఎన్నికలు చూశా.. రేవంత్ రెడ్డి మరో పదేళ్ల పాటు సీఎంగా కొనసాగితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని వ్యాఖ్యానించారు.

## డిజిటల్ రూపంలో తెలంగాణ విజన్ డాక్యుమెంట్

### సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను డిజిటల్ రూపంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గ్లోబల్ సమిట్‌ను దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు స్థాయిలో నిర్వహించాలని సీఎం చెప్పారు. ప్రజాభవన్‌లో గ్లోబల్ సమిట్ వార్ రూమ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించి.. ఏర్పాట్లపై సమీక్షించారు. తెలంగాణ దీర్ఘకాలిక భవిష్యత్ లక్ష్యాలు, ప్రపంచంతో పోటీ పడే సామర్థ్యాన్ని ప్రతిబింబించేలా విజన్ డాక్యుమెంట్‌కు తుది మెరుగులు దిద్దాలని అధికారులకు సీఎం చెప్పారు. విజన్ డాక్యుమెంట్‌ను డిజిటల్ రూపంలో ప్రజలకు అందుబాటులో ఉంచి.. పారదర్శకతకు, ప్రజల భాగ స్వామ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణ సామర్థ్యం, ఆకాంక్ష, వ్యూహాత్మక ప్రాధాన్యతలను ప్రతిపాదించేలా సదస్సు ఉండాలని సీఎం స్పష్టం చేశారు.

## రెపోరేటును మరో 25 బేసిన్ పాట్లు తగ్గింపు

మరోసారి ఏకంగా 50 పాయింట్ల మేర కోత విధించింది. దీంతో 2025 ఏడాదిలోనే మొత్తం రెపో రేటు 1.25 మేర తగ్గింది. మొత్తంగా ఏడాది ముగింపు దశలో ఈ ఏడాది ఇప్పటికే వడ్డీ రేట్లపై ట్రిపుల్ బొనాంజా ప్రకటించిన ఆర్‌బీఐ.. మరోసారి గుడ్‌న్యూస్ చెప్పింది. దీంతో రెపో రేటు 5.25 శాతానికి దిగొచ్చింది. రూపాయి పతనం కొనసాగుతున్నప్పటికీ ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయికి పడిపోవడం, వృద్ధిరేటు పెరగడంతో రేట్ల కోత చేపట్టినట్లు మల్హోత్రా వెల్లడించారు. వడ్డీ రేట్లను తగ్గించడంతో గృహ, వాహన రుణ గ్రహీతలకు మరికొంత ఉపశమనం లభించినట్లయ్యింది. జీఎస్టీ హేతుబద్ధీకరణతో కొనుగోళ్లు పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 8.2శాతం వృద్ధి నమోదైంది. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ వృద్ధి రేటు అంచనాలను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నాం. ద్రవ్యోల్బణం కూడా తగ్గుముఖం పట్టింది. అందువల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాలను 2.6శాతం నుంచి 2 శాతానికి తగ్గిస్తున్నాం అని ఆర్‌బిఐ గవర్నర్ వివరించారు. రూ.1 లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీస్‌ల విక్రయాల కోసం ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్‌ను నిర్వహించాలని నిర్ణయించాం. విదేశీ మారక నిల్వలు 686 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఇవి ఉపయోగపడతాయి.



## పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు

వెల్లడించారు. అనంతరం ఈ బిల్లు మజూవాణి ఓటుతో లోక్‌సభలో ఆమోదం పొందింది. పాన్ మసాలా, ఈ తరహా ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లకు ఈ సెస్సు విధిస్తారు. జాతీయ ఆరోగ్యం, జాతీయ భద్రత వంటి అంశాలకు ఈ నిధులను వినియోగిస్తామని నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రస్తుతం పాన్ మసాలాపై జీఎస్టీలో గరిష్ఠ శ్లాబు అయిన 40 శాతం విధిస్తున్నట్లు చెప్పారు. సెస్సు వల్ల జీఎస్టీ రెవెన్యూపై ఎలాంటి ప్రభవమూ పడబోదని వివరించారు. తయారీ సామర్థ్యం ఆధారంగా ఈ సెస్సును విధించనున్నట్లు తెలిపారు. 2010-2014 మధ్య సెస్సుల రూపంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం 7 శాతంగా ఉండగా.. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో ఆ మొత్తం 6.1 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు.

## బా'భౌ'య్

### మరో బాలుడిపై వీధికుక్క దాడి

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్‌లో మరో బాలుడిపై వీధి కుక్కలు దాడికి తెగబడ్డాయి. యూసుఫ్‌గూడ పరిధిలోని శ్రీలక్ష్మీనరసింహనగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న మాన్విత్ నందన్ అనే రెండేళ్ల చిన్నారిపై వీధి కుక్క దాడికి దిగింది. చిన్నారి చేతిని కరిచే ప్రయత్నం చేసింది. అక్కడే ఉన్న బాలుడి తాత అప్రమత్తమై కర్రతో కొట్టడంతో వీధికుక్క అక్కడి నుంచి వెళ్లిపోయింది. అనంతరం గాయాలపాలైన బాలుడిని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, వీధికుక్కల విజృంభణపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో వీధి కుక్కల దాడులు జరుగుతున్నా, ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.

## 'హిల్ట్' హైకోర్టులో విచారణ

పిటిషనర్ వాదనలు విన్న ధర్మాసనం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. వెంటనే రిప్లై ÷ల్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 29వ తేదీకి వాయిదా వేసింది హైకోర్టు.

## కోకాపేటలో నాలుగో విడత వేలం..

### రూ.3,862 కోట్లు దాటిన హెచ్‌ఎండీఏ ఆదాయం

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కోకాపేటలోని నియోపోలిస్‌లో వేలంపాటను విజయవంతంగా పూర్తి చేసింది. వేలంలో ఈసారి హెచ్‌ఎండీఏ ఆదాయం రూ.3,862 కోట్లు దాటింది. నియోపోలిస్ స్థలాలకు భారీగా డిమాండ్ ఉండటంతో పలు రకాల వ్యాపార, వాణిజ్య సంస్థలు పోటీపడి భూములను దక్కించుకున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఈ-వేలంలో 1.98 ఎకరాల గోల్డెన్ మైల్ స్థలాన్ని ఓ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎకరా రూ.77.75 కోట్లకు దక్కించుకుంది. దీంతో ఇప్పటి వరకు నాలుగు విడుతలుగా జరిగిన వేలం పాటలో హెచ్‌ఎండీఏ ఆదాయం గతేడాది కంటే 87 శాతం వృద్ధి సాధించింది.

## మా బంధం బలమైనదే..

పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయిల్ సహా అన్ని రంగాల్లో సహకారం అందిస్తాం. ఉమ్మడి ప్రాజెక్టులు, సాంకేతిక అంశాల్లో పరస్పర సహకారం ఉంటుంది. సొంత కరెన్సీల్లో ఇరుదేశాల మధ్య వాణిజ్యం జరుగుతోంది. కొడంకుళం అణువిద్యుత్ ప్రాజెక్టుకు సహకరిస్తాం. విద్యుత్ రంగంలో ఖర్చు తగ్గింపునకు సాయం అందిస్తాం. భారత్‌తో కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్‌కు నిరంతరంగా ఇంధనాన్ని సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందని అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. వచ్చే ఏడాది భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందన్నారు. భారత్‌కు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామన్నారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపటానికి ప్రధాని మోదీ ఎంతో ప్రయత్నిస్తున్నారని చెప్పారు. యుద్ధం ఆపే ప్లాన్ గురించి తనకు వివరించి చెప్పారని అన్నారు. అమెరికా లాంటి దేశాల నుంచి వాణిజ్య ఒత్తిడులు ఎదురైతున్నప్పటికీ .. భారత్-రష్యా మధ్య ఇంధన సరఫరా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పశ్చిమ దేశాల నుంచి వస్తున్న ఒత్తిడుల కారణంగా కొంతకాలంగా చమురు దిగుమతులను భారత్ తగ్గించినప్పటికీ.. ఆ దేశాభివృద్ధికి సహకరించడం కోసం సరఫరాను పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గతేడాది భారత్-రష్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 12 శాతం పెరిగి.. రికార్డు సృష్టించిందని రష్యా అధ్యక్షుడు అన్నారు. ఈ ఏడాది కూడా ఇదే స్థాయిలో పెరుగుదల ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ సహకారాన్ని కూడా మరింత విస్తరిస్తామని తెలిపారు. రష్యా దృష్టి పెట్టాల్సిన కీలక సవాళ్ల గురించి మోదీ తనతో చర్చించారని.. భారత్-యురేషియా ఆర్థిక సంఘం మధ్య స్వేచ్ఛా వాణిజ్య మండలాన్ని సృష్టించడం వంటి వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. అంతే కాకుండా భారత్-రష్యా క్రమంగా చెల్లింపుల కోసం తమ జాతీయ కరెన్సీలను ఉపయోగించే దిశగా కదులుతున్నాయని.. దాదాపు 96 శాతం వాణిజ్య చెల్లింపులు జాతీయ కరెన్సీలలోనే జరుగుతున్నాయన్నారు. మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై పోరుకు భారత్- రష్యా కలిసి నడుస్తాయన్నారు. ఇటీవల పహల్గాంలో జరిగిన దాడికి, గతేడాది రష్యా రాజధాని మాస్కో లోని క్రాకస్ సిటీ కాన్సర్ట్ హాల్‌లో జరిగిన దాడికి మూల కారణం ఉగ్రవాదమేనని అన్నారు. మానవత్వ విలువలపై చేస్తున్న ఈ ప్రత్యక్ష దాడులకు వ్యతిరేకంగా ఉగ్రవాదంపై పోరుకు ఇరుదేశాలు ఏకమైనట్లు తెలిపారు. భారత్, రష్యా, యూఎన్, జీ20, బ్రిక్స్ వేదికలు సన్నిహిత సహకారాన్ని కలిగి ఉన్నాయని.. ఈ వేదికలన్నింటిలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని కొనసాగిస్తామన్నారు. దైత్యంతోనే రష్యా, ఉక్రెయిన్‌లు విభేదాల పరిష్కారం శాంతిపక్షానే భారత్ నిలుస్తుందని, ఉక్రెయిన్ సంక్షోభాన్ని శాంతియుతంగా, చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు సహకరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్ తో శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రధాని పాల్గొన్నారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ, దేశాల సంక్షేమం శాంతి మార్గంలోనే ఉందని, దౌత్యం ద్వారానే రష్యా, ఉక్రెయిన్‌లు విభేదాలను పరిష్కరించుకుంటారనే నమ్మకం తనకు ఉందని చెప్పారు. భారత్, రష్యా కలిసి ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపిద్దామని పుతిన్‌తో అన్నారు. ఉక్రెయిన్ సంక్షోభం మొదలైనప్పటి నుంచి పుతిన్ ప్రభుత్వం భారత్‌పై విశ్వాసం ఉంచి ప్రతి విషయాన్ని తమతో పంచుకుందని మోదీ అన్నారు. ఇరుదేశాల మధ్య నమ్మకం అనేది గొప్ప బలమని, ఇదే విషయాన్ని తాము పదేపదే చెబుతూ వచ్చామని, ప్రపంచానికి కూడా తెలియజేశామని అన్నారు. ఇటీవల కాలంలో గ్లోబల్ నేతలతో తాను ఎప్పుడు మాట్లాడినా ఇండియా తటస్థం కాదనీ, ఇండియాకు స్పష్టమైన వైఖరి ఉందని, శాంతియుతంగా జరిగే ఏ పరిష్కారానికైనా తమ మద్దతు ఉంటుందని చాలా స్పష్టంగా చెప్పామని మోదీ తెలిపారు. భారత్-రష్యా మధ్య భాగస్వామ్యానికి ఇంధన భద్రత అనేది బలమైన స్తంభం వంటిందని, పరస్పర లాభదాయక సహకారాన్ని తాము కొనసాగిస్తామని మోదీ చెప్పారు. సివిల్ న్యూక్లియర్ ఎనర్జీలో తమ భాగస్వామ్యం దశాబ్దాల నాటిదని, క్రిటికల్ మినిరల్స్ అంశంలోనూ పరస్పర సహకారం తప్పనిసరని అన్నారు.

## స్థంభించిన ఇండిగో సేవలు

అందుకే.. అన్ని వ్యవస్థలు, షెడ్యూల్‌లను రీబూట్ చేయాలని నిర్ణయించాం. ఫలితంగా నేడు భారీ సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయ్యాయి. రేపటి నుంచి పరిస్థితులు మెరుగుపడాలంటే ఈ చర్యలు తప్పనిసరి. దీంతో శనివారం 1000 కన్నా తక్కువ సర్వీసులు రద్దవుతాయని అంచనా వేస్తున్నాం. ఎఫ్‌డీటీఎల్ (ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్) విషయంలో డీజీసీఏ తీసుకున్న ఉపశమన చర్యలు చాలా దోహదపడ్డాయి" అని పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు.ఇండిగో నిత్యం దాదాపు 2300 జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను నడుపుతోంది. కొన్ని రోజులుగా వందల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దుకాగా.. శుక్రవారం ఆ సంఖ్య వెయ్యి దాటినట్లు అంచనా. సాంకేతిక లోపాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, షెడ్యూల్ మార్పులు, అప్‌డేట్ చేసిన సిబ్బంది రోస్టరింగ్ నియమాల (ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్) అమలు వంటి అంశాలు ఈ సంక్షోభానికి కారణాలుగా తెలుస్తున్నాయి.

### ఉన్నతస్థాయి దర్యాప్తునకు కేంద్రం ఆదేశం

నిర్వహణపరమైన లోపాల కారణంగా దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దాంతో వేలాది మంది ప్రయాణికులు అవస్థలు పడుతుండగా.. ఈ గందరగోళం ఇప్పుడప్పుడే కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం రంగంలోకి దిగింది. శుక్రవారం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. సేవల్లో అంతరాయానికి గల కారణాలను విచారించనుంది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. మొత్తం నలుగురు సభ్యులతో కూడిన కమిటీని పౌర విమానయాన శాఖ ఏర్పాటు చేసింది.ఈ కమిటీలో డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ సంజయ్ కె బ్రహ్మనే, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అమిత్ గుప్తా, సీనియర్ ట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ కెప్టెన్ కపిల్ మాన్‌గ్లిక్, ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ లోకేష్ రాంపాల్ ఉన్నారు. వీరు భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు చోటుచేసుకోకుండా కొన్ని సిఫార్సులు కూడా చేయనున్నారు. ఇక ప్రస్తుత పరిస్థితులపై పౌరవిమానయాన శాఖ నిరంతరం సమీక్ష జరుపుతోంది. విమాన కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్లు అందించేలా 24/7 అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. విమానయాన సంస్థలతో సమన్వయం, ప్రస్తుత సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే లక్ష్యంతో దీనిని అందుబాటులోకి తెచ్చారు. కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయాల్సిన నంబర్లు 011-24610843, 011-24693963, 096503-91859.

## ప్రభుత్వ గుత్తాధిపత్యమే కారణం..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సర్వీసుల్లో అంతరాయం కొనసాగుతుంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రభుత్వ గుత్తాధిపత్యమే దీనికి ప్రధాన కారణమంటూ ఆయన ఆరోపణలు చేశారు ఈ మేరకు శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రభుత్వ గుత్తాధిపత్యమే ఇండిగో విమానాల రద్దు, ఆలస్యాలకు ప్రధాన కారణాలన్నారు. ఎప్పటిలాగానే ఈ నిస్సహాయతకు సాధారణ పౌరులే మూల్యం చెల్లిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఇలాంటివి మరోసారి జరగకుండా ఉండేందుకు విమానయాన రంగంతో సహా అన్నింట్లోనూ న్యాయమైన పోటీ ఉండాలని పిలుపునిచ్చారు. మ్యాచ్‌ఫిక్సింగ్, గుత్తాధిపత్యాలు కాదంటూ మండిపడ్డారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. శివసేన యూబీటీ ఎంపీ ప్రియాంక చతుర్వేది రాజ్యసభలో పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకు నోటీసులు ఇచ్చారు.ఇండిగో విమానాల్లో అంతరాయం వల్ల దేశవ్యాప్తంగా అనేక మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వేల మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో చిక్కుకుపోయి తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. విమానాశ్రయాల కార్యకలాపాలు కూడా దెబ్బతిన్నాయన్నారు.

## అమెరికాలో అగ్నిప్రమాదం

- ఇద్దరు హైదరాబాద్ విద్యార్థుల మృతి

హైదరాబాద్, డిసెంబర్ 5 (జనంసాక్షి) : అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అపార్ట్‌మెంట్ కంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతిచెందారు. బర్మింగ్‌హామ్ లోని అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో పదిమంది తెలుగు విద్యార్థులు నివసిస్తున్నట్లు సమాచారం. హఠాత్తుగా చెలరేగిన మంటలతో ఉక్కిరిబిక్కిరైనా విద్యార్థులు.. అపార్ట్‌మెంట్‌లో ఫైర్ ప్రారంభమైన కాసేపటిలోనే ఘాటైన పొగ వెలువడడంతో విద్యార్థులు శ్వాస తీసుకోలేక భయంతో కేకలు వేశారు. ప్రాణ భయంతో వణికిపోయారు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు.లోపల చిక్కుకుపోయిన 13 మంది విద్యార్థులను అగ్నిమాపక సిబ్బంది బయటకు తీసుకొని వచ్చారు. ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హైదరాబాద్ చెందిన ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి చెందారు. మృతి చెందిన వారిలో ఉడుముల సహజ రెడ్డి, కూకట్ పల్లికి చెందిన మరొక విద్యార్థి ఉన్నట్లు సమాచారం. అలబామా యూనివర్సిటీలో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులుగా గుర్తించారు. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఆకట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం



వరంగల్ బ్యూరో, డిసెంబర్ 05 (జనం సాక్షి) : ప్రజా పాలన ప్రజా విజయోత్సవ వేడుకలకు నర్సంపేట నియోజకవర్గం లోని బహిరంగ సభకు హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం అధ్యంతం ఆకట్టుకుంది. సీఎం మాట్లాడుతున్నంత సేపు వేలాదిగా సభకు తరలివచ్చిన ప్రజలు కరతాల ధనులతో తమ సంఘీభావాన్ని వెలిబుచ్చారు. హైదరాబాదు నుండి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు సభా ప్రాంగణానికి వచ్చిన ముఖ్యమంత్రి ముందుగా సుమారు 600 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సభ వేదికపై వచ్చిన తర్వాత తెలంగాణ గీతం జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం గీతం సామూహికంగా ఆలపించారు. స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి అధ్యక్షతన సభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా సుమారు అరగంటకు పైగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ క్రమంలో భారత మొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో జరిగినటువంటి విద్యా , ఇరిగేషన్ అంశాలపై మాట్లాడారు. దేశంలో నాగార్జున సాగర్ , శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్, భాక్రానంగల్ ప్రాజెక్ట్ మొదలైనవి కాంగ్రెస్ హయాంలోనే నిర్మించినట్లు చెప్పారు. అదేవిధంగా వరంగల్లో కాకతీయ యూనివర్సిటీ ఏర్పాటు కూడా జరిగిందన్నారు. అందరూ చదువుకోవాలన్నారు చదివే మనకు ఉన్నత స్థాయికి తీసుకుపోతుందని గుర్తు చేశారు. విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వివరించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కాంగ్రెస్ నేత సోనియాగాంధీ తెలంగాణ ఇస్తే గత పది సంవత్సరాల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకపోగా వాళ్ళ ఇంట్లో ఉన్న వాళ్లకే ఉద్యోగాలు ఇచ్చుకున్నారని విమర్శించారు. అందుకే ప్రజలు టిఆర్ఎస్ కు బుద్ధి చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. అన్ని రంగాలను అభివృద్ధి చేయడంలో ముందుకు సాగుతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. సీఎం మాట్లాడుతున్నంత సేపు సభకు వచ్చిన వేలాదిమంది ప్రజలు ఆసక్తిగా విన్నారు. మధ్య మధ్యలో చప్పట్లు కొడుతూ తమ ఉత్సాహాన్ని చూపించారు.

## గోకారం బాధిత రైతాంగ ఉద్యమానికి పాలమూరు అధ్యయన వేదిక సంఘీభావం

- రైతాంగ సమస్యలు తీర్చాలని డిమాండ్

హైదరాబాద్ (జనంసాక్షి) : గోకారం రిజర్వాయర్ నిర్మాణ ప్రతిపాదన ఏనాడూ లేదు. గత సీఎం కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలం ప్రాజెక్టువైపు మార్చడంతో ఈ సమస్య ముందుకు వచ్చింది. దీన్ని ఒక అవకాశంగా తీసుకుని కొద్దిమంది ఇంజనీయర్లు ముఖ్యంగా శ్యాంప్రసాద్ రెడ్డి, సత్తిరెడ్డి అనేవారు పాలమూరు డిండి అనే ఎత్తిపోతల పథకాన్ని ముందుకు తెచ్చారని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం రాఘవచారి తెలిపారు. ఈ తప్పుడు ప్రతిపాదన వల్ల పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాకు తీవ్ర నష్టం వాటిల్లే దుస్థితి దాపురించిందన్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పట్టుదలతో పాలమూరు డిండి పనులు నడిపిస్తూ జిల్లాకు నష్టం చేస్తున్నారని, ఈ అన్యాయాన్ని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు సైతం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. గోకారం రిజర్వాయర్ బాధిత రైతాంగ పోరాటం న్యాయమైందని, రైతులకు న్యాయం చేయాలని, పాలమూరు డిండి పథకం రద్దు చేసి నల్లగొండ జిల్లాకు అవసరమైన నీటిని ఆ జిల్లా వనరుల నుంచి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.

## టెర్రస్‌పై గంజాయి మొక్కల పెంపకం

ఇద్దరు బీహారీలను అరెస్ట్ చేసిన పోలీసులు



హైదరాబాద్, డిసెంబర్5 (జనంసాక్షి) : టెర్రస్‌పై గంజాయి పెంచుతున్న ఇద్దరు బీహారీ వాసులను పోలీసులు అరెస్ట్ చేశారు. మలక్ పేట్ గంజ్ మిషన్ మార్కెట్లో ఒక భవనం టెర్రస్ పై బీహార్ కి చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయి మొక్కలను పెంచుతూ శుక్రవారం హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందికి పట్టుబడ్డారు. మహబూబ్ మాన్షన్ మార్కెట్ భవనంలో కింద మొత్తం మార్కెట్ షాపులుగా ఉన్నాయి. పైన టెర్రస్ లో బీహార్ కు చెందినటువంటి లవకుశ, బీమ్లేష్ అనే ఇద్దరు అద్దెకు ఉంటున్నారు. టెర్రస్ పై గత ఆరు నెలలుగా గంజాయి మొక్కలను పెంచుతూ వాటిని ఏపుగా పెరిగిన అనంతరం గంజాయిగా మార్చి అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. టెర్రస్ పై గంజాయి మొక్కలు పెంచుతున్నారనే సమాచారం అందుకున్న హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్ గౌడ్ ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బంది కలిసి టెర్రస్ పై దాడి నిర్వహించారు. ఈ దాడిలో మూడు నుంచి 6 మీటర్ల ఎత్తులో పెరిగినటువంటి ఐదు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి మొక్కలతో పాటు 55 గ్రాముల ఎండు గంజాయి రెండు సెల్‌ఫోన్‌లతో నిందితులను అరెస్ట్ చేశారు. ఈ గంజాయి చెట్ల నుంచి సుమారు 10 కిలో కేజీల గంజాయి దిగుబడిగా వచ్చే అవకాశాలు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం అంచనాలు వేశారు. నిందితులను గంజాయి మొక్కలను కాచిగూడ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సీఐ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.

## సోమాజిగూడ రెస్టారెంట్‌లో స్వల్ప అగ్నిప్రమాదం



హైదరాబాద్, డిసెంబర్5 (జనంసాక్షి) : సోమాజిగూడ లోని శ్రీకన్య కంఫర్ట్ రెస్టారెంట్ లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రెస్టారెంట్ కిచెన్ నుండి దట్టంగా పొగలు వెలువడ్డాయి. బిల్డింగ్ అయిదవ అంతస్తులో రెస్టారెంట్ ఉంది. భవనం నాలుగో అంతస్తులో ఉఖి జ్యూవెలర్స్ ఉంది. అయిదవ అంతస్తులో ఉన్న రెస్టారెంట్ నుండి పొగలు వెలువడ్డాయి. దీంతో అంతా భయాందోళనకు గురయ్యారు. ఉద్యోగులు, ఇతర పనులకు వెళ్లిన వారు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో అగ్నిప్రమాదం ఆందోళన కలిగించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి ఫైర్, డిజార్డర్ సిబ్బంది చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు ప్రారంభించి భవనం లోపల ఉన్న వారిని బయటికి తరలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## డబ్ల్యూటిఐటిసి ఇంటర్నేషనల్ స్టూడెంట్ చాప్టర్ జాయింట్ సెక్రటరీగా చుక్కా రాహుల్ రెడ్డి నియామకం

- 12న దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్లో ప్రమాణ స్వీకార మహోత్సవం



హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి (డబ్ల్యూటిఐటిసి) తమ ఇంటర్నేషనల్ స్టూడెంట్ చాప్టర్ జాయింట్ సెక్రటరీగా మిస్టర్ చుక్కా రాహుల్ రెడ్డిని నియమించింది. డబ్ల్యూటిఐటిసి గవర్నింగ్ కౌన్సిల్ ఆమోదం మేరకు ఈ నియామకం జరిగింది. ఖండాలకతీతంగా తెలుగు విద్యార్థులు, ఆవిష్కర్తలు మరియు ఔత్సాహిక నిపుణులను అనుసంధానించే డబ్ల్యూటిఐటిసి లక్ష్యాన్ని ఈ నియామకం మరింత బలోపేతం చేస్తుందని కౌన్సిల్ తెలిపింది. రాహుల్ రెడ్డి జాతీయ స్థాయి క్రికెటర్, డైనమిక్ విద్యార్థి నాయకుడు. ఎంటర్ప్రెన్యూర్షిప్ (వ్యవస్థాపకత), ఇన్నోవేషన్ (ఆవిష్కరణ) మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొంటున్నారు. వోక్సెన్ యూనివర్సిటీలో ఎంటర్ప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ కో-చైర్పర్సన్గా, ట్రేడ్ టవర్ ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్ సెంటర్ విద్యార్థి విభాగాధిపతిగా, ఎంటర్ప్రెన్యూర్షిప్ ఆపరేషన్స్ హెడ్గా, ఏకమ్ ఎంపవర్ చాప్టర్ స్ట్రాటజీ లీడ్గా, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కోహోర్ట్ లీడ్గా, వైఎఎన్‌సీ నెట్వర్కింగ్ క్లబ్ సభ్యుడిగా పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

క్యాంపస్ కార్యకలాపాలతో పాటు, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎస్ఎస్‌జీఎఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జాతీయ టోర్నమెంట్లలో హైదరాబాద్ తరపున ప్రాతినిధ్యం వహించారు. విద్య, క్రీడలు రెండింటిలోనూ రాణిస్తూ క్రమశిక్షణ, టీమ్ వర్క్ను ఆయన ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా యువ వ్యవస్థాపకులను ప్రోత్సహించడం, విద్యార్థుల ఆలోచనలను వ్యాపారాలుగా మలచడంలో ఆయన విశేష కృషి చేస్తున్నారు. ఈ నియామకంపై డబ్ల్యూటిఐటిసి చైర్మన్ సందీప్ కుమార్ మక్తాల మాట్లాడుతూ 'రాహుల్ రెడ్డి గ్లోబల్ తెలుగు నాయకత్వానికి కొత్త తరం ప్రతినిధి. ఆవిష్కరణలు, ఎంటర్ప్రెన్యూర్షిప్ పట్ల ఆయనకున్న అంకితభావం, విద్యార్థులను ప్రోత్సహించే తత్వం ఆయన్ను మా గ్లోబల్ స్టూడెంట్ కమ్యూనిటీకి నాయకత్వం వహించడానికి సరైన వ్యక్తిగా నిలబెట్టాయి. డబ్ల్యూటిఐటిసి ఆయనకు సాదర స్వాగతం పలుకుతోంది. దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్లో జరిగే డబ్ల్యూటిఐటిసి 2025 సదస్సులో ఆయన ప్రమాణ స్వీకారం చేస్తారు" అని తెలిపారు. తన నియామకంపై రాహుల్ రెడ్డి స్పందిస్తూ: "డబ్ల్యూటిఐటిసి ఇంటర్నేషనల్ స్టూడెంట్ చాప్టర్ జాయింట్ సెక్రటరీగా ఎంపిక కావడం గౌరవంగా భావిస్తున్నాను. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు విద్యార్థులను అనుసంధానించడం, వారికి అంతర్జాతీయ అవకాశాలు కల్పించడం మరియు బలమైన ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ను నిర్మించడం నా లక్ష్యం. దుబాయ్ వేదికగా జరగబోయే సదస్సు విద్యార్థులకు అద్భుతమైన అవకాశాలను కల్పిస్తుంది" అని అన్నారు.

### డబ్ల్యూటిఐటిసి గ్లోబల్ స్టూడెంట్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ 2025-26 ప్రారంభం

రాహుల్ రెడ్డి నియామకంతో పాటు, డబ్ల్యూటిఐటిసి 'గ్లోబల్ స్టూడెంట్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్'ను ప్రకటించింది. డిసెంబర్ 12-14, 2025 తేదీల్లో దుబాయ్లో జరగనున్న వరల్డ్ తెలుగు ఐటీ కాన్ఫరెన్స్ (డబ్ల్యూటిఐటిసి 2025) సందర్భంగా దీనిని ప్రారంభించనున్నారు.

దుబాయ్ టెక్ ఎక్స్పోజర్ టూర్: దుబాయ్ ఇంటర్నెట్ సిటీ, యాక్సిలరేటర్లు, ఇన్నోవేషన్ హబ్స్ మరియు అంతర్జాతీయ సంస్థల సందర్శన ఉండనుంది. విద్యార్థులు తమ పరిశోధనలు, ప్రోటోటైప్స్, ఆవిష్కరణలను ప్రదర్శించే అవకాశం కల్పిస్తున్నారు.

## ఆరోగ్య భద్రతపై పుకార్లను నమ్మవద్దు

- డిఎస్‌పి (వెల్ఫేర్) కె.శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్ (జనంసాక్షి) : పోలీసులకు ఇక నుంచి ఆరోగ్య భద్రత కేవలం నిమ్స్ ఆసుపత్రిలోనే అని సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను పట్టించుకోవద్దని వెల్ఫేర్ డి.ఎస్.పి కె .శ్రీనివాసరెడ్డి శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్య భద్రత చికిత్సలు యదావిధిగా కొనసాగుతున్నవి. అదనంగా ఎక్కువ ఖర్చుతో కూడిన దీర్ఘకాలిక చికిత్సలు నిమ్స్ ఆసుపత్రి లో చేయించుకుంటే పూర్తి మొత్తాన్ని ఆరోగ్య భద్రత నుండి చెల్లించడం జరుగుతుంది. పోలీస్ అధికారులు వైద్య సేవలు నిమిత్తము కార్పొరేట్ ఆసుపత్రి కి వెళితే రూ 5 నుంచి 7.5 లక్షల వరకు చికిత్స పొందవచ్చు. వారి కుటుంబ సభ్యులకు అయితే లక్ష నుంచి రెండు లక్షలు వరకు చికిత్స తీసుకోవచ్చు...ఇది ఒక ఏడాది లో ఎన్ని సార్లు అయిన పొందవచ్చు. అంత మొత్తం కన్నా ఎక్కువ ఖర్చు అయ్యే చికిత్సలు నిమ్స్ హాస్పిటల్ లో మొత్తము చికిత్స ఉచితంగా ఆరోగ్య భద్రత ఖర్చుపై పొందవచ్చును. అలాగే ఇప్పుడు ప్రయివేట్ హాస్పిటల్ లలో ఏవైతే ఏయిల్మెంట్స్ కవరేజ్ లో లేవో వాటికి కూడా నిమ్స్ లో చికిత్స చేయబడును.

## సీఎం ప్రజావాణిలో 367 దరఖాస్తులు

- దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య

హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 367 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 144, రెవెన్యూ శాఖకు సంబంధించి 23, ఇందిరమ్మ ఇండ్ల కోసం 83, మున్సిపల్ శాఖకు 18, పౌర సరఫరా శాఖకు 30 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 69 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలనుపరిష్కరించారు

### త్వరలో గ్రూప్-3 అభ్యర్థులకు పోస్టింగ్స్

పోటీ పరీక్షల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 1, 388 మంది పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 అభ్యర్థులకు త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రణాళికా వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి తెలిపారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన సీఎం ప్రజా భవన్ కు పెద్ద ఎత్తున గ్రూప్-3 అభ్యర్థులు తరలి వచ్చారు. తమకు పోస్టింగ్స్ త్వరగా ఇప్పించాలని వారు కోరారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్రటరీ ప్రియాంకతో ఫోన్ లో మాట్లాడిన చిన్నారెడ్డి త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు గ్రూప్-3 అభ్యర్థులకు తెలిపారు. దీంతో ఆ అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేశారు.

## నామినేషన్ల స్వీకరణ పక్కగా జరగాలి...

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద...



చెన్నారావుపేట, డిసెంబర్ 5 (జనం సాక్షి) : నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద సూచించారు. గ్రామ పంచాయతి మూడవ విడత ఎన్నికలకు సంబంధించి నర్సంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని చెన్నారావుపేట మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని అన్నారు. నామినేషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. మూడవ విడత నామినేషన్ల ప్రక్రియ చివరి రోజున ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నందున అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చివరి సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే నామినేషన్ తిరస్కరణకు గురవుతుందని అందుకని అభ్యర్థులు ముందు జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట జెడ్పి సీఈఓ రామిరెడ్డి, స్థానిక అధికారులు తదితరులు ఉన్నారు.

## ఎవరిని సంప్రదించకుండానే లేబర్ కోడ్లు

- కేంద్రం తీరుపై మండిపడ్డ మాజీ ఎంపి వినోద్



హైదరాబాద్, డిసెంబర్5 (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం ఎవరిని సంప్రదించకుండానే నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆరోపించారు. బీఆర్టీయూ అధక్షుడు రాంబాబు యాదవ్‌తో కలిసి శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక చట్టాలను కుదించి 29 కు పరిమితం చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను తెచ్చిందని మండిపడ్డారు. కార్మిక వర్గాలు ఈ కొత్త లేబర్ కోడ్స్‌పై ఆందోళనగా ఉన్నాయన్నారు. చట్టాలు పాస్ చేసే ముందు కార్మికు వర్గాల అభిప్రాయాన్ని కేంద్రం తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాలకు నిబంధనలు రూపొందించే క్రమంలో ఇప్పుడు కేంద్రం అభిప్రాయం చెప్పమంటున్నది. బీఆర్ఎస్ పార్టీ తరపున లేబర్ కోడ్‌లపై అభిప్రాయాలు సేకరించి ఓ నిర్ణయం తీసుకునేందుకు రేపు తెలంగాణ భవన్‌లో ఉదయం పదకొండు గంటల నుంచి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల కార్మికు సంఘాల నేతలు, వివిధ పరిశ్రమల కార్మిక సంఘాల నాయకులు, అసంఘటిత రంగ కార్మిక సంఘాల నేతలు, బీఆర్ఎస్ కార్మిక విభాగం నేతలు ఈ రౌండ్ టేబుల్ మీటింగ్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

## నిజ నిర్ధారణ విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి

- తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్

హైదరాబాద్ (జనంసాక్షి) : మారేడుమిల్లి ఎన్ కౌంటర్ పై నిజ నిర్ధారణకు వెళ్లిన విశ్వవిద్యాలయాల విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ పోలీస్ లు అక్రమంగా నిర్బంధించడం సరికాదని తెలంగాణ పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణరావు అన్నారు. ఉదయం 8 గం.లకు 14 మంది విద్యార్థులబృందాన్ని అరెస్టు చేసి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారని, రాజ్యాంగబద్ధంగా నిజనిర్ధారణకు వెళ్లిన విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికం. వెంటనే అరెస్టు చేసిన వారిని భేషరతుగా విడుదల చేసి నిజనిర్ధరణ చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని సూచించారు.

## నర్సంపేట విద్య, వైద్య రంగాల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి...




నర్సంపేట, డిసెంబర్ 5 (జనం సాక్షి) : నర్సంపేట ను విద్యా వైద్య రంగాల్లో అభివృద్ధి పరచడమే ప్రభుత్వ ధ్యేయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో'ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లాలోని నర్సంపేట లో హెలిపాడ్ కు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిలు చేరుకోగా, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, అనసూయ సీతక్క, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ప్రభుత్వ విప్ రామ చంద్రునాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం డి రియాజ్, ఎం పి బలరాం నాయక్, ఎమ్మెల్సీ లు బస్వరాజు సారయ్య , పింగిలి శ్రీపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, డాక్టర్ మురళి నాయక్, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, తదితరులు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సుమారు 1000 కోట్ల నిధులు కేటాయించిన నర్సంపేట పై వరాల జల్లు కురిపించడం పై ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు.


జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
6 డిసెంబర్ 2025

# సుస్థిరాభివృద్ధి: సిద్ధాంతం నుంచి ఆచరణ వరకు

సుస్థిరాభివృద్ధి అనేది ఆధునిక ప్రపంచంలో అత్యంత చర్చనీయాంశమైన భావన. ఇది కేవలం పర్యావరణ పరిరక్షణకు సంబంధించినది మాత్రమే కాదు. ఆర్థిక, సామాజిక, పర్యావరణ రంగాలను సమతుల్యంగా కలిపి, ప్రస్తుత తరం అవసరాలను తీర్చుతూ భవిష్యత్ తరాలకు అవకాశాలను కాపాడుకోవడం దీని సారాంశం. బ్రండ్‌లాండ్ కమిషన్ నివేదికలో మొదటి సారి స్పష్టంగా నిర్వచించబడిన ఈ భావన, ఇప్పుడు ఐక్యరాష్ట్ర సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీలు) రూపంలో ప్రపంచవ్యాప్తంగా అమలవు తోంది. అయితే, ఈ భావన యొక్క లక్షణాలను మరియు వ్యూహాలను విశ్లేషించి, విమర్శనాత్మకంగా పరిశీలిస్తే, ఇది ఒక ఆదర్శవాద దృక్పథం మాత్రమే కాకుండా, వాస్తవిక సవాళ్లతో కూడిన సంక్లిష్ట ప్రక్రియగా తెలుస్తుంది. సుస్థిరాభివృద్ధి మూడు ప్రధాన స్తంభాలపై ఆధారపడి ఉంటుంది. అవి ఆర్థిక, సామాజిక, పర్యావరణ సంబంధిత అంశాలు. ఆర్థిక స్తంభం సమగ్రవంతమై న వనరుల వినియోగం, ఆవిష్కరణలు, స్థిరమైన వృద్ధిని నొక్కి చెబుతుంది. ఉదాహరణకు, ఆర్థిక వృద్ధి, పేదరిక నిర్మూలనను సమన్వయం చేయడం ద్వారా దేశాలు దీర్ఘకాలిక సమృద్ధిని సాధించవచ్చు. సామాజిక స్తంభం సమానత్వం, విద్య, ఆరోగ్యం, మానవ హక్కులను ప్రోత్సహిస్తుంది. ఇది సమాజంలో అసమానతలను తగ్గించడానికి ఉద్దేశించబడింది. పర్యావరణ స్తంభం జీవవైవిధ్యం, వాతావరణ మార్పులు, వనరుల పునరుద్ధరణపై దృష్టి సారిస్తుంది. ఈ మూడు స్తంభాలు పరస్పరం అనుసంధానితమై ఉండటం ఈ భావన యొక్క ప్రత్యేకత. అయితే, విశ్లేషణాత్మకంగా చూస్తే, ఈ లక్షణాలు ఆచరణలో సంఘర్షణలు సృష్టిస్తాయి. ఉదాహరణకు, ఆర్థిక వృద్ధి కోసం పారిశ్రామికీకరణ అవసరం అవుతుంది. కానీ పారిశ్రామికీకరణ పర్యావరణా నికి హాని కలిగిస్తుంది. అలాగే, సామాజిక సమానత్వం కోసం ప్రయత్నాలు ఆర్థిక ఖర్చులను పెంచుతాయి. ఇది సుస్థిరత యొక్క వాస్తవిక స్వభావాన్ని ప్రశ్నిస్తుంది. ఈ సుస్థిరాభివృద్ధి నిజంగా సాధ్యమా? లేదా కేవలం రాజకీయ రెటోరిక్ మాత్రమేనా? ఇక వ్యూహాల విషయానికి వస్తే, సుస్థిరాభివృద్ధిని సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా అనేక వ్యూహాలు అమలవుతున్నాయి. ముందుగా, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం. సౌర, పవన, జలవిద్యుత్ వంటివి కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి కీలక పాత్ర పోషిస్తా యి. యూరోపియన్ యూనియన్ యొక్క గ్రీన్ డీల్ వంటి కార్యక్రమాలు ఈ వ్యూహాన్ని ఉదాహరణగా చూపుతాయి. రెండవది, సర్క్యులర్ ఎకానమీ మోడల్. ఇక్కడ వ్యర్థాలను పునర్వినియోగం చేసి, వనరులను ఆదా చేస్తారు. ఇది సాంప్రదాయ లీనియర్ ఎకానమీ (తయారు-వినియోగం-విస్మరణ) నుండి మార్పును సూచిస్తుంది. మూడవది, సుస్థిర వ్యవసాయం. ఆర్గానిక్ ఫార్మింగ్, నీటి సమర్థ వినియోగం, జీవవైవిధ్య పరిరక్షణ, ఆహార భద్రతను బలోపేతం చేయడం మొదలైనవి. అదనంగా, విద్య, అవగాహన కార్యక్రమాలు, పాలసీ ఫ్రేమ్‌వర్క్‌లు సమాజాన్ని సుస్థిరత వైపు నడిపిస్తాయి. ఐక్యరాష్ట్ర సమితి యొక్క 17 ఎస్‌డీజీలు పేదరిక నిర్మూలన నుండి వాతావరణ పరిరక్షణ వరకు ఈ వ్యూహాలకు మార్గదర్శకంగా ఉంటాయి. విశ్లేషణాత్మకంగా, ఈ వ్యూహాలు సమస్యలను పరిష్కరించడంలో సమర్థవంత మైనవి కావచ్చు. కానీ, అవి దేశాల మధ్య అసమానతలను పరిగణనలోకి తీసుకోవు. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆర్థిక వృద్ధి కోసం పర్యావరణాన్ని త్యాగం చేయవలసి వస్తుంది. ఇది సుస్థిరత యొక్క సార్వత్రికతను ప్రశ్నిస్తుంది. విమర్శనాత్మక దృక్పథంతో చూస్తే, సుస్థిరాభివృద్ధి లక్షణాలు, వ్యూహాలు అనేక లోపాలతో కూడి ఉన్నాయి. ముందుగా, ఎస్‌డీజీలలో అంతర్గత అసంగతతలు. ఆర్థిక వృద్ధి (ఎస్‌డీజీ-8) మరియు పర్యావరణ పరిరక్షణ (ఎస్‌డీజీ-13) మధ్య సంఘర్షణ అమలును కష్టతరం చేస్తున్నాయి. ఒక విశ్లేషణ ప్రకారం, ఈ లక్ష్యాలు సామాజిక, ఆర్థిక, పర్యావరణ స్తంభాల మధ్య సమతుల్యత లోపిస్తాయి. ఇది ప్రపంచ దేశాలలో అసమాన ప్రగతిని కలిగిస్తుంది. ఉదాహరణకు, చైనా, ఇండియా వంటి దేశాలు బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ద్వారా సుస్థిరతను ప్రకటిస్తున్నప్పటికీ, వాస్తవంలో పర్యావరణ హాని, రుణ ఉచ్చులు పెరుగుతున్నాయి. రెండవది, గ్రీన్‌వాషింగ్. కంపెనీలు తమ ఉత్పత్తులను సుస్థిరంగా చూపించి, వాస్తవంలో పర్యావరణాన్ని దోపిడీ చేస్తున్నాయి. ఇది భావనను బలహీనపరుస్తుంది. కార్పొరేట్ లాబీయింగ్, రాజకీయ ఇచ్ఛాశక్తి లోపం కారణంగా వ్యూహాలు కాగితంపైనే మిగిలిపోతా యి. మూడవది, డేటా సవాళ్లు. సుస్థిరత పనితీరును కొలవడంలో ఖచ్చిత త్వం లోపిస్తుంది. ప్రత్యేకించి వాతావరణ మార్పులు, అసమానతల విషయం లో. ఒక అధ్యయనం ప్రకారం, ఈ డేటా లోపాలు నిజమైన ప్రగతిని మూల్యాంకనం చేయడంలో ఇబ్బందులు కలిగిస్తాయి. అంతేకాకుండా, అభివృద్ధి చెందిన దేశాలు తమ బాధ్యతలను అభివృద్ధి చెందుతున్న దేశాలపై నెట్టడం ఒక రివాజుగా మారింది. సుస్థిరత ఒక ఉత్తర-దక్షిణ వివాదంగా మారుతుంది. ఉదాహరణకు, పారిస్ ఒప్పందం ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలు అభివృద్ధి చెందిన దేశాలకు సులభమైనవి కావచ్చు. కానీ, భారత్ వంటి అభివృద్ధి చెందే దేశాలకు ఆర్థిక భారం అవుతుంది. ఈ విమర్శలు సుస్థిరాభి వృద్ధిని ఒక ఆదర్శవాద భ్రమగా, చేరుకోలేని లక్ష్యాలుగా చూపుతాయి. ఇక్కడ వాస్తవిక రాజకీయ, ఆర్థిక శక్తులు ఆధిపత్యం చేస్తాయి. అయినప్పటికీ, సుస్థిరాభివృద్ధి లక్షణాలు, వ్యూహాలు పూర్తిగా విఫలమైనవిగా భావించలేము. విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తే, మల్టీ-మెట్రిక్ ఫ్రేమ్‌వర్క్‌లు, సిస్టమ్ డైనమిక్స్ వంటి పద్ధతులు ఈ సవాళ్లను పరిష్కరించడానికి సహాయపడతాయి. ఉదాహరణకు, ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ మోడల్స్ ద్వారా దేశాలు తమ వ్యూహాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చవచ్చు. కానీ ఇది రాజకీయ ఇచ్ఛాశక్తి, అంతర్జాతీయ సహకారంపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్‌లో సుస్థిరతను మరింత సమగ్రంగా చేయడానికి డేటా ఆధారిత విశ్లేషణలు, మల్టీ-క్రైటీరియా డెసిషన్ మేకింగ్ (ఎమ్‌సీడీఎమ్) వంటి సాధనాలు అవసరం. ఇది సుస్థిరాభివృద్ధిని కేవలం లక్ష్యాల సమూహం నుండి ఒక డైనమిక్ ప్రక్రియగా మారుస్తుంది. అయితే, ఇప్పటికీ ఈ భావన యొక్క స్వరూపం, స్వభావాలను విమర్శనాత్మకంగా పరిశీలించాలి. ఇది నిజమైన మార్పును తీసుకురావాలంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో శక్తి అసమానతలను సవాలు చేయాలి. చివరిగా, సుస్థిరాభివృద్ధి ఒక అవసరమైన దృక్పథం. కానీ దాని లక్షణాలు మరియు వ్యూహాలు వాస్తవిక ఆచరణలో విమర్శలతో మెరుగుపరచాలి. లేకుంటే ఇది కేవలం ఒక భ్రమ మాత్రమే అవుతుంది. సుస్థిరాభివృద్ధి అనేది ఆధునిక ప్రపంచంలో అత్యంత చర్చనీయాంశమైన భావన. ఇది కేవలం పర్యావరణ పరిరక్షణకు సంబంధించినది మాత్రమే కాదు. ఆర్థిక, సామాజిక, పర్యావరణ రంగాలను సమతుల్యంగా కలిపి, ప్రస్తుత తరం అవసరాలను తీర్చుతూ భవిష్యత్ తరాలకు అవకాశాలను కాపాడుకోవడం దీని సారాంశం. బ్రండ్‌లాండ్ కమిషన్ నివేదికలో మొదటిసారి స్పష్టంగా నిర్వచించబడిన ఈ భావన, ఇప్పుడు ఐక్యరాష్ట్ర సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీలు) రూపంలో ప్రపంచవ్యాప్తంగా అమలవుతోంది. ఇక్కడ వాస్తవిక రాజకీయ, ఆర్థిక శక్తులు ఆధిపత్యం చేస్తాయి. అయినప్పటికీ, సుస్థిరాభివృద్ధి లక్షణాలు, వ్యూహాలు పూర్తిగా విఫలమైనవిగా భావించలేము. విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తే, మల్టీ-మెట్రిక్ ఫ్రేమ్‌వర్క్‌లు, సిస్టమ్ డైనమిక్స్ వంటి పద్ధతులు ఈ సవాళ్లను పరిష్కరించడానికి సహాయపడతాయి. ఉదాహరణకు, ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ మోడల్స్ ద్వారా దేశాలు తమ వ్యూహాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చవచ్చు. కానీ ఇది రాజకీయ ఇచ్ఛాశక్తి, అంతర్జాతీయ సహకారంపై ఆధారపడి ఉంటుంది. ఇది నిజమైన మార్పును తీసుకురావాలంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో శక్తి అసమానతలను సవాలు చేయాలి. చివరిగా, సుస్థిరాభివృద్ధి ఒక అవసరమైన దృక్పథం. కానీ దాని లక్షణాలు మరియు వ్యూహాలు వాస్తవిక ఆచరణలో విమర్శలతో మెరుగుపరచాలి. లేకుంటే ఇది కేవలం ఒక భ్రమ మాత్రమే అవుతుంది.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# రూపాయి పతనం



భారత రూపాయి ఇప్పుడు అమెరికా డాలరుకు 90 రూపాయలు దాటి, ఆసియా దేశాల్లో అత్యంత వేగంగా బలహీనమవుతున్న కరెన్సీగా మారింది. ఈ ఏడాది మాత్రమే దాదాపు 6 శాతం పతనం చెందిన రూపాయి పడిపోవడం వెనుక ఒక్క రోజు సంఘటన కాదు, బలమైన బాహ్య మరియు అంతర్గత ఒత్తిళ్ల సమ్మేళనమే. అమెరికాలో ట్రంప్ పరిపాలన మళ్లీ అధికారంలోకి రావడంతో భారత ఎగుమతులపై 50 శాతం వరకు సుంకాలు విధించడం ఒక్కసారిగా దెబ్బ తీసింది. దాదాపు 45 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు ఈ సుంకాలకు గురవడంతో, టెక్స్టైల్స్, మందులు, జెమ్స్ అండ్ జ్యువెలరీ, ఐటీ సేవలు వంటి కీలక రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అక్టోబర్ నెలలోనే ఎగుమతులు 11.8 శాతం కుచించుకుపోయాయి, ఇది రూపాయిపై భారీ ఒత్తిడి తెచ్చింది. ఇక విదేశీ పెట్టుబడిదారులు భారత్ నుంచి పారిపోతున్నారు. ఈ ఏడాది విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు స్టాక్ మార్కెట్ నుంచి 17 బిలియన్ డాలర్లు లాగేసుకున్నారు. డిసెంబర్ మొదటి రెండు రోజుల్లోనే లక్షా 48 వేల కోట్ల రూపాయల విక్రయాలు జరిగాయి. డైరెక్ట్ పెట్టుబడులు కూడా 90 శాతం క్షీణించాయి. అమెరికా డాలరు బలంగా ఉండటం, అక్కడి వడ్డీ రేట్లు భారత్ కంటే ఎక్కువగా ఉండటం వంటివి కలిసి డబ్బు బయటికి పారిపోయేలా చేశాయి. దిగుమతుల భారం మరింత మోత మోగిస్తోంది. భారత్ తన అవసరమైన 90 శాతం చమురును దిగుమతి చేసుకుంటుంది. ఈ ఏడాది చమురు ధరలు పెరగడంతో దిగుమతి బిల్లు 16.6 శాతం పెరిగి 76 బిలియన్ డాలర్లకు చేరింది. పసిడి దిగుమతులు, ఎలక్ట్రానిక్స్, ఇనుము-ఉక్కు వంటివి కలిపి అక్టోబర్‌లో వాణిజ్య లోటు 41.7 బిలియన్ డాలర్లకు చేరింది. డాలరు డిమాండ్ ఆకాశాన్నంటగా, రూపాయి ఒత్తిడి మరింత పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ మారిన వైఖరి కూడా ఇందుకు కారణమే. గతంలో రూపాయి 83-84 దాటగానే రిజర్వ్ బ్యాంక్ భారీగా డాలర్లు అమ్మి కాపాడేది. ఇప్పుడు కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆ వైఖరి మారింది. రూపాయి 90 దాటినా పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు. ఇది రూపాయిని సహజ స్థాయికి చేరుకోవడానికి అనుమతిస్తోంది, దీంతో ఎగుమతులకు పోటీతత్వం కల్పించే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంటున్నారు. సామాన్యుడిపై ఈ పతనం ప్రభావం తీవ్రంగా ఉంది. పెట్రోలు, వంట గ్యాస్, ఆహార నూనెలు మరింత ఖరీదు అవుతాయి. విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు ఒక్కో సంవత్సరం 4-5 లక్షలు అదనంగా ఖర్చు పెరుగుతుంది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కార్లు దాదాపు 10-15 శాతం ఖరీదు అవుతాయి. విదేశీ రుణాలు తీసుకున్న కంపెనీలకు వడ్డీ, అసలు చెల్లింపులు భారం అవుతాయి. ఇక నుంచి ఏమి చేయాలి? ముందుగా ఎగుమతులను త్వరగా పెంచే దిశగా పనిచేయాలి. పీఎల్ఐ పథకాలను మరింత బలోపేతం చేయాలి. చమురు దిగుమతులను తగ్గించేందుకు ఎథనాల్ బ్లెండింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలి. అమెరికా, యూరోపియన్ యూనియన్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలి. రూపాయిలోనే వాణిజ్యం చేసే ద్వైపాక్షిక ఒప్పందాలను యూఏఈ, రష్యా, ఇతర బ్రిక్స్ దేశాలతో విస్తరించాలి. గిఫ్ట్ సిటీ ద్వారా రూపాయిని అంతర్జాతీయంగా ఉపయోగించేలా చేయాలి. చివరిగా, రూపాయి పతనం ఒక సంకేతం. మన ఆర్థిక వ్యవస్థ ఇంకా దిగుమతులపై ఆధారపడి ఉందన్న సంకేతం. దీన్ని అవకాశంగా మలుచుకుని, తయారీ రంగాన్ని, ఎగుమతులను బలోపేతం చేస్తే, రూపాయి మళ్లీ తలెత్తుకుని నిలబడే రోజు దూరంలో లేదు.

భారత రూపాయి పతనం వెనుక ఉన్న కారణాలను మరింత లోతుగా చూస్తే, అమెరికా సుంకాలు మాత్రమే కాదు, గ్లోబల్ ఆర్థిక పరిస్థితులు కూడా కీలకం. ట్రంప్ రెండోసారి అధికారంలోకి రావడంతో 'అమెరికా ఫస్ట్' పాలసీ మరింత బలపడింది. దీంతో భారత్ నుంచి వచ్చే వస్తువులపై సుంకాలు పెంచడం ద్వారా స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని యత్నిస్తున్నారు. ఇది మన ఎగుమతి రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. ఉదాహరణకు, టెక్స్టైల్స్ రంగంలో భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఎగుమతిదారు, కానీ ఈ సుంకాలతో మార్కెట్ షేర్ కోల్పోతున్నాం. అలాగే, ఫార్మా రంగంలో జెనరిక్ మందులు అమెరికాకు ప్రధాన ఎగుమతి, కానీ ఇప్పుడు ధరల పోటీలో వెనకబడుతున్నాం. ఈ పరిస్థితి రూపాయిపై డాలరు డిమాండ్ పెంచి, విలువ తగ్గిస్తోంది. విదేశీ పెట్టుబడుల విషయానికి వస్తే, అమెరికాలో వడ్డీ రేట్లు 5 శాతం దాటి ఉండటం, మన దేశంలో 6.5 శాతం మాత్రమే ఉండటం వల్ల పెట్టుబడిదారులు అక్కడికి మళ్లుతున్నారు. ఇంకా, గ్లోబల్ ఇన్ఫ్లేషన్, యుద్ధాల వంటి కారణాలు డాలరును సేఫ్ హెవెన్‌గా మార్చాయి. మన స్టాక్ మార్కెట్ సెన్సెక్స్ ఈ ఏడాది 10 శాతం పడిపోవడం దీనికి నిదర్శనం. దిగుమతుల విషయంలో చమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లు దాటడం మనకు పెద్ద భారం. సౌదీ అరేబియా, రష్యా నుంచి వచ్చే చమురు ధరలు పెరగడంతో మన కరెంట్ అకౌంట్ డెఫిసిట్ 3 శాతం దాటింది. పసిడి దిగుమతులు ఉత్సవ సీజన్‌లో పెరగడం, ఎలక్ట్రానిక్స్ రంగంలో చైనా ఆధిపత్యం వంటివి మరింత ఒత్తిడి తెచ్చాయి. రిజర్వ్ బ్యాంక్ వైఖరి మారడం ఒక వ్యూహాత్మక మార్పు. గతంలో రూపాయిని కృత్రిమంగా బలపరచడం వల్ల ఫారెక్స్ రిజర్వులు తగ్గాయి. ఇప్పుడు సహజ మార్కెట్ ఫోర్సెస్‌కు అనుమతివ్వడం ద్వారా ఎగుమతులు చౌకగా మారి, పోటీ పెరుగుతుంది. కానీ ఇది షార్ట్ టర్మ్‌లో ఇన్ఫ్లేషన్ పెంచుతుంది. సామాన్యుడికి ఈ ప్రభావాలు తీవ్రం. పెట్రోలు లీటర్‌కు 100 రూపాయలు దాటడం, గ్యాస్ సిలిండర్ 1200 రూపాయలు అవడం వంటివి జేబుకు భారం. విద్యార్థులకు యూఎస్ యూనివర్సిటీల ఫీజులు పెరగడం, టూర్ ప్యాకేజీలు ఖరీదు అవడం వంటివి ఉన్నాయి. కంపెనీలకు విదేశీ రుణాలు తిరిగి చెల్లించడం కష్టమవుతుంది, దీంతో లాభాలు తగ్గి, ఉద్యోగాలపై ప్రభావం పడుతుంది. ఇక పరిష్కారాల విషయానికి వస్తే, ఎగుమతుల ప్రోత్సాహం కీలకం. పీఎల్ఐ స్కీమ్‌లను ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఆటో రంగాలకు విస్తరించాలి. చమురు ఆధారాన్ని తగ్గించేందుకు ఎథనాల్ 20 శాతం బ్లెండింగ్ టార్గెట్‌ను త్వరగా సాధించాలి, సోలార్, విండ్ ఎనర్జీ ప్రాజెక్టులను పెంచాలి. గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను వేగవంతం చేస్తే, దీర్ఘకాలంలో ఇంధన భద్రత పెరుగుతుంది. వాణిజ్య ఒప్పందాలు అత్యవసరం. అమెరికాతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చర్చలను త్వరపరచాలి, యూరోపియన్ యూనియన్‌తో ఇండో-ఈయూ ఎఫ్‌టీఏను పూర్తి చేయాలి. రూపాయి సెటిల్‌మెంట్ ఒప్పందాలను బ్రిక్స్ దేశాలతో విస్తరించడం ద్వారా డాలరు ఆధారాన్ని తగ్గించవచ్చు. గిఫ్ట్ సిటీని అంతర్జాతీయ ఫైనాన్షియల్ హబ్‌గా మార్చడం ద్వారా రూపాయి ట్రేడింగ్ పెంచవచ్చు. మన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెట్టుబడులు పెంచాలి, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను బలపరచాలి. రూపాయి పతనం ఒక సవాల్ మాత్రమే, సరైన వ్యూహాలతో దీన్ని అవకాశంగా మార్చుకోవచ్చు. తయారీ రంగం జీడీపీలో 25 శాతం వాటా సాధిస్తే, ఎగుమతులు డబుల్ అవుతాయి. ఇది మన ఆర్థిక స్వావలంబనకు మార్గం. చివరిగా, ప్రభుత్వం, ఆర్బీఐ, పరిశ్రమలు సమన్వయంతో పనిచేస్తే, రూపాయి మళ్లీ బలపడుతుంది.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

# సత్యశోధన నేరమవుతుందా?

18, 19, నవంబర్ 2025 తేదీలలో మారెడుమిల్లి,రంపచౌడలో జరిగిన రెండు ఎన్ కౌంటర్లు కూడా బూటకమే అని అనుమానం ప్రజలందరికీ ఉంది. దీనికి సంబంధించి నిన్ననే మావోయిస్టు పార్టీ తన మూడు పేజీల పత్రికా ప్రకటనలో నలుగురు కారణంగా ఈ ఎన్కౌంటర్లు జరిగాయి, ఎన్కౌంటర్ పేరుతో హత్యాకాండ జరిగింది. దీనికి సంబంధించి కలప వ్యాపారి, ఫర్నీచర్ వ్యాపారి, బిల్డర్, సివిల్ కాంట్రాక్టరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఐటిడిఏ పనులు నిర్వహించే కాంట్రాక్టర్లతోపాటు మావోయిస్టుల నుంచే పారిపోయిన కోసాల్ కూడా బాధ్యులు కావచ్చని వారిచ్చిన ప్రకటనలో ప్రజలకు తెలియజేసారు. ప్రధానంగా ఈ 13 మందిని సజీవంగా పట్టుకొని రోజు తేడాతో 13 మందిని కాల్చి చంపి ఎన్కౌంటర్గా ప్రకటించారని వారి ప్రకటన తెలియజేస్తుంది. అయితే మొత్తంగా ఒక ఆదివాసీ సమాజం నుంచి చాలా పేద తరగతి నుంచి వచ్చినటువంటి మాడివి హిడ్మా దేశంలోనే ఒక విప్లవ పార్టీగా ఉన్నటువంటి మావోయిస్టు పార్టీలో కేంద్ర కమిటి స్థాయికి ఎదగడమనేది ప్రజలందరు హర్షిస్తు న్న విషయం. ఈ విషయం ఇలా ఉండగా. 2005 నుంచి ఆదివాసీ లు వేటాడి చంపబడుతున్నారు. వేటాడడం కోసం ప్రభుత్వాలే ప్రత్యేక బలగాలను నియమించుకుంటున్నాయి. ఇది రాజ్యాంగ విరుద్ధమని హక్కుల సంఘాలు దశాబ్దాలుగా ఆందోళన చేస్తున్నప్ప టికి గ్రేహండ్స్, డిఆర్జి, బస్తర్ ఫైటర్స్ బలగాలు ఉద్యమకారులను ఆదివాసీలను వేటాడి చంపడమే లక్ష్యంగా వాళ్ళు ప్రభుత్వ ఉద్యోగు లుగా కొనసాగుతున్నారు. ఇది మన దేశంలో ఒక న్యాయవ్యవస్థ ఉందని దాని ప్రకారం నేరస్తులు శిక్షించబడాలనే విధానానికి పూర్తి గా వ్యతిరేకం. ఒకవైపు ఆదిమకాలంలో రాజరికవ్యవస్థలో కన్నుకు కన్ను, పన్నుకు పన్ను అనే విధానంగా దాడులు ఉండేవి. ఇప్పుడు రాజ్యాంగం ఉన్నప్పటికి 78 ఏళ్ళుగా ప్రజాస్వామ్యం అమలవుతున్న దని చెబుతున్నప్పటికి ఆర్టికల్ 21 జీవించే హక్కు ప్రభుత్వ బలగాలచే వేటాడబడుతున్నాయి. దీంతో మనకర్థమవుతున్నది రాజ్యాంగమనేది అమలుకు నోచుకోవడం లేదు, కార్పొరేట్ల కనుసన్నల్లో పాలకులు పని చేస్తున్నారు. కార్పొరేట్ల కోసం కగార్ యుద్ధాన్ని కొనసాగిస్తూ, ఆదివాసీలను, ఉద్యమకారులన రెండేళ్ళ వ్యవధిలోనే 800లకు పైగా ఎన్ కౌంటర్ పేరుతో హత్య చేశారు. ఈ ఎన్ కౌంటర్లపై నిజనిర్ధారణకు అవకాశమే లేకుండా పోయింది. నేడు అఖిలభారత స్థాయిలో ఉన్న విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థుల నిజ నిర్ధారణ కమిటి హిడ్మా ఎన్కౌంటర్ పై నిజనిర్ధారణ కు ప్రయత్నం చేసింది. ఈ ప్రయత్నానికన్నా ముందే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి, డిజిపిలకు బహిరంగంగానే వాళ్ళు తెలియజేయడం జరిగింది. కానీ దానికి స్పందించకుండా ఈ రోజు అల్లూరి జిల్లా చింతూరులో 14 మంది విద్యార్థుల నిజనిర్ధారణ బృందాన్ని పోలీసులు నిర్బంధించడం జరిగింది.

గతంలో కూడా 18 జూన్ 2025 ఇదే మారెడుమిల్లిలో గాజర్ల రవి, అరుణ, అంజూలను కూడా కాల్చి చంపి ఎన్కౌంటర్ ప్రకటించారు. ఈ ఎన్ కౌంటర్ చేయడానికి 4 రోజుల ముందే గాజర్ల రవి తమ్ముడు అశోక్తో, అరుణ తండ్రి వెంకటరావులను పోలీసులు కలిసి "మీ వాళ్ళు ఎక్కడున్నారో మాకు తెలుసు, మిమ్మల్ని వాళ్ళ దగ్గరికి తీసుకెళ్తాం వాళ్ళను సరెండర్ చేయించండి" అని ఒత్తిడి తీసుకువ చ్చారు. కానీ ఆ రెండు కుటుంబాలకు పోలీసుల మీద నమ్మకం లేక మేము చెబితే వాళ్ళు వింటారా అని తప్పుకోవడం జరిగింది. కానీ 2 రోజుల వ్యవధిలోనే వాళ్ళ శవాలను వాళ్ళ కుటుంబాలకు అప్పగించడం జరిగింది. అదే విధంగా 18 నవంబర్ 2025న హిడ్మాతో పాటు 5గురు నవంబర్ 19, నవంబర్ 2025న టెక్ శంకర్ పాటు 8 మంది హత్యగావించబడ్డారు. ఈ హత్యకు సరిగ్గా ఒక వారం రోజుల క్రితం వీరందరికి అదుపులోకి తీసుకుంటామనే విశ్వాసమున్న నేపథ్యంలోనే చత్తీస్ ఘడ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ మాడివి హిడ్మా సొంత గ్రామమైన కూవర్తికి వెళ్ళి అతని తల్లితో




సహపంక్తి భోజనం చేసి, ఆమెకు కొత్త బ్లాంకెట్ ను బహూకరించి, మీ హిడ్మాను లొంగిపోయే విధంగా ప్రయత్నం చేయండి అని చెప్పి రావడం జరిగింది. దీంతో మనకర్థం అవుతున్నదేమిటంటే వీరందరూ వారి అదుపులో ఉండడానికి ఆస్కారం ఉంది. ఎలాగూ చంపేస్తాము కాబట్టి, మేము లొంగుబాటు కోసం ప్రయత్నం చేసామనే ఒక సానుభూతిని ప్రజల దగ్గర నుండి సంపాదిస్తూనే మరో వైపు హత్యాకాండను కొనసాగించారు. పోలీసుల అదుపులోకి 15 నవంబర్ 2025న తీసుకున్నారని రెండు దఫాలుగా ఇప్పటికే మావోయిస్టు పార్టీ కూడా స్పష్టం చేసింది. అయినా కూడా ప్రభుత్వం స్పందించ కుండా కనీసం ఆదివాసీ అనే స్పృహ లేకుండా అత్యంత కిరాతకంగా మాడివి హిడ్మాను హత్య చేసింది.

మాడివి హిడ్మాతో పాటు హత్యగావించబడిన 13 మంది ఎన్ కౌంటర్ విషయమై ప్రజల్లో అనేక అనుమానాలు ఉ న్నాయనేది వాస్తవం. దాని విషయమై అఖిల భారత స్థాయిలో ఉన్న హక్కుల సంఘాలు నిజనిర్ధారణ చేయాల్సిన అత్యంత అవసరం ఇప్పటికే ఉంది. ఆ సన్నాహాల్లో సిడిఆర్ ప్రయత్నిస్తుంది. కానీ విద్యార్థుల్లో ఉన్నటువంటి ప్రజాస్వామిక చైతన్యం 14 మంది విద్యార్థులతో నిజ నిర్ధారణకు బయల్దేరి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ఒక ప్రయత్నం చేశారు. కానీ ఆ ప్రయత్నాన్ని కూడా చంద్రబాబు ప్రభు త్వం నిర్బంధానికి గురి చేసింది. సమాజంలో సత్యశోధన అనేది నేరమైపోయింది. ప్రజలకు ఇంత కాలం వాస్తవాలు తెలియనీయ కుండా హత్యలు చేసి ఎన్కౌంటర్గా ప్రకటిస్తూ ఉంటారు. ప్రజలందరి కి ఇప్పటికే అర్థమైనవ విషయమేమిటంటే రెండేళ్ళుగా ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై, మావోయిస్టులపై ఉద్యమం ప్రకటించి రాజ్యాంగానికి వ్యతిరేకంగా లొంగిపోతారా? చస్తారా? అని బహిరం గంగా ప్రశ్నించే స్థాయికి కేంద్ర ప్రభుత్వం వెళ్ళిపోయిందంటేనే దేశంలో ప్రజాస్వామిక విలువుల కానీ, రాజ్యాంగం కానీ అమలు అవుతలేదని వాళ్ళే స్పష్టంగా చెబుతున్నారు. కానీ బుద్ధిజీవులుగా ఉన్న, ప్రజలందరు ఆలోచించాల్సింది కోట్లాది విలువైన మన ఖనిజ వనరులను కాపాడడం కోసం ఆదివాసీలు, మావోయిస్టులు బస్తర్ కేంద్రంగా ఉద్యమిస్తుంటే, ఆ ఉద్యమాన్ని నిర్మూలించాలని మన దేశ అన్ని రకాల సాయుధ బలగాలతో దశాబ్దాలుగా యుద్ధం చేస్తున్న విధానమనేది ప్రజాస్వామ్య దేశంలో జరగకూడదని భావిస్తున్నారు. కానీ కార్పొరేట్లతో మిలాకత్ అయిన పాలక వర్గాలు వాళ్ళే కార్పొరేట్లుగా మారుతూ దేశంలో ఉన్నటువంటి వృక్ష సంపదను 5-6 లక్షల్లో పూర్తిగా నిర్మూలిస్తున్నారు. అది ఆదాని, అంబానీల కార్పొరేట్ కంపెనీల కోసమే కాని మరొకటి కాదు. ఇటువంటి స్థితిలో విద్యార్థులుగా స్పందించి మావోయిస్ట చెబుతున్నది నిజమా? ప్రభుత్వం చెబుతున్నది నిజమా? అని నిజాలను వెలికి తీసే ప్రయత్నం చేస్తుంటే వారిని కూడా నిర్బంధాలకు గురి చేస్తే ఎందుకు ప్రభుత్వాలు భయపడుతున్నాయి. వాస్తవాలు ప్రజలకు తెలియడం వల్ల ప్రభుత్వాలకు నిజంగా నష్టం ఉందా? అంటే ఇప్పటి వరకు ప్రభుత్వాలు అబద్దాలతోనే పాలన చేస్తున్నాయా? ఈ నిర్బంధాన్ని మనం అర్థం చేసుకోగలిగితే కగార్ పేరుతో జరిగిన 80 కి పైగా ఎన్కౌంటర్లలో ఏ ఎన్కౌంటర్లో కూడా ఏ ఒక్క హక్కుల సంఘం నిజనిర్ధారణను నిర్వహించలేక పోయింది. 5 సెప్టెంబర్ 2024న జరిగిన చల్పాక ఎన్ కౌంటర్ మాత్రమే పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ చేయగలిగింది. దాని ముందు జరిగిన కరకగూడం ఎన్కౌంటర్పై నిజనిర్ధారణకు వెళిలే ఈ రోజు జరిగినట్లుగానే పౌర హక్కుల సంఘానికి చెందిన 16 మందిని అశ్వాపురం పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. ప్రభుత్వం స్పష్టంగానే ఇన్ఫార్మర్లతో కోవర్టులతో మావోయిస్టు నాయకులను పట్టుకొని చిత్రహింసలకు గురి చేసి కాల్చి చంపి ఎన్కౌంటర్గా ప్రకటిస్తుంది. ఇది సరియైన విధానం కాదని 5 దశాబ్దాలుగా పౌర హక్కుల సంఘం ప్రభుత్వానికి తెలియజేస్తూ వస్తున్నది. కానీ ప్రభుత్వం నిజాల్ని దాచిపెట్టడం కోసం అనేక రకాల తప్పుడు మార్గాలను ఇంకా ఇంకా ఎంచుకుంటున్నది తప్ప ఎన్ కౌంటర్ హత్యాకాండను మాత్రం ఆపడం లేదు. చివరికి ఎవరినైనా ఎన్కౌంటర్ పేరుతో హత్య చేసే విదానం అన్ని చోట్లకు పాకింది. చివరికి మావోయిస్టులను కూడా ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి అడ్డంకిగా విస్తృతమైన ప్రచారం చేస్తున్నారు. బుద్ధిజీవులు అడిగే ప్రశ్న ఏమిటంటే, బస్తర్లో మాత్రమే కాదు ఆదివాసీలు గిరిజనులు ఉన్నది. మిగతా అన్ని ప్రాంతాల్లో ఉన్నారు కదా, మరి వారినెందుకు ఇప్పటి వరకు అభివృద్ధి వైపు నడిపించలేకపోయారు. ఇదంతా ప్రభుత్వం కార్పొరేట్ల కోసం ఉంటూ చట్టాలను కూడా మార్చేస్తూ హత్యలు చేస్తూ కార్పొరేట్లకు గులాములుగా మారుతూ రాజ్యాంగం యొక్క విలువలను దిగజారుస్తున్నాయి. అందులో భాగమే ఈ రోజు విద్యార్థుల నిజ నిర్ధారణ బృందాన్ని చింతూరు పోలీస్ స్టేషన్లో నిర్బంధించి ఉంచడం, వారిని వెంటనే విడుదల చేసి మాడివి హిడ్మా ఎన్ కౌంటర్పై నిజ నిర్ధారణకు అవకాశం కల్పించడం ద్వారా తనకున్న ప్రజాస్వామిక పాలన యొక్క విలువలను కాపాడుకోవలసిన బాధ్యత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీద ఉంది. ఆ వైపుగా ప్రభుత్వం పాలన చేయాల్సిందిగా పౌరహక్కుల సంఘంగా మేము డిమాండ్ చేస్తున్నాం.



**ఎన్. నారాయణ రావు**
**ప్రధాన కార్యదర్శి**
**పౌరహక్కుల సంఘం**

# రైతు పంటకు సురక్షిత నిల్వలు... ప్రభుత్వాలు స్పందించాలి

దేశానికి అన్నం పెట్టే రైతు ఇప్పుడు అకాల వర్షాలకు, సరైన నిల్వ సౌకర్యాల కొరతకు బలైపోతున్నాడు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి, ఎండా వానా తేడా లేకుండా కష్టపడి పండించిన ధాన్యం ఆకాశం కింద బహిరంగంగా పోసి, వర్షం కురిస్తే ముద్దగా మారుతుంది. తేమ, పురుగు, ఎలుకల బెడద తప్పదు. ఫలితం... రైతు చేతికి రావాల్సిన డబ్బు గాలికొదిలేస్తుంది. ఆత్మహత్యల సరళి మరింత పెరుగుతుంది. ఇది ఒక్క రోజు సమస్య కాదు, దశాబ్దాలుగా కొనసాగుతున్న అలసత్వం, ప్రాధాన్యతల వైపరీత్యం.

ప్రభుత్వాలు క్రీడా స్టేడియాలకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఆధునిక విమానాశ్రయాలు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, స్మార్ట్ సిటీలు నిర్మిస్తున్నాయి. అభినందనీయమే. కానీ, ఆహార ధాన్యాన్ని కాపాడే గిడ్డంగులు మాత్రం ఇప్పటికీ కొరతే. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) గిడ్డంగులు నిండిపోయాయి. అనేక చోట్ల ధాన్యం రోడ్ల పక్కన, మైదానాల్లో పోసి ప్లాస్టిక్ షీట్లతో కప్పుతున్నారు. అదీ కూడా సరిగ్గా కుదరకపోతే వర్షం తడిచి నాశనమవుతుంది. గత ఏడాది ఒక్క తెలంగాణలోనే 2 లక్షల టన్నులకు పైగా ధాన్యం వర్షానికి తడిసి పాడైందని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా ఈ నష్టం ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చు.

అభివృద్ధి చెందిన దేశాల్లో గిడ్డంగులు అంటే కేవలం గోడలు, పైకప్పు మాత్రమే కాదు. వాతావరణ నియంత్రణ వ్యవస్థలు, ఆటోమేటిక్ ఫ్యూమిగేషన్, తేమ కొలిచే సెన్సార్లు, ఎలుకల నివారణ ఆధునిక పరికరాలు... ఇవన్నీ సాధారణం. అమెరికాలో సిలో బ్యాగ్ టెక్నాలజీతో ఒక్క రైతు కూడా లక్షల టన్నుల ధాన్యాన్ని సొంత పొలంలోనే సురక్షితంగా నిల్వ చేసుకుంటాడు. కెనడా, ఆస్ట్రేలియాలో గ్రెయిన్ ఎలివేటర్లు, బల్క్ స్టోరేజ్ సిస్టమ్స్ ద్వారా నష్టం దాదాపు సున్నాకే తగ్గించారు. మన దగ్గర మాత్రం ఇప్పటికీ 1960-70 దశకపు గిడ్డంగులతోనే సరిపెట్టుకుంటున్నాం.

ప్రభుత్వం 2016లో 'గ్రామీణ్ భండారణ్ యోజనా' పేరుతో గిడ్డంగుల నిర్మాణానికి సబ్సిడీ పథకం తెచ్చింది. కానీ అది కాగితాలకే పరిమితమైంది. దేశంలో ఇప్పటి వరకు అవసరమైన గిడ్డంగు సామర్థ్యం 18 కోట్ల టన్నులు కాగా, ఉన్నది కేవలం 14 కోట్ల టన్నులు మాత్రమే. ఈ లోటు పూడ్చడానికి కనీసం 35 వేల కొత్త గిడ్డంగులు అవసరం. ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించి, పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో ఆధునిక గిడ్డంగులు నిర్మిస్తే ఈ సమస్య దాదాపు పరిష్కారమవుతుంది. ఇంకో ముఖ్య విషయం... గ్రామ స్థాయిలో చిన్న చిన్న గిడ్డంగులు. ప్రతి పంచాయతీకి 5 వేల నుంచి 10 వేల టన్నుల సామర్థ్యం గల మినీ గిడ్డంగులు ఏర్పాటు చేస్తే రైతు పంటను ఇంటి దగ్గరే నిల్వ చేసుకోవచ్చు. మార్కెట్ ధర బాగుండే వరకు వేచి ఉండొచ్చు. ఇప్పుడు ధర తక్కువగా ఉన్నప్పుడు బలవంతంగా అమ్మేసి నష్టపోతున్నాడు. ఇలాంటి గిడ్డంగులకు 100 శాతం సబ్సిడీ ఇచ్చి, రైతు సంఘాలకు, ఎఫ్‌పీవోలకు అప్పగిస్తే రైతు ఆదాయం రెట్టింపు అవుతుంది.

ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన 'వేర్‌హౌస్ రసీదు' విధానాన్ని మరింత బలోపేతం చేయాలి. రైతు గిడ్డంగులో పంట ఉంచి రసీదు తీసుకుని బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణం పొందొచ్చు. ఇది ఇప్పుడు చాలా తక్కువ మందికే అందుతోంది. దీన్ని ప్రతి గ్రామానికి విస్తరిస్తే రైతు ఆర్థికంగా బలోపేతమవుతాడు.

రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో 'రైతే రాజు' అని నినాదాలు చేస్తారు. కానీ అధికారంలోకి వచ్చాక మరచిపోతారు. రైతు బ్రతుకు గాలికి దీపంగా మారకూడదు. అతను పండించిన అన్నం మన కడుపును నింపుతుంది. ఆ అన్నాన్ని కాపాడే గిడ్డంగులు లేకపోతే దేశ ఆహార భద్రతే ప్రమాదంలో పడుతుంది. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని, ఆధునిక గిడ్డంగుల నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన శంకుస్థాపన చేయాలి. గ్రామ స్థాయిలో మినీ గిడ్డంగులు, ప్రైవేటు రంగం ప్రవేశం, ఎఫ్‌పీవోల ద్వారా సొంత గిడ్డంగులు... ఈ మూడు దిశల్లో ఏకకాలంలో పనిచేస్తే రైతు పంటకు భద్రత లభిస్తుంది. అతను ధైర్యంగా పండిస్తాడు. దేశం సుభిక్షంగా ఉంటుంది.

రైతుకు సురక్షిత నిల్వ సౌకర్యం కల్పించడం అనేది ఎన్నికల హామీ కాదు, జాతీయ కర్తవ్యం. ఇప్పుడైనా ప్రభుత్వాలు స్పందించాలి. లేకపోతే రైతు రాజు కాదు... రాజ్యం లేని రైతుగానే మిగిలిపోతాడు.

తక్షణ చర్య: రెండేళ్లలో 50 వేల మినీ గిడ్డంగులు (5,000-10,000 టన్నుల సామర్థ్యం) ప్రతి బ్లాక్ స్థాయిలో నిర్మించాలి. దీనికి రూ. 25 వేల కోట్లు అవసరం. ఇది ఒక్క బుల్లెట్ ట్రైన్ ఖర్చుకు సమానం. కానీ దీనితో 10 కోట్ల మంది రైతుల జీవితాలు మారతాయి.

100 శాతం సబ్సిడీతో సిలో బ్యాగ్‌లు: ఒక్కో రైతుకు 5-10 టన్నుల సామర్థ్యం గల హెర్మెటిక్ సిలో బ్యాగ్‌లు (రూ. 15,000-25,000) ఉచితంగా ఇవ్వాలి. దీనితో పొలంలోనే ధాన్యం సురక్షితం.

ఎఫ్‌పీవోలకు గిడ్డంగులు: ప్రతి 10 గ్రామాలకు ఒక రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో) ఏర్పాటు చేసి, వారికి 5-10 కోట్ల రూపాయల వడ్డీ రహిత రుణం ఇచ్చి గిడ్డంగు నిర్మాణం ప్రోత్సహించాలి.

వేర్‌హౌస్ రసీదు విధానం సులభతరం: గిడ్డంగులో ధాన్యం ఉంచిన రసీదుతో బ్యాంకు రుణం 30 నిమిషాల్లో రావాలి. ఇప్పుడు ఇది 30 రోజులు పడుతోంది.

ప్రైవేటు రంగం ప్రవేశం: అదానీ, రిలయన్స్, ఐటీసీ వంటి కంపెనీలకు 10 ఏళ్ల పన్ను మినహాయింపు ఇచ్చి దేశవ్యాప్తంగా గిడ్డంగు చైన్ నిర్మించేలా ప్రోత్సహించాలి.

గ్రామ స్థాయి డ్రైయర్లు: పంట తడిసినా ముద్ద కాకుండా గ్రామంగ్రామానా మొబైల్ డ్రైయర్లు ఏర్పాటు చేయాలి.

**దండంరాజ రాంచందర్ రావు**

# ప్రైవేట్ వైద్యసంస్థల్లో సీఈఏ అమలు కఠినతరం



మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ అథారిటీ సమావేశంలో ప్రైవేట్ వైద్యసంస్థలు తప్పనిసరిగా సీఈఏ రిజిస్ట్రేషన్, రీన్యువల్ పూర్తిచేయాలని స్పష్టం చేస్తూ రిజిస్ట్రేషన్ లేకుండా కార్యకలాపాలు నిర్వహించే ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తప్పవని కమిటీ వెల్లడించింది, సీఈఏ నిబంధనలు, రికార్డు నిర్వహణ, పరిశీలన ప్రమాణాలు, పరికరాలు, వైద్య సిబ్బంది, అవసరమైన పత్రాలపై వైద్యసంస్థలకు ఇవ్వాల్సిన సూచనలు కమిటీ ఖరారు చేసింది, సమావేశంలో వచ్చిన 24 రీన్యువల్ దరఖాస్తులను పరిశీలించి ఆమోదించడమే కాక తదుపరి ఆదేశాల కోసం జిల్లా కలెక్టర్‌కి పంపించారు, అదే సమావేశంలో పీసీపీఎన్డీటీ, సరోగసి, ఎంటీపీ చట్టాల అమలు, తాజా పరిశీలన నివేదికలు, తీసుకోవాల్సిన చర్యలపై కూడా సమగ్రంగా చర్చించి స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించారు, ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా. ఉమా గౌరి, మల్కాజిగిరి అదనపు డీసీపీ వెంకట రామణ, కొంపల్లి ఏసీపీ ఈ. రవికిరణ్ రెడ్డి, ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధి డా. వంశీ కృష్ణ, సీఈఏ-పీసీపీఎన్డీటీ ప్రోగ్రాం అధికారి డా. గీత, డిప్యూటీ డెమో వసంత రెడ్డి, సీఈఏ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

# భారతీయ ప్రాచీన వైద్య విధానాలకు పూర్వవైభవం తథ్యం

**కొండాపూర్ రాజరాజేశ్వర నగర్‌లో ఆయుఃవృద్ధి వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభం**

**అందుబాటులోకి హెూమియో, న్యూట్రిషనల్, యోగ, మ్యూజిక్ థెరపీలు**



శేరిలింగంపల్లి, డిసెంబర్ 5 (జనంసాక్షి): భారత్ లో ప్రాచీన వైద్య విధానాలకు తిరిగి ఆదరణ లభిస్తుండటం శుభ సూచకమని అఖిల భారత ధర్మ జాగరణ సహ ప్రముఖ్ ఆలే శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. కొండాపూర్ రాజరాజేశ్వర నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుఃవృద్ధి హెూమియోపతిక్ అండ్ వెల్‌నెస్ క్లీనిక్ ని ఆయన లాంఛనంగా ప్రారంభించి, సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయుఃవృద్ధి వ్యవస్థాపకురాలు డాక్టర్ సింధు భైరవి, ఫైనాన్స్ డైరెక్టర్ మనోహరి, మ్యూజిక్ థెరపిస్ట్ వశిష్ట రామ్, సలహాదారులు చింతకింది గోవర్ధన్ గౌడ్ లను ఆలె శ్యామ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. శేరిలింగంపల్లి ప్రాంత వాసులకు అధునాతన హెూమియోపతి సేవలతో పాటు న్యూట్రిషనల్, యోగ, మ్యూజిక్ థెరపిలను అందుబాటులోకి తీసుకురావడం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఒకవేళ అనారోగ్యం బారిన పడ్డప్పుడు ప్రాథమిక దశలోనే ఆయుర్వేదం, హెూమియోపతి లాంటి సాంప్రదాయ వైద్యంను ఎంచుకోవాలని సూచించారు. భారతీయ జీవన విధానంలో ప్రాచీన వైద్య విధానాలు ఎన్నో అందుబాటులో ఉండేవని అందులో విశిష్టమైనది మ్యూజిక్ థెరపీ అని అన్నారు. రాగాలను ఉపయోగించి రోగాలను నయం చేసే ప్రాచీన పద్ధతి కాలక్రమంలో కనుమరుగైనప్పటికీ ఇటీవల మళ్లీ ప్రాధాన్యతను సంతరించుకోవడం గొప్ప విషయమని అన్నారు. కరోనా తర్వాత మన ప్రాచీన సాంప్రదాయ వైద్య విధానానికి తిరిగి ఆదరణ లభిస్తుండడం, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కడం మనకెంతో గర్వకారణమని అన్నారు. వెల్‌నెస్ సెంటర్ లోని వివిధ విభాగాలను అతిథులుగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్, ఎస్బిఐ రిటైర్డ్ ఏజీఎం బాల్ద అశోక్, యోగా శిక్షకులు, సీనియర్ జర్నలిస్ట్ పుట్ట వినయ్ కుమార్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త రాఘవేంద్రరావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజా, సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు హెూమియో వైద్య ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిమ్స్‌లో జేరియాట్రిక్ కేర్

**ప్రారంభానికి అవగాహన కార్యక్రమం**



ఖైరతాబాద్, డిసెంబర్ 05 (జనంసాక్షి) : నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్ట్రంలో జేరియాట్రిక్ కేర్ ప్రారంభానికి అవగాహన కార్యక్రమం' నిర్వహించారు. జేరియా ట్రిక్ మెడిసిన్ విభాగాధిపతి డా.వై.ఎస్.ఎన్. రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఎమర్జెన్సీ ట్రామా ఆడి టోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగా ణ రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్, చోంగ్తు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రిస్టినా మాట్లాడు తూ రాష్ట్ర వ్యాప్తంగా వృద్ధుల వైద్య సంరక్షణ (గేరి యట్రిక్ కేర్) ప్రాముఖ్యతపై నిపుణులు సమగ్ర చర్చలు జరపడం ఆనందకరమని పేర్కొన్నారు. వృద్ధుల ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, సామాజిక మద్దతు, ప్రభుత్వ వైద్య సేవల అందుబాటు అం శాలపై అవగాహన పెంచడం చాలా అవసరమని తెలిపారు. డి.ఎం.ఈ. డా. నరేంద్ర కుమార్ మాట్లా డుతూ రాష్ట్రంలో వృద్ధుల ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబ డి ఉందని తెలిపారు. వృద్ధుల కోసం ప్రత్యేక జేరి యాట్రిక్ విభాగాల విస్తరణ, వైద్య సిబ్బందికి శిక్షణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో సేవల విస్తర ణపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. వృద్ధాప్యం జీవన దశ కాదు, అనుభవం, గౌరవానికి ప్రతీకగా చూడాలని ఆయన అన్నారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొ. నగరి బీరప్ప మాట్లాడుతూ నిమ్స్ నిపుణ వైద్యు లు ఈ కార్యక్రమంలో విలువైన ప్రసంగాలు, చర్చ లు, మార్గదర్శక సూచనలు అందించారని అన్నా రు. వృద్ధాప్య దశలో అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డైటీషియన్ షాలిని, హెల్ప్‌ఏజ్ ఇండియా జాయింట్ డైరెక్టర్ వి.యతీంద్ర, ఆర్ఎంవో డా.రేణు పూజిత, వివిధ హాస్పిటల్ మెడికల్ సూపర్టెండెంట్ లు, తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి వచ్చిన జేరియాట్రిక్ మెడిసిన్ వైద్యులు పాల్గొన్నా రు.

# సైబర్ భద్రతను బలోపేతం కోసం ముందడుగు

**డిజిటల్ టెక్నాలజీల అభివృద్ధికి ఐఐటీ కాన్పూర్‌తో ఎన్ఎండీసీ ఒప్పందం**



హైదరాబాద్, డిసెంబర్ 5 (జనంసాక్షి) : పరిశ్రమ-విద్యా సహకారాన్ని బలోపేతం చేసే దిశగా ఒక మైలురాయి అడుగులో, భారతదేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజ ఉత్పత్తిదారు అయిన ఎన్ఎండీసీ, సైబర్ భద్రత రంగాలలో కొత్త చొరవలను సులభతరం చేయడానికి, ఎన్ఎండీసీ కార్యకలాపాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్)తో సహా ఆధునిక డిజిటల్ టెక్నాలజీల స్వీకరణను ప్రోత్సహించడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) కాన్పూర్‌తో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకం చేసింది. ఈ ఒప్పందంపై ఎన్ఎండీసీ తరపున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్) సత్యేంద్ర రాయ్, ఐఐటీ కాన్పూర్ ఆర్అండ్‌డీ డీన్ ప్రొఫెసర్ అశోక్ దే, ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మణీంద్ర అగర్వాల్, ఎన్ఎండీసీ సీనియర్ అధికారులు, ఐఐటీ కాన్పూర్ ప్రతినిధుల సమక్షంలో సంతకం చేశారు. ఈ భాగస్వామ్యం ద్వారా, ఎన్ఎండీసీ సైబర్ భద్రతా ప్రమాద అంచనాలు విధానం, పాలన, సమ్మతి మద్దతు వంటి కీలక రంగాల్లో ఐఐటీ కాన్పూర్‌తో కలిసి పని చేస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ఏకీకరణ, పురోగతిబీ భద్రతా కార్యకలాపాలు, సంఘటన ప్రతిస్పందన : సామర్థ్య నిర్మాణం, జ్ఞాన భాగస్వామ్యం, ఉమ్మడి పరిశోధన, ఆవిష్కరణ. అదనంగా, ఎన్ఎండీసీ ఐఐటీ కాన్పూర్ సంయుక్తంగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తాయి. పరిశోధన కార్యకలాపాలను చేపడతాయి. పైలట్ ప్రాజెక్టులను నిర్వహిస్తాయి. భావన-రుజువు పరిష్కారాలను సహ-అభివృద్ధి చేస్తాయి. ఈ సహకారంపై ఎన్ఎండీ, సీఎండీ అమితవ ముఖర్జీ మాట్లాడుతూ ఎన్ఎండీ విస్తృతమైన కార్యాచరణ పర్యావరణ వ్యవస్థలో ఐఐటీ కాన్పూర్ అధునాతన పరిశోధన సామర్థ్యాలను తీసుకువస్తుంది. ఈ సహకారం మా డిజిటల్ రక్షణలను బలోపేతం చేయడానికి, కార్యాచరణ మేధస్సును మెరుగుపరచడానికి, ఎన్ఎండీసీ కోసం సురక్షితమైన, భవిష్యత్తు-సన్నద్ధమైన సాంకేతిక పునాదిని నిర్మించడంలో మాకు సహాయపడుతుంది. డిజిటల్‌గా బలమైన, భవిష్యత్తు-సన్నద్ధమైన మైనింగ్ సంస్థగా మారడానికి ఎన్ఎండీసీ నిబద్ధతను ఈ అవగాహన ఒప్పందం ప్రతిబింబిస్తుంది.

# చిట్టీల పేరుతో రూ.3 కోట్లు మోసం



ఉప్పల్, డిసెంబర్ 05 (జనంసాక్షి) : ఉప్పల్ అద్దె ఇంట్లో ఉండే దంపతులు చుట్టుపక్కల వారితో పరిచయం పెంచు కున్నారు. చిట్టీలు, అధిక వడ్డీ ఎరచూపి నమ్మకంగా స్థానికుల నుంచి సుమారు రూ.3 కోట్లకు పైగా వసూలు చేశారు. అద్దె ఇంటికి తాళం పెట్టి ఉడాయించిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగినది ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ విషయం. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకానగర్ లోని కుమ్మరికుంటలో జె.సురేష్, జె. శాంతి దంపతులు గత పదేళ్లుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. చుట్టుపక్కల వారి వద్ద నమ్మకంగా ఉంటూ చిట్టీల పేరుతో డబ్బులు వసూలు చేశారు. అత్యధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపించి చాలా మంది వద్ద డబ్బులు వసూలు చేశారు. ఈ విధంగా సుమారు రూ.3 కోట్లకు పైగా వసూలు చేశారు. రాత్రికి రాత్రే పత్తా లేకుండా పోయారు. ఇద్దరి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. మోసపోయినట్లు గుర్తించిన భాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ట్రాన్స్‌పోర్ట్ శాఖ ఆకస్మిక తనిఖీలు



రాజేంద్రనగర్,డిసెంబర్5(జనంసాక్షి) : హైదరాబాద్ ఎయిర్‌పోర్టు ప్రాంతంలో ట్రాన్స్‌పోర్ట్ శాఖ ఎంవీఐ సాయి కృష్ణవేణి ఆధ్వర్యంలో ట్యాక్సీలు, క్యాబులు కమర్షియల్ వాహనాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వైట్ ప్రైవేట్ నంబర్ ప్లేట్లతో కమర్షియల్ సర్వీసులు నడిపినవి, నకిలీ నంబర్లు, తప్పు పత్రాలు ఉన్న వాహనాలను అక్కడికక్కడే సీజ్ చేశారు. అధికారులు హెచ్చరిస్తూ రవాణా నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై భారీ జరిమానాలు, చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. తనిఖీలు కొనసాగనున్నాయని, డ్రైవర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# ఓయూ పోలీస్ స్టేషన్ అభివృద్ధికి హామీ



హైదరాబాద్, డిసెంబర్ 5 (జనంసాక్షి) : ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిని, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డిని వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వివిధ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సీఐ అప్పలనాయుడు ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యవసరంగా చేపట్టాల్సిన పలు మరమ్మతులు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. రోడ్ల దుస్థితి, వీధి దీపాల సమస్యలు, చెట్ల కమ్మలు, శుభ్రత లోపాలు, పహరిగూడ ప్రాంతంలో నీటి సమస్యలు తదితర సమస్యల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలియజేశారు. ఇందుకు సంబంధించి వినతి పత్రాన్ని డిప్యూటీ మేయర్‌కు అందజేశారు. అదనంగా, ఓయూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు అందిస్తున్న ఫిర్యాదుల స్వభావం, వాటి పరిష్కారంపై ఉన్న లోపాలను కూడా డిప్యూటీ మేయర్‌కి వివరించారు. ప్రజల న్యాయసంబంధ సమస్యలు వేగంగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అప్పలనాయుడు కోరగా.. డిప్యూటీ మేయర్ వాటి వివరాలను తెలుసుకుని తగిన సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కొన్ని అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అప్పలనాయుడు కోరారు. దీనిపై వెంటనే స్పందించిన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, ఓయూ పీఎస్ పరిధిలోని అన్ని ముఖ్య ఏరియాలను కవర్ చేసే విధంగా కొత్త సీసీ కెమెరాల అమరిక కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డిప్యూటీ మేయర్ చొరవతో ఓయూ పోలీస్ స్టేషన్, పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి, భద్రత, ప్రజా సేవా వ్యవస్థలు త్వరలోనే మెరుగుపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# 200 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**రైస్ మిల్లులో 11లక్షలు విలువ చేసే రేషన్ బియ్యం స్వాధీనం**

**అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం**

**సివిల్ సప్లయ్ అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ**



మహేశ్వరం,డిసెంబర్ 5 (జనంసాక్షి) : ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యంతో అక్రమ వ్యాపారం చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయ్ అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో సంతోషి మాత రైస్ మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేస్తున్నారని సివిల్ సప్లయ్ అధికారులకు మెదక్ జిల్లా తూప్రాన్ లో ఓ లారీ డ్రైవర్ సమాచారం ఇవ్వడంతో శుక్రవారం మహేశ్వరం మండల కేంద్రంలోని సంతోషిమాత రైస్ మిల్లులో సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు చేపట్టామన్నారు.రైస్ మిల్లులో సుమారు 200-220 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉంటుందన్నారు.స్వాదీనం చేసుకున్న రేషన్ బియ్యం విలువ సుమారు 11 లక్షల రూపాయలు ఉంటుందన్నారు.అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసిన రైస్ మిల్లు యజమాని శివకుమార్ పై మహేశ్వరం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైందన్నారు.గతంలో కూడా పలుమార్లు సంతోషిమాత రైస్ మిల్లులో పలుమార్లు రేషన్ బియ్యాని స్వాధీనం చేశారన్నారు.రైస్ మిల్లుకు రేషన్ బియ్యం ఎక్కడి నుంచి వస్తున్నాయో పూర్తి విచారణ చేపడతామన్నారు.అక్రమంగా రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లల్లో నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.రైస్ మిల్లులో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం సంచులను పరిశీలిస్తే నేరుగా రేషన్ దుకాణాల నుంచి,లబ్ధిదారుల నుంచి,అంగన్వాడీ,హాస్టళ్ల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నట్లు అనుమానం కలుగుతుందన్నారు. ఈ కేసుపై పూర్తి విచారణ చేపడుతున్నామన్నారు. తనిఖీలు చేపట్టిన వారిలో డీసీఎస్ వో వెంకటేశర్లు,డిప్యూటీ తహసీల్దార్లు రామకృష్ణ,రవీందర్ నాయక్,మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు,ఎస్ఐ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్టింగ్ కల్పించండి

**రద్దయిన రైళ్లను పునరుద్ధరించండి : రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వద్దిరాజు వినతి**



ఖమ్మం బ్యూరో (జనంసాక్షి) : ఖమ్మం జిల్లా కేంద్రంతో పాటు వర్తక, వ్యాపార కేంద్రంగా ఉన్న ఖమ్మంలో పలు సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించాలని, కోవిడ్ వ్యాప్తి సమయంలో జిల్లాలో రద్దు చేసిన పలు ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో రైల్వే మంత్రిని కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించిన రైల్వే సమస్యలపై వినతిపత్రం అందజేశారు. బీహార్, ఢిల్లీ, రాజస్థాన్ వైపు వెళ్లే ప్రయాణికులకు సౌలభ్యంగా గయా మాస్, స్వర్ణ జయంతి, జైపూర్ ఎక్స్ ప్రెస్ రైళ్లను ఖమ్మంలో నిలపాలని విజ్ఞప్తి చేశారు. ఇరుముడి ధరించి, అయ్యప్ప సన్నిధానం శబరిమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఖమ్మంలో కేరళ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. గార్ల రైల్వే స్టేషన్లో శాతవాహన, ఇంటర్ సీటీ రైళ్లను ఆపడంతో పాటు స్టేషన్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కోవిడ్ వ్యాప్తి సమయంలో ఉమ్మడి జిల్లాలో రద్దు చేసిన కాజీపేట - విజయవాడ, డోర్నకల్ - భద్రాచలం, కాజీపేట - మణుగూరు, కొల్లాపూర్ ప్యాసింజర్ రైళ్లను పునరుద్దరించాలని, కాకతీయ ప్యాసింజర్ రైలుకు తడికలపూడి, చీమలపాడు, బేతంపూడి స్టేషన్లలో హాల్టింగ్ సదుపాయం కల్పించాలని వినతి పత్రంలో కోరారు. కాజీపేట-విజయవాడ ప్యాసింజర్ రైలు తిరుపతి వరకు పొడిగించి తిరుమల వెళ్లే భక్తుల ఇబ్బందులు తొలగించాలని, భద్రాచలం రోడ్ నుంచి సికింద్రాబాద్ కు ఉదయం పూట మరో రైలును మంజూరు చేయాలని ఎంపీ రవిచంద్ర కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

# అత్యంత ప్రాధాన్యతతో అంధుల పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలి

**విద్య, భద్రత, నైపుణ్యాభివృద్ధి కోసం ఆధునిక వసతులతో ప్రత్యేక స్కూల్ నిర్మాణం**

**అంధ విద్యార్థుల అవసరాలకనుగుణంగా సదుపాయాలు : ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



ఖమ్మం బ్యూరో, డిసెంబర్05 (జనంసాక్షి) : అంధుల విద్యాభివృద్ధి కోసం అత్యున్నత ప్రమాణాలతో ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం జెడ్పీ సెంటర్ లోని నిజాంపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక అంధుల పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించి భవన నిర్మాణ నాణ్యత, ప్రహరీ గోడ గేట్, ప్రవేశ మార్గాలు, అంతర్గత గదుల రూపకల్పన, ఆర్కిటెక్చర్ ఆకృతిని విషయ నిర్ధారణతో మానిటర్ చేశారు. తరగతి గదులు, నైపుణ్యాభివృద్ధి కోసం ఏర్పాట్లు, మ్యూజికల్ పార్క్, సదుపాయాల నమూనా మ్యాప్‌లు, డిజైన్ ఫోటోలను పరిశీలించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. అంధులు పాఠశాలలో ప్రవేశించిన క్షణం నుంచి బయటికి వెళ్లే వరకు పూర్తిస్థాయి భద్రత, సౌలభ్యం లభించేలా నిర్మాణంలో ప్రతిదీ ఖచ్చితత్వంలో ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అంధుల విద్యా అవకాశం దృష్ట్యా ప్రత్యేక పాఠశాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తూ, పనులను వేగవంతం చేసి అత్యుత్తమ నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు. అంధ విద్యార్థులు స్వతంత్రంగా కదలాడేందుకు వీలుగా పాఠశాలను పూర్తిగా బారియర్ ఫ్రీ విధానంలో నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. పాఠశాల అంతటా టాక్టైల్ పాత్‌లు, గైడింగ్ రైలింగ్స్, రఫ్-సర్ఫేస్ మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలో ఏర్పాటు చేయనున్న సెన్సరీ రూమ్, సెన్సరీ గార్డెన్ అంధ విద్యార్థులలో స్పర్శ, శబ్దం, వాసన, దిశ అవగాహన వంటి సామర్థ్యాలను పెంచుతాయని కలెక్టర్ వివరించారు. హైదరాబాద్ లాంటి ప్రత్యేక విద్యా మోడళ్లను ఆధారంగా తీసుకుని ఈ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అంధ విద్యార్థులకు పాఠశాలలో బ్రెయిల్ లిపి పుస్తకాలు, ఆడియో బుక్స్, లెర్నింగ్ డివైజ్‌లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని అన్నారు. నేటితరానికి అనుగుణంగా అంధుల్లో ముఖ్యమైన నైపుణ్యం, కంప్యూటర్ స్కిల్స్ కోసం ల్యాబ్‌ను స్మార్ట్ టెక్నాలజీతో ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులు సాఫ్ట్‌వేర్ స్క్రీన్ రీడర్లు, డిజిటల్ లెర్నింగ్ మాడ్యూల్స్ ద్వారా పాఠాలు నేర్చుకునేలా వాతావరణం ఉండాలన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో ప్రమాదావకాశం లేకుండా చైల్డ్-సేఫ్ స్విచ్‌లు, హై క్వాలిటీ వైరింగ్, అనుకూలమైన లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. అంధ విద్యార్థుల కోసం ప్రత్యేకమైన డెస్కులు, కుర్చీలు, నేర్చుకునే పరికరాలు వినియోగించాలన్నారు. అంధుల పాఠశాల పూర్తయిన తర్వాత ఖమ్మం జిల్లాలోని అంధ విద్యార్థులకు ఇది ఒక ఆధునిక విద్యా కేంద్రంగా నిలువాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆశాభావం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, పంచాయతీరాజ్ ఇఇ మహేష్ బాబు, ఏఈ చిరంజీవి, సంబంధిత విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | శనివారం 06 డిసెంబర్ 2025

# పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన అవసరం

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 5 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులకు పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ బి. ఎం.సంతోష్ అన్నారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహించే రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులకు శుక్రవారం గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన, బాలికల ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న రెండో దశ శిక్షణను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా గ్రామ పంచాయతీల ఐదేళ్ల అభివృద్ధికి ఎన్నుకునే సర్పంచి,వార్డు సభ్యుల పదవులకు నిర్వహిస్తున్న ఈ ఎన్నికలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పోలింగ్‌లో ప్రతి ఒక్క ఓటు ముఖ్యమేనని తెలుసుకోవాలన్నారు. ఓటర్లు తమ ఓటు గల్లంతయిందని, ఇతర సమస్యలు చెప్పకుండా ముందుగానే పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే ముందుగానే మాస్టర్ ట్రైనర్స్ ను అడిగి పరిష్కరించుకోవాలన్నారు. ఈ శిక్షణలో బ్యాలెట్ బాక్స్ లను తెప్పించి మాదిరి పోలింగ్ కూడా చేస్తారన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన అధికారులకు మొదటి విడత ఎన్నికలు జరిగే ఆయా మండలాల్లోని గ్రామాల్లో ఓటు హక్కు ఉంటే ఫామ్ 14 ఇవ్వడం జరుగుతుందని, ఈ దరఖాస్తులను పూరించి సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో అందజేస్తే ఈనెల 8వ తేదీన పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఇతర జిల్లాలకు చెందిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం తమ జిల్లాల్లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు,సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా జాగ్రత్తగా అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణకు హాజరైన అధికారుల హాజరు పట్టికను పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. ఈ పర్యటనలో గద్వాల ఎంపీడీవో శైలజ, ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్,ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా అక్రమ మద్యం అమ్మకాలపై నిఘా పెట్టండి



**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 5 (జనం సాక్షి) :** అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి సుధాకర్ మరియు అడిషనల్ ఎక్సైజ్ సూపర్డెంట్ నరసింహారెడ్డి, మండల స్థాయి సిఐలు ఎస్సై లతో కలిసి తన ఛాంబర్ లో మీటింగ్ తీసుకోవడం జరిగింది టి మీటింగ్లో జిల్లాలోని అన్ని బెల్ట్ షాపుల ను మూసి వేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని. ఏ ఫోర్ షాపులలో ఎక్కువ మొత్తంలో ఐ ఎం ఎల్ మరియు బీర్ అమ్మకుండా పర్యవేక్షణ చేయాలని అనుమతించబడిన పరిమాణానికి మించి బల్క్ లీటర్లను విక్రయించవద్దని అన్ని 4 దుకాణాలకు నోటీసులు జారీ చేయాలని ఎక్సైజ్ అధికారులకు ఆదేశించడం జరిగింది అలాగే ఎన్నికల సందర్భంగా సిబ్బంది అందరూ గ్రామస్థాయిలో విస్తృతంగా పర్యటించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పడం జరిగింది ప్రతిరోజు ఎన్ని కేసులు నమోదయినవి పూర్తి వివరాలు జిల్లా ఎన్నికల అధికారి సెల్ కు అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించడం జరిగింది.

## పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయింపు ప్రక్రియ పూర్తి

- జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్



**గద్వాల నడిగడ్డ,డిసెంబర్ 5 (జనం సాక్షి) :** 2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల రెండు విడత పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. శుక్రవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు గంగాధర్ తో కలిసి రెండో విడత పోలింగ్ సిబ్బందికి రెండవ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఐజ,మల్దకల్, వడ్డేపల్లి, రాజోలి (4)మండలాల్లో నిర్వహించనున్న రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో మొత్తం 716 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.వీటిలో విధులు నిర్వర్తించడానికి పీఓలు 716, ఓపీఓలు 1,007 సిబ్బంది మొత్తం 1,723 మందిని రెండవ ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఒక్కో మండలానికి సంబంధించిన గ్రామపంచాయతీలలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల కోసం అవసరమైన పోలింగ్ అధికారులను ర్యాండమైజేషన్ విధానంలో కేటాయించినట్లు తెలిపారు.పోలింగ్ కేంద్రాలకు పారదర్శకంగా ఎన్ఐసి సాఫ్ట్ వెర్ వినియోగిస్తూ ఆన్లైన్ లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తీ చేయడం జరిగిందని తెలిపారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే ప్రతి సిబ్బందికీ శిక్షణను అత్యంత పక్కాగా,నిబంధనలకు అనుగుణంగా అందించాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు.జిల్లాలో గ్రామస్థాయి ఎన్నికలను పరదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీకాంత్,జెడ్పీ డిప్యూటీ సి.ఈ.ఓ నాగేంద్రం, ఈడియం శివ,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకురాలు భారతి లక్పతి నాయక్



**మెదక్, డిసెంబర్ 5 (జనం సాక్షి) :** జిల్లాలోని కొల్చారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకురాలు భారతి లక్పత్తి నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఎన్నికలను పురస్కరించుకుని గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వికరణ కేంద్రాలను పరిశీలించారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. అవసరమైన వారికి హెల్ప్ డెస్క్ ద్వార సహాయ సహకారాలు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా అమలయ్యేలా చూడాలని, నిర్ణీత గడువు లోపల నామినేషన్ లు స్వీకరించేందుకు టోకెన్లు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చుల వివరాలపై పూర్తి అవగాహన కలిపించాలన్నారు. వ్యయ పరిమితిని పక్కాగా లెక్కించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. ఆమె వెంట నర్సాపూర్ ఆర్ డి వో మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్చారి, ఎం పి డి వో రఫీక్ ఉన్నిసా, ఎం పి వో కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

## స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్




**పాపన్నపేట, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పాపన్నపేట లోని దుర్గమ్మ గైనీ వద్ద ఎన్నికల అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. నిర్ణీత సమయంలోపు అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారాన్ని ముగించాలని, పోలింగ్ బూత్ వద్దకు పార్టీ కండువాలకు అనుమతి లేదన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని, ప్రశాంత వాతావరణంలో ఈ ఎన్నికలు జరగాలన్నారు. ఈసందర్భంగా మెదక్ గ్రామీణ సీఐ జార్జ్,ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## పోలింగ్ మెటీరియల్ పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలి



**రాజాపూర్, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** రాజాపూర్ జడ్.పి.ఉన్నత పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ విజయేందిర బోయి మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా శుక్రవారం రాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. జడ్.పి.ఉన్నత పాఠశాలలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ కి ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో చర్చించి కలెక్టర్ సూచనలు చేసారు. జడ్.పి.ఉన్నత పాఠశాలలోపోలింగ్ మెటీరియల్ పంపిణీకి ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది సంఖ్య కు సరిపడా బస్సులు ఏర్పాటు చేయాలని, వారికి బోజన సదుపాయం,పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఎం పి.డి ఓ కు కలెక్టర్ సూచించారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు అవసరమైన పోలింగ్ సామాగ్రి పంపిణీ సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఎం.పి.డి.ఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ గురించి చర్చించారు. ఎన్నికల విధులలో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ పంపిణీ చేసి వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. మండలంలో ఓ.పి.ఓలకు మరోసారి శిక్షణ నివ్వాలని అన్నారు. గ్రామాలలో ఎఫ్ ఎస్ టి బృందాలు మోడల్ కోడ్ అమలు పర్యవేక్షణ నిర్వహించాలని తహశీల్దార్ కు సూచించారు.

## విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందజేయాలి

- జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా



**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 5 (జనం సాక్షి) :** వసతి గృహ విద్యార్థులకు శుభ్రతతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందజేయాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు.వసతి గృహంలోని వంటగదిని, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. వసతి గృహాన్ని చక్కగా నిర్వహిస్తుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువులో రాణించి 100% ఫలితాలు సాధించాలని సూచించారు. జిల్లాలో ఇటీవల కొన్ని వసతి గృహాల్లో ఆహారం కలుషితమై విద్యార్థులు కొందరు అస్వస్థతకు గురైన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని అలాంటివి పునరావృతం కాకుండా తరచూ ఆకస్మిక తనిఖీలు చేస్తూ, తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

## కురుమల అభివృద్ధికి నిరంతరం కృషి

- మెదక్ జిల్లా అధ్యక్షుడు బీస గోపాల్



**పాపన్నపేట, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** కురుమల అభివృద్ధికీ నిరంతరం కృషి చేస్తానని మెదక్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు బీస గోపాల్ పేర్కొన్నారు. కురుమ సంఘం అధ్యక్షుడిగా పాపన్నపేట మండలం మిన్పూర్ గ్రామానికి చెందిన గోపాల్ ఎన్నికైనందుకు మిన్పూర్ గ్రామ కురుమ సంఘం అధ్యక్షుడు సాహెబ్ గారి మల్లయ్య,ప్రధాన కార్యదర్శి అంతగోని గోపాల్ ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం వారి సంఘం భవనం లో ఘనంగా సన్మానించి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ .. ఎన్నో ఏండ్లుగా పరిష్కారం గాని సమస్యలను పరిష్కరించి కురుమల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండల కురుమ సంఘం అధ్యక్షులు కర్రోల కృష్ణమూర్తి,సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నాణ్యత మైన వైద్య సేవలు అందించాలి

- కోమల్ జనని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 5 (జనం సాక్షి) :** ప్రజలకు నాణ్యత మైన వైద్య సేవలను అందించాలని వైద్యం కోసం వచ్చిన రోగులకు మంచి వైద్య సేవలు అందించి సురక్షితంగా పంపాలని అన్నారు డాక్టర్లే ప్రజలకు దేవుళ్ళని అన్నారు , సంగారెడ్డి బైపాస్ రోడ్ లోనే ఉన్న కోమల్ జనని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని శుక్రవారం ప్రారంభించారు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చింత ప్రభాకర్ హాజరై ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధునాతన వైద్య సదుపాయాలతో, అన్ని విభాగాల్లో నైపుణ్యం కలిగిన వైద్య బృందంతో వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ ఆసుపత్రిలతో పాటు ప్రైవేట్ రంగ ఆసుపత్రిలు కూడా ఆరోగ్య సేవల విస్తరణలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.. ఆస్పత్రి యజమాన్యం.డాక్టర్ కోమల్ జిత్ ఎమ్మెల్యే కు పుష్ప గుచ్చంతో స్వాగతం పలికి. ...శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యజమాన్యం డాక్టర్ కోమల్ జీత్ మాట్లాడుతూ అనుభవం గల డాక్టర్లచే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి రవి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోవర్ధన్ నాయక్, రాకేష్, నాయకులు జీవీ శ్రీనివాస్ ,అఖిల్ తదితరులు ఉన్నారు.

## నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**జడ్చర్ల, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** మండలంలోని గంగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. 3వ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ శుక్రవారంతో ముగుస్తున్నందున నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన నామినేషన్ పత్రాలను సరిగ్గా పరిశీలించి నమోదు చేసుకోవాలని, నిర్ణీత సమయం లోగా వచ్చిన నామినేషన్లు స్వీకరించాలని అన్నారు. రద్దీని సమర్ధవంతంగా నిర్వహించేందుకు అదనపు సిబ్బందిని నియమించి, నామినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, నామినేషన్ డేటాను ఎప్పటికప్పుడు టి పోల్ సాఫ్ట్వేర్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. నామినేషన్లు సమయానికి పూర్తి చేయాలని, 5 గంటలలోపు వచ్చిన అభ్యర్థులకు వరుస క్రమంలో ఆఖరి నుండి టోకెన్ స్లిప్‌లు ఇవ్వాలని, సాయంత్రం 5 గంటల తరువాత ఎట్టి పరిస్థితులలో కొత్త నామినేషన్లు స్వీకరించవద్దని ఆదేశించారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పారదర్శకంగా, న్యాయంగా, ఎన్నికల సంఘం జారీచేసిన నియమ నిబంధనలను పాటిస్తూ, ఎటువంటి పొరపాట్లు జరగకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, అధికారులు తదితరులు ఉన్నారు

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 5 (జనం సాక్షి) :** విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. స్థానిక వెస్లీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇన్స్పైర్, సైన్స్ ఫెయిర్ కార్యక్రమం శక్రవారం ముగిసినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగేష్ అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీ మహేందర్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని వారి తరగతి గదులలో బోధిస్తున్నటువంటి విజ్ఞాన శాస్త్రాన్ని వంట పట్టించుకోని బయటి ప్రపంచాన్ని ఆ దృక్పథంతో గమనించి, వారు నేర్చుకున్న శాస్త్రీయ అంశాలను నిజ జీవితానికి అనవయించుకొని, వినూత్నంగా ఆలోచించి కొత్త కొత్త ఆవిష్కరణలకు బీజం వెయ్యాలని సూచించారు. ఈసారి విజేతలుగా నిలువని విద్యార్థులందరూ వచ్చే సంవత్సరం ఇదే కార్యక్రమానికి మరింత మెరుగుగా ప్రాజెక్టు తీసుకొని రావాలని, వచ్చేసారి విజేతలుగా నిలవాలి అని అన్నారు. విజేతలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు పాల్గొన్న విద్యార్థులందరికీ ఆశీస్సులు అందించారు. అలాగే ఈ కార్యక్రమ నిర్వహణకు కృషిచేసిన కార్యాలయ సిబ్బందిని వివిధ కమిటీల కన్వీనర్లను కో కన్వీనర్లను మరియు ఉపాధ్యాయ సంఘం బాధ్యులను ఆతిథ్యం ఇచ్చినందుకు వెస్లీ ఉన్నత పాఠశాల సిబ్బందిని యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమం ముగింపు సమావేశం లో మొత్తం 50 మంది విజేతలకు ముఖ్య అతిధి సర్టిఫికెట్ మరియు శీల్డులు అందించారు. ఇందులో సైన్స్ ఫెయిర్ 7 సబ్ థీమ్స్ లో జూనియర్, సీనియర్ విభాగాల్లో మొదటి రెండో మూడవ బహుమతులు మరియు ఇన్స్పైర్ లో 5 రాష్ట్ర స్థాయి ఎంపికలు, సెమినార్ విభాగం లో మొదటి, రెండెవ మూడవ, టి ఎల్ ఎం తయారీలో మొదటి, రెండవ బహుమతులు ఉన్నాయి. పాల్గొన్న అందరికి (విద్యార్థులు, గైడ్ టీచర్లు) పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ అందచేయ్యటం జరిగింది. మొదటి స్థానం పొందిన విజేతలు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారు ఈ కార్యక్రమంలో సీఈఓ జిల్లా పరిషత్ ఎల్లయ్య, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి

- డిఈఓగా ఇన్చార్జి బాధ్యతలు చేపడుతున్న వెంకటరెడ్డి
- స్కూల్ అనుమతి కోసం 60,000 లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ వెంకటరెడ్డి
- జూనియర్ అసిస్టెంట్‌లు గౌస్, మనోజ్‌లు



హనుమకొండ ప్రతి నిధి, డిసెంబర్ 5 (జనంసాక్షి) : హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి జూనియర్ అసిస్టెంట్‌లు గౌస్, మనోజ్‌లు 60000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న వెంకటరెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారిగా ఇన్చార్జి బాధ్యతలు చేపట్టడం జరుగుచున్నది అదేవిధంగా పరకాల మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు కూడా చేపడుతున్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కొత్తూరు హై స్కూల్ అనుమతి పునరుద్ధరణకు 60000 లంచం తీసుకుంటుండగా కలెక్టరేట్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి తో పాటు జూనియర్ అసిస్టెంట్ లు గౌస్ మనోజ్ ను కూడా ఏసీబీ వలలో చిక్కుకున్నారు. పట్టుపడ్డ అధికారులను ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. ప్రభుత్వ సేవకులు ఎవరైనా లంచం కోరిన పక్షంలో ప్రజలు వెంటనే తెలంగాణ అవినీతి నిరోధక శాఖను సంప్రదించాలని ఏసీబీ విజ్ఞప్తి చేసింది.



# హోరాహోరీగా నామినేషన్లు

- ముగిసిన నామినేషన్ల పర్వం

చెన్నారావుపేట, డిసెంబర్ 5 (జనం సాక్షి): నామినేషన్ల ప్రక్రియ చెన్నారావుపేట మండలంలో శుక్రవారం హెూరాహెూరీగా కొనసాగింది. మూడో విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో భాగంగా ఈనెల 3వ తేదీ నుండి నామినేషన్ల పర్వం కొనసాగుతుంది.నేడు శుక్రవారం ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల పర్వం ముగిసింది. చివరి రోజు కావడంతో ఉదయం 10 గంటల నుండి అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి, ఇండిపెండెంట్ అభ్యర్థులు 10 క్లస్టర్ గ్రామాలలో ఏర్పాటుచేసిన నామినేషన్ల కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అనంతరం తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందించారు. గ్రామాలలో ఎటు చూసినా ఎన్నికల కోలాహలం కనిపించింది. అభ్యర్థులతో పాటు తమకు మద్దతు తెలిపే వారంతా రావడంతో నామినేషన్ కేంద్రాల వద్ద సందడి వాతావరణం కనిపించింది. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును నిర్వహించారు. ఎట్టకేలకు మూడవ రోజైన శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

# శుభ్రతపై కొరవడిన అధికారుల పనితీరు!

- జనంసాక్షి ఎఫెక్ట్... స్పందించిన అధికారులు...!
- పంచాయితీ అధికారుల పనితీరుపై ప్రజలు ఆగ్రహం...
- తాత్కాలికంగానే శుభ్రపరచి చేతులు దులుపుకున్న అధికారుల పనితీరు..



వెక్కిరిస్తున్న పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యం!

- సామూహిక మూత్రశాలలు నిర్మించారు కానీ నిర్వహణ మరిచారు
- లక్షలాది రూపాయల సొమ్ము వృథా పాలు
- నిర్లక్ష్యపు వైఖరిలో పంచాయతీరాజ్ అధికారులు
- నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా దర్శనమిస్తున్న మరుగుదొడ్లు

వార్త మెయిన్ 7లో

జనంసాక్షి
05 Dec 2025 - Page 1
https://epaper.janamsakshi.org/clip/426197



మంగపేట డిసెంబర్ 05(జనంసాక్షి) : ప్రజలు నిత్యం అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చేటువంటి వారి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామూహిక మూత్రశాలలు, మరుగుదొడ్లు లను 'స్వచ్ఛభారత్' అనే పేరుతో నిర్మించారు. కానీ హడావుడిగా నిర్మించిన అధికారులు వాటికి నీటి సరఫరా, నిర్వహణ సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడంతో పూర్తిగా నిరుపయోగంగా మారిపోయాయి. ఈ విషయాన్ని జనంసాక్షి దినపత్రిక గురువారం పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యపు వైఖరిని తెలుపుతూ 'వెక్కిరిస్తున్న పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యం' అనే వార్తలు ప్రచురించగా శుక్రవారం స్పందించిన పంచాయతీరాజ్ అధికారులు సామూహిక మరుగుదొడ్లను తూతూ మంత్రంగానే శుభ్రం చేసిన చేతులు దులుపుకున్నారు. ఈ విషయంపై శుక్రవారం జనంసాక్షి ప్రత్యక్షంగా సామూహిక మరుగుదొడ్లను పరిశీలించగా కేవలం చెత్త చేదరాన్ని మాత్రమే తొలగించి శుభ్రం చేసినట్లు గుర్తించింది. పూర్తిస్థాయిలో ఎటువంటి శుభ్రత చేయకపోవడంపై ప్రజలు తీవ్రంగా అసహనం వ్యక్తం చేశారు. అసలు లక్షలాది రూపాయలు సొమ్ము వెచ్చించి కనీసం నీటి సౌకర్యం, నిర్వహణ సిబ్బందిని నియమించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. అసలు మూత్రశాలలు, మరుగుదొడ్ల లను నిర్మించాలంటే ముందుగా నీటి సౌకర్యం ఉండాలి కానీ అటువంటి సౌకర్యాలు లేకుండానే వాటి నిర్మించడం ఎందుకు అని ప్రజలు మండిపడ్డారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించే సమయంలో నీటి సౌకర్యం కొరకు పైప్ లైన్ , వాటర్ ట్యాంక్ లను కూడా ఏర్పాటు చేశారు కానీ నీటిని ట్యాంకులలో నింపేందుకు ఎందుకు చర్యలు చేపట్ట లేకపోతున్నారు అని ప్రజలు బహిర్గతంగానే చర్చించుకుం టున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో వాటర్ ట్యాంకర్ లో నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలి

- ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



రాయపర్తి, డిసెంబర్ 05(జనంసాక్షి): సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.రాయపర్తి మండలంలోని బంధన్ పల్లి,ఏకే తండా, పెర్కవేడు, గట్టికల్, ఊకల్, పాన్నితండా, జగన్నాథపల్లి, దుబ్బ తండా గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థుల విస్తృత ప్రచారంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామల అభివృద్ధి,తెగల సంక్షేమం,పబ్లిక్ వసతుల విస్తరణ,శుద్ధి నీటి,రోడ్డు సౌకర్యాల సమస్యలు త్వరగా పరిష్కరించడానికి కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.గ్రామ భవిష్యత్తు కోసం సరైన నాయకుడిని ఎన్నుకోవాల్సిన సమయం ఇదేనని,సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మీ విలువైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె గ్రామస్తులను కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని అన్నారు.పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్య నాయక్,మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి,అయి గ్రామల సర్పంచ్ అభ్యర్థులు,నాయకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




ములుగు ప్రతినిధి, డిసెంబర్ 05(జనంసాక్షి) : మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల వద్ద పంచాయతీ ఎన్నికల ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని అన్నారు. ఎన్నికల కమీషన్ సూచనల మేరకు ఎన్నికల విధులు నిర్వహించే ఓటర్లకు, అత్యవసర సేవలలో పనిచేసే ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని, దీనికోసం పోస్టల్ ఓటింగ్ కేంద్రం/ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం సంబంధిత మండలాల ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరిగే ఎస్ఎస్ తాడ్వాయి, ఏటూరునాగారం, గోవిందరావుపేట మండలాలలో డిసెంబర్ 7 న, రెండవ విడత ఎన్నికలు జరిగే మల్లంపల్లి, ములుగు, వెంకటాపూర్ మండలాలలో డిసెంబర్ 12న, మూడవ విడత ఎన్నికలు జరిగే వెంకటాపురం, వాజేడు, కన్నాయిగూడెం మండలాలలో డిసెంబర్ 15 న సంబంధిత మండల ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పోస్టల్ బ్యాలెట్స్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేసినట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించండి

- ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్



గూడూరు, డిసెంబర్ 05(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ అన్నారు. శుక్రవారం గూడూరు మండలంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.మొదట గూడూరు మండలంలోని ఎర్రకుంట తండా గ్రామ పంచాయతీ నుండి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్,వార్డ్ సభ్యులను అధిక మెజారిటీతో గెలిపించాలని, పేద ప్రజల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని,మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ లకు,వార్డు సభ్యులను అందరు కలసి కట్టుగా గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి 41గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రమేష్ చందర్ రెడ్డి,మండల అధ్యక్షులు చిట్టె వెంకన్న, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా

చెన్నారావుపేట, డిసెంబర్ 5 (జనం సాక్షి): తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి, చెన్నారావుపేట తహసిల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మహమ్మద్ అంజద్ ఖాన్ తెలిపారు. శుక్రవారం తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి నా ఇష్టపూర్వకంగా ఎవరి బలవంతం లేకుండా రాజీనామా చేస్తున్నట్లు తన రాజీనామా పత్రాన్ని పంపించినట్లు ఆయన తెలిపారు.

# రైతులు శాస్త్రీయ మార్గంలో పంటలను సాగు చేయాలి




వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 05 (జనం సాక్షి) : పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విద్యాలయం పరిధిలో కృషి విజ్ఞాన కేంద్రం మామునూరులో ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించబడినది. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా మామునూరులో ఉన్నటువంటి పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విద్యాలయం అసోసియేట్ డీన్ డా. శ్రీనివాస్ రెడ్డి మరియు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. బిందు మాధురి ప్రధాన అతిథులుగా పాల్గొన్నారు.పరిశోధన ఉద్దేశించి డా. బిందు మాధురిమాట్లాడుతూ, కృషి విజ్ఞాన కేంద్రం రైతుల కోసం చేస్తున్న కార్యక్రమాలు, శిక్షణలు, నేల పరీక్ష ప్రయోగశాలలో అందిస్తున్న సేవలను వివరించారు. అలాగే రైతులు పంటల ఎంపికలో నేల స్వభావాన్ని అర్థం చేసుకుని శాస్త్రీయ మార్గాల్లో పంట సాగు చేయాలని సూచించారు. తర్వాత అసోసియేట్ డీన్ డా. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, నేల పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. అలాగే రైతులు నేల సారాన్ని కాపాడుకునేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో పంటల మార్పిడి, సేంద్రియ పదార్థాల వినియోగం, మరియు నేల ఆరోగ్య కార్డుల ప్రాముఖ్యతను కూడా వివరించారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు నేల నిర్వహణ కీలకమని సూచించారు.డా. సిహెచ్ సౌమ్య సేద్య విభాగ శాస్త్రవేత్త మాట్లాడుతూ పచ్చి రొట్టె పంటలు, పప్పు దినుసు పంటలు, సేంద్రియ పదార్థాన్ని నేలకు అందించి నేల భౌతిక స్థితిని, నీటిని నిల్వ ఉంచుకునే తత్వాన్ని వివరించారు. డా. రాజు సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త మాట్లాడుతూ సేంద్రియ ఎరువులైన పశువుల ఎరువు, జీవన సంబంధిత ఎరువులైన ట్రైకోడెర్మా వీరిడే, వాటి ఉపయోగం మరియు వాడే పద్ధతిని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ కెమికల్స్ ఫర్టిలైజర్స్ రీజినల్ మేనేజర్ పురుషోత్తం, సీనియర్ ఆఫీసర్ అభిజిత్, కె వి కె శాస్త్రవేత్తలు డా. సాయికిరణ్, డా. గణేష, యంగ్ ప్రొఫెషనల్ హర్ష రెడ్డి మరియు ఇతర రైతులు పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లాలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

మంచిర్యాల ప్రతినిధి, డిసెంబర్ 5, (జనంసాక్షి) : మంచిర్యాల జిల్లాలో సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌లో ఒక ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వలను గుర్తించి వాటిని సీజ్ చేసినట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. ఎన్టీఆర్ నగర్‌లో అక్రమంగా ఒక ఇంట్లో నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంకు తరలించారు. అలాగే మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని ఇందారం, కుందారం, టేకుమట్ల లో ఉన్న రైస్ మిల్లులపై వచ్చిన ఫిర్యాదుల్లో భాగంగా రైసు మిల్లులను తనిఖీ చేసినట్లు తెలిపారు. గత సంవత్సరం రబీ సీజన్‌లో కొనుగోలు కేంద్రం నుండి రైస్‌మిల్‌కు పంపిన ధాన్యంలో తేడాలు ఉన్నట్లు అందిన ఫిర్యాదుల్లో భాగంగా రైస్ మిల్ లు తనిఖీలు చేయగా ఫిర్యాదులో పంపిన తేడాలకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. అన్ని సక్రమంగా ఉన్నట్లు తెలిపారు .ఈ తనిఖీల్లో టాస్క్ ఫోర్స్ అధికారులు శ్రీధర్ రెడ్డి ,రోహిత్ లు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలోనే అత్యధిక ఏకగ్రీవాలు

- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- నియోజకవర్గంలో 12గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం
- ఏకగ్రీవ సర్పంచ్ లను సన్మానించిన ఎమ్మెల్యే



స్టేషన్ ఘన్ పూర్, డిసెంబర్ 05 ( జనం సాక్షి ) : జనగామ జిల్లా పరిధిలో అత్యధిక ఏకగ్రీవాలు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోనే కావడం చాల సంతోష మని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోనియో జకవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ లతో ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయి ఏకగ్రీవంగా ఎన్నికై న సర్పంచ్ లను శాలువాలతో సత్కరించి శుభాకాంక్ష లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో మొదటి విడతలో ఎన్నికలు జరుగుతున్న 110గ్రామ పంచాయతీలకు 10 గ్రామ పంచాయతీలు అలాగే రెండవ విడతలో ఎన్నికలు జరగనున్న ధర్మసాగర్, వేలేరు మండలాలలో 2,గ్రామ పంచాయితీలు మొత్తం 12గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయని తెలిపారు. ధర్మసాగర్, వేలేరు మండలాలలో విత్ డ్రా కు రేపటి వరకు సమయం ఉన్నందున మరిన్ని ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంద ని అన్నారు. ఏకగ్రీవం అయిన గ్రామ పంచాయతీలలో అభివృద్ధిపనులకు తక్షణమే25లక్షలప్రభుత్వ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.గ్రామాల అభివృ ద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు సర్పంచ్ ను ఎన్నుకోవా లని సూచించారు. ఇంకా 3ఏళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని ఏ రకమైన అభివృద్ధి జరగా లన్న కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందని తెలిపారు. ఇతర పార్టీల అభ్యర్థులు గెలుస్తే ప్రభుత్వం దగ్గరికి, ఎమ్మెల్యే దగ్గరకు రాలేరని దింతో గ్రామ అభి వృద్ధి కుంటు పడుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ మారు జోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి,చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, నియోజకవర్గ నాయకులు, ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ లు, వార్డు మెంబర్లు, ఇతర నాయకు లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 'నవోదయ' ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాల ఏర్పాటు.
- పరీక్ష రాయనున్న 515 మంది విద్యార్థులు.
- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి



ములుగు ప్రతినిధి, డిసెంబర్ 05(జనంసాక్షి) : జిల్లాలో నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని, జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలలో 515 మంది విద్యార్థులు పరీక్ష వ్రాయనున్నారని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి తెలిపారు. శుక్రవారం అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి తన ఛాంబర్ లో జవహర్ నవోదయ విద్యాలయ అధికారులు, సంబంధిత అధికారులతో పరీక్ష ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి మాట్లాడుతూ మామునూరు జవహర్ నవోదయ విద్యాలయ వరంగల్ జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరం లో ఆరవ తరగతిలో ప్రవేశం కొరకు ఈ నెల 13వ తేది న ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని అన్నారు. ములుగు జిల్లాలో ప్రవేశ పరీక్ష కోసం ఏటూరునాగారం లోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 162 మంది విద్యార్థులు, ములుగు బండారుపల్లి ఆదర్శ పాఠశాలలో 192 మంది విద్యార్థులు, ములుగు జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో 161 మంది విద్యార్థులు, మొత్తం మూడు పరీక్షా కేంద్రాలలో 515 విద్యార్థులు పరీక్ష వ్రాయనున్నారని, ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు %ఃఃఃఃఖుజశీఃఖుఖు.ృశీఱ.ఱఅ% వెబ్ సైట్ నుంచి హాల్ టికెట్ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారు విద్యాలయ హెల్ప్ లైన్ నెంబర్ 9110782213 కి ఫోన్ చేసి తమ వివరాలు తెలిపి హాల్ టికెట్ ను పొందవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందని, విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు త్రాగునీరు, ఎమర్జెన్సీ సర్వీస్, ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఇంచార్జి లక్ష్మ రెడ్డి, కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్, పర్యవేక్షకులు సలీం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
06 డిసెంబర్ 2025

# కోదాడ నియోజకవర్గంలో కట్టుదిట్టమైన నిఘా

- ఇతర రాష్ట్రాల ధాన్యం రాకుండా ఆరు చెక్‌పోస్టులు
- గ్రామపంచాయతీ ఎన్నికల భద్రత పకడ్బందీ
- మొత్తం 77 సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా



**కోదాడ, డిసెంబర్ 5 (జనం సాక్షి) :** కోదాడ నియోజకవర్గంలో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కోదాడ సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల ఏర్పాట్లు, ఎన్నికల నిర్వహణ, అక్రమ రవాణాపై పై జిల్లా ఎస్పీ ఆదేశాల నేపథ్యంలో, ఇతర రాష్ట్రాల నుండి అనుమతి లేకుండా ధాన్యం రాష్ట్రంలోకి ప్రవేశించకుండా ఆరు ప్రధాన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ చెక్‌పోస్టుల వద్ద 24 గంటలపాటు పోలీస్ సిబ్బంది నిఘా కొనసాగిస్తూ, అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు వివరించారు.అనుమతి లేకుండా లేదా సరైన పత్రాలు లేకుండా రాష్ట్రంలోకి ధాన్యం రవాణా చేసే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఇప్పటివరకు ఏడు లారీలు, ఒక ట్రాక్టర్‌పై కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. సివిల్ సప్లయ్స్ శాఖతో దగ్గరగా సమన్వయం చేస్తూ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతున్నట్టు చెప్పారు. మరెవరు అనుమతి లేకుండా ధాన్యం రవాణా చేస్తే క్షమించేది లేదని, వెంటనే కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.ఇక ఎన్నికల నేపథ్యంలో తీసుకున్న చర్యలను వివరించిన డీఎస్పీ, సూర్యాపేట జిల్లాలో జరుగుతున్న రెండు, మూడు విడతల గ్రామపంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా, శాంతియుతంగా నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసినట్టు తెలిపారు. కోదాడ నియోజకవర్గం మొత్తం 120గ్రామపంచాయతీలను పరిశీలించగా, వీటిలో 77 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి, అదనపు బలగాలను మోహరింపజేసి, నిఘాను పెంచినట్టు అన్నారు.ప్రజల్లో ఎన్నికలపై, శాంతిభద్రతలపై అవగాహన పెంచేందుకు పోలీస్ శాఖ వినూత్న చర్యలు చేపట్టిందని చెప్పారు. పోలీసుల కళాజాత బృందం గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు చట్టపరమైన అవగాహన, ఎన్నికల నిబంధనలు, అక్రమ రవాణాపై శిక్షలు వంటి అంశాలపై చైతన్యం కల్పిస్తున్నట్టు వివరించారు. ప్రజల సహకారంతోనే శాంతి భద్రతలు మరింత బలపడతాయని, అందరూ చట్టాలను గౌరవించి పోలీసులకు సహకరించాలని డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.జిల్లాలో నేర చర్యలను అరికట్టేందుకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని, ఎలాంటి ఘటన జరిగిన వెంటనే చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక పహారా బృందాలు, మొబైల్ పార్టీలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఎన్నికల కాలంలో గానీ, సాధారణ రోజుల్లో గానీ, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మరోసారి డీఎస్పీ స్పష్టం చేశారు.

## శేరిపల్లి రహదారిలో సీఎం బహిరంగ సభ

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**దేవరకొండ, డిసెంబర్ 5 (జనం సాక్షి) :** ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా ఈ నెల 6 న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా, దేవరకొండ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.శుక్రవారం ఆమె జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి దేవరకొండ రాక సందర్భంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు.మున్సిపాలిటీ పరిధిలోని శేరిపల్లి రహదారిలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొన్న బహిరంగ సభ తోపాటు, హెలిప్యాడ్,తదితర అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో వివిధ వార్డులలో సిసి రోడ్లు, సిసి డ్రైన్లు, పార్కు, జూనియర్ కళాశాల గ్రౌండ్ అభివృద్ధి వంటి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ ఆర్‌డిఓ రమణారెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు ఉన్నారు.

## ఎన్నికల సిబ్బందికి సహకరించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** టోకెన్స్ జారీ చేసిన ప్రతి ఒక్కరి నామినేషన్ పత్రాలు స్వీకరించటం జరుగుతుందని, అభ్యర్థులు ఆందోళన పడకుండా ఎన్నికల సిబ్బందికి సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు.మఠంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మఠంపల్లి క్లస్టర్ లో మఠంపల్లి, గుండ్లపల్లి, రఘునాథపాలెం, చౌటపల్లి, బక్కమంతులగూడెం గ్రామాలకు చెందిన సర్పంచ్, వార్డ్ సభ్యుల నామినేషన్ పత్రాలు స్వీకరించటం జరుగుతుందని తెలిపారు.నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు సాయంత్రం 5 గంటలు దాటినా తర్వాత నామినేషన్ కేంద్రం ఆవరణలో ఉన్న ప్రతి ఒక్కరికి టోకెన్స్ జారీ చేయటం జరిగిందని అన్నారు. అభ్యర్థులు అందరు సిబ్బందికి సహకరిస్తే మరో కౌంటర్ ఏర్పాటు చేసి వేగవంతంగా వరుస క్రమంలో నామినేషన్ పత్రాలు తీసుకుంటామని తెలిపారు.అప్పటి వరకు అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా కూర్చునేందుకు కుర్చీలు, త్రాగునీరు లాంటి మౌళిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మంగ, ఎంపిడిఓ జగదీశ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన చండూరు డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్



**చండూరు, మండలం డిసెంబర్ 5 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా చండూరు మండలం తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దారుగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను ఓ రైతు నుండి సుమారు రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా హైదరాబాదులో తన నివాసంలో ఏ.సీ.బీ అధికారులు గురువారం రాత్రి పట్టుకున్నారు. వివరాలలోకి వెళితే మర్రిగూడ మండలంలో డిప్యూటీ తాసిల్దారుగా పనిచేస్తున్న చంద్రశేఖర్ జూలై 23న బదిలీపై చండూరుకు వచ్చారు. అప్పటినుంచి సుమారు నాలుగు నెలల పాటు ఇన్చార్జి తాసిల్దారుగా నిధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గట్టుపల్ మండలం తెరట్‌పల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పొలం తన తండ్రి పేరు మీద నుంచి వేరే వ్యక్తులకు బదిలీ అయింది. ఈ భూమి ఎప్పుడు ఎలా బదిలీ అయిందో వివరాలు తెలపాలని సమాచార హక్కు చట్టం కింద బాధితుడు వివరాలు కోరాడు. సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడు. బాధితుడు గట్టిగా నిలదీయగా అందుకు గాను సుమారు రూ.20 వేలు డిమాండ్ చేయగా బాధితుడు ఏ.సీ.బీ. అధికారులని ఆశ్రయించాడు. బాధితుడు ఇచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్ బాలాపూర్‌లోని తన నివాసంలో ఏ.సీ.బీ అధికారులు పట్టుకున్నారు. చంద్రశేఖర్ ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏ.సీ.బీ డీ.ఎస్పీ తెలిపారు.

## తుదిశ్వాస వరకు దామన్న చూపిన బాటలోనే పయనిస్తాం

- అవకాశం వస్తే పోతు భాస్కర్‌ను జడ్పీ చైర్మన్‌ను చేస్తాం



**సూర్యాపేట, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** గత 40 ఏళ్లుగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అనుచరుడిగా ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ నమ్మకానికి, విశ్వాసానికి మారుపేరని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు ప్రాంతాల్లో, మాజీ కౌన్సిలర్ బైరు శైలేందర్ ఆధ్వర్యంలో పోతు భాస్కర్ నివాసంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు దామన్న నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు అండగా ఉంటూ ఏ పదవి ఆశించకుండా దామన్న శ్రేయస్సు కోసం పని చేశామన్నారు.పోతు భాస్కర్ పదవులు వద్దని చెప్పి తాము దామన్నతోనే ఉంటామని, దామన్న నాయకత్వంలో ఒక టీమ్ గా ఉండి తనకు మార్కెట్ చైర్మన్ గా అవకాశం అందించినట్లు గుర్తు చేశారు. నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటూ దామన్న ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని పని చేస్తామన్నారు.ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి ఆర్డీఆర్, మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ మనుషులు వేరైనా ముగ్గురు ఒకే ఆత్మగా ఉన్నారని అన్నారు.రాజకీయాల్లో దామన్న అందరి గురించి ఆలోచన చేసిన తన కుటుంబం గురించి ఆలోచన చేయలేదని, తన కుటుంబం అంటే కొప్పుల వేణారెడ్డి,పోతు భాస్కర్ అని అన్నారు.వేణారెడ్డికి ఒక పదవి వచ్చిందని, పోతు భాస్కర్ కు కూడా ఏదో ఒకటి చేయ్యాలని దామన్న తలచారని, దేవుడి ఆశీస్సులతో తప్పకుండా పోతు భాస్కర్ కు కూడా పదవి వస్తుందన్నారు.ఆర్డీఆర్ చనిపోయిన నాటి నుంచి గతంలో ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా నాతో అలాగే ఉన్నారని, పెద్దన్నలుగా ఉండి అన్ని విషయాల్లో సలహాలు ఇస్తూ దామన్న లేని లోటు వీరిలో చూసుకుంటున్నానని అన్నారు.అవకాశం వస్తే జిల్లా పరిషత్ చైర్మ న్ ను పోతు భాస్కర్ ను చేస్తామన్నారు.ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## జాగ్రత్తగా పరిశీలించి నామినేషన్లు స్వీకరించాలి



**కొండమల్లేపల్లి, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** మూడో విడత గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి ఆయా పంచాయతీలకు ఖరారు చేసిన రిజర్వేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి సరిచూసుకొని పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మి ఐఏఎస్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని కేశ్యతండా క్లస్టర్ పరిధిలో నామినేషన్ కేంద్రాలను ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసే అభ్యర్థుల దరఖాస్తుకు జతపరచాల్సిన వయస్సు, కుల ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలను నిబంధనల ప్రకారం స్వీకరించాలని రిటర్నింగ్ అధికారులకు ఆదేశించారు. నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు రాకుండా నిబంధనల ప్రకారం సరిచూసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల పరిశీలకురాలు వెంట జడ్పీ సీఈఓ శ్రీనివాస్ రావు, డిపిఓ వెంకయ్య, ఆర్డీఓ రమణారెడ్డి, తహసిల్దార్ నరేందర్, ఎంపిడిఓ స్వర్ణలత, ఎంపిఓ సుధీర్ కుమార్, ఎస్ఐ అజ్మీర రమేష్, పంచాయతీ సెక్రటరీ వెంకటయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెట్టకండి

- ఒకరోజు లాభం కోసం, నూరేళ్ల నష్టం తెచ్చుకోకండి



**మధిర, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు గెలుపు కోసం భారీగా డబ్బు ఖర్చు పెడుతున్న దృశ్యం మరోసారి ఎన్నికల వేళ హాట్‌టాపిక్ అయింది. "పోయిన సారి గెలిచిన సర్పంచ్‌లతో ఒక్కసారి మాట్లాడండి సుఖానికి వచ్చినా సొమ్ము పోదు, బాధకు వచ్చినా బుద్ధి రాదు అనేలా వారు పడిన ఇబ్బందులు తెలుసుకుంటే అభ్యర్థులే కాదు, ఓటర్లూ షాక్ అవుతారు అని గ్రామ పెద్దలు చెబుతున్నారు. గత సారి గెలిచిన అనేక మంది సర్పంచ్‌లు ఈసారి పోటీలో నిలబడేందుకు కూడా ధైర్యం చేయకపోవడం వెనుక అసలు కారణం ౦ అప్పుల భారం, ఆర్థిక ఒత్తిడి. వద్దన్నా వడగళ్ల వాన, కోరన్నా కోడి గుడ్డు అన్నట్లుగా అభివృద్ధి పనులు, ప్రజా ఒత్తిళ్లు, రాజకీయ లెక్కలతో వారు సహనం కోల్పోయి చాలామంది పక్కన కూర్చున్నారు. ఓటర్లకు హెచ్చరిక ౦ ఒకసారి డబ్బు తీసుకుంటే మీ నోరు మీరే కట్టేసుకున్నట్టే ఓటర్లు కూడా ఓటు వేయడానికి ముందు ఒక్కసారి ఆలోచించాలి. మీ గ్రామం ఇప్పటివరకు ఎంత అభివృద్ధి చెందింది?ఎందుకు వెనకపడుతోంది..? ఓటుకు ఒక్కరోజు ఇచ్చే 500, 1,000, 1,500, 2,000, 3,000 కొన్నిచోట్ల 5,000 రూపాయలు కోసం గ్రామ భవిష్యత్తునే తాకట్టు పెట్టడం చెయ్యి ఇచ్చి చెంప కొట్టించుకున్నట్టు అవుతుందని పెద్దలు హెచ్చరిస్తున్నారు. కొంచెం ప్రయోజనానికి పెద్ద నష్టం తెచ్చుకోకు రోజుకి దొరికిన చిల్లరకి రేపటి అన్నం అమ్ముకోకు అన్నట్లుగా ఓటరు డబ్బు తీసుకునే నిర్ణయం మొత్తం గ్రామాన్ని వెనక్కి నెట్టేస్తోంది. నిజాయితీ ఉన్న అభ్యర్థిని గెలిపించండి ౦ "నిజం నిలుస్తుంది, నిధులు కాదు. డబ్బు ఖర్చు చేయకుండా, నిజాయితీగా పనిచేయాలనుకునే అభ్యర్థిని అందరూ కలిసి గెలిపిస్తే గ్రామం అభివృద్ధి దిశగా బలంగా అడుగులు వేయగలదు. మనసున్నవాడికి మార్గం ఉన్నట్టు, మంచి నాయకుడికి ప్రజల మద్దతు లభిస్తే గ్రామానికి కావాల్సిన పనులు కూడా సులభంగా సాధ్యమవుతాయి. కానీ ఓటర్లు డబ్బు తీసుకున్న క్షణం నుంచే తినిన వాడే నోరు మూసుకుంటాడు"లి అన్న జరిగింది. తర్వాత అభివృద్ధి అడిగే హక్కే ఉండదు. గ్రామ అభివృద్ధి కోసం ఈసారి అయినా ప్రజలు మేల్కొని, డబ్బు లేకుండా స్వచ్ఛమైన ఎన్నికలు జరిపి, నిజాయితీగల నాయకుడిని ఎన్నుకోవాలని పెద్దలు పిలుపు ఇస్తున్నారు.

## ఊరు మధ్యలో ఉన్న స్వాగత్ వైన్స్‌షాపును ఊరు చివరకు మార్చాలి

- పట్టించుకోని ఎక్సైజ్ సీఐ

**చండూరు, డిసెంబర్ 5 (జనం సాక్షి) :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశానుసారం ఊరు మధ్యలో ఉన్న వైన్స్ షాపులు ఊరు చివరలో ఏర్పాటు చేయాలి. కానీ బ్రహ్మంగారి గుడి దగ్గరలో ఉన్న స్వాగత్ వైన్స్‌ను అంతకుముందు పాత వైన్స్ షాపు ఉన్న స్థానంలోనే కొత్త వైన్స్ షాపు ను ఏర్పాటు చేశారు. ఈ వైన్స్ షాపు వలన అయ్యప్ప స్వామి గుడికి వెళ్లే అయ్యప్ప భక్తులకు, బ్రహ్మంగారి గుడికి వెళ్లే భక్తులకు, గీతా స్కూలు కు వెళ్లే విద్యార్థినీ విద్యార్థులకు, మహిళలకు చాలా ఇబ్బందికరంగా ఉంది అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి త్వరితగతిన ఇక్కడ ఉన్న స్వాగత్ వైన్స్ షాప్ ను తొలగించి ఊరు చివరకు మార్చాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎడ్ల వెంకట్ రెడ్డికి సన్మానం



**భువనగిరి రూరల్, డిసెంబర్ 5 (జనం సాక్షి) :** భువనగిరి మండలం బిఎన్ తిమ్మాపురం గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎడ్ల వెంకట్ రెడ్డి ని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో మండల పార్టీ నాయకులు ఎడ్ల సత్తి రెడ్డి, జనగాం పాండు, మధుసూదన్ రెడ్డి, నీల ఓం ప్రకాష్ వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలి



**చింతలపాలెం, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** చింతలపాలెం,దొండపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలలో ఏర్పాటుచేసిన గ్రామపంచాయతీ సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నిక నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దొండపాడు క్లస్టర్ లో దొండపాడు, వజీనేపల్లి, గాంధీ నగర్ తండా, పులిచింతల ప్రాజెక్ట్ కాలనీ అలాగే చింతలపాలెం క్లస్టర్‌లో చింతలపాలెం, గుడిమల్కాపురం, కొత్తగూడెం,ఎర్ర కుంట తండా గ్రామాలకు సంబంధించిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక నిమిత్తం నామినేషన్ పత్రాలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ పత్రాలలో ఏమైనా సందేహాలు ఉంటే ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ ద్వారా అడిగి తెలుసు కోవాలని తప్పులు రాయకూడదని సూచించారు.జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం చివరి రోజు కాబట్టి ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు వస్తున్నందున దానికి తగ్గట్లుగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా టోకెన్స్ జారీ చేసి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి నామినేషన్ పత్రాలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు.టి పోల్ యాప్ లో నామినేషన్ల వివరాలను తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు.కలెక్టర్ వెంట తహసిల్దార్లు రాజేందర్ రెడ్డి,సురేందర్ రెడ్డి,ఎంపీడీవోలు ఆస్కర్ అలీ,రామచంద్రరావు,ఎంపిఓ భూపాల్ రెడ్డి,ఆర్వోలు ఉన్నారు.

## ముగిసిన మూడో విడత నామినేషన్ల ప్రక్రియ



**మేళ్లచెరువు, డిసెంబర్ 5 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రం లొ జరగబోయే గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల మూడవ విడత నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. మొత్తం 31 జిల్లాలలో జరగబోయే 12,768 సర్పంచ్ స్థానాలకు 1,12,242 వార్డులకు శుక్రవారంతో నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. దీనిలో తొలిదశలో 4236 సర్పంచ్ స్థానాలకు, రెండో విడతలు 432 సర్పంచ్ స్థానాలకు, మూడో విడుదల 4160 స్థానాలకు ఎన్నికల నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది.. దీనిలో భాగంగా సూర్యాపేట జిల్లా లో అతిపెద్దదైన మేజర్ గ్రామపంచాయితీ అయినటువంటి మేళ్లచెరువులో మూడో విడత నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ప్రధాన పార్టీలు అయినటువంటి కాంగ్రెస్, బి ఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినారు వీరిలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా శాగం రెడ్డి పద్మ గోవిందరెడ్డి, బి ఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా బచ్చు పద్మ శ్రీనివాస్ రెడ్డి నామినేషన్లు వేశారు.

## దేవరోనితండాలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ఏకగ్రీవం



**కొండమల్లేపల్లి, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** కొండమల్లేపల్లి మండల పరిధిలోని దేవరోనితండా గ్రామపంచాయతీలో సర్పంచ్, ఉపసర్పంచ్, ఆరుగురు వార్డు సభ్యులు పోటీ లేకుండా దేవరోనితండ గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవరోనితండా సర్పంచ్ గా ఇస్లావత్ శ్రీను నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీను నాయక్ బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం నామినేషన్ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఇస్లావత్ శ్రీను నాయక్ మాట్లాడుతూ దేవరోనితండా సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యే బాలునాయక్ ఆశీస్సులతో గ్రామంలోని రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఆధునీకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డుపల్లి సైదులు, మాజీ ఎంపిటిసి ఇస్లావత్ శంకర్ నాయక్, మాజీ సర్పంచులు బోడ యాదయ్య యాదవ్, ఇస్లావత్ రాకేష్ నాయక్, ఇస్లావత్ రవి నాయక్, ఇస్లావత్ రాజు నాయక్, ఇస్లావత్ బద్య, భాను, రాము, బద్య, రామచంద్ర నాయక్, గౌరి, వినోద్, రవి, తండా ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మేళ్లచెరువు నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ నంద్‌లాల్ పవర్



**మేళ్లచెరువు, డిసెంబర్ 5 (జనం సాక్షి) :** అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్‌ఓలు నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. చింతలపాలెం, దొండపాడు, మేళ్లచెర్వు, రామాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలలో ఏర్పాటుచేసిన గ్రామపంచాయతీ సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నిక నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాపురం క్లస్టర్లో రామాపురం, యతిరాజపురం తండా, రామాంజనేయ తండా, రేవూరు దొండపాడు క్లస్టర్‌లో దొండపాడు, వజీనేపల్లి, గాంధీనగర్ తండా, పులిచింతల ప్రాజెక్ట్ కాలనీ అలాగే చింతలపాలెం క్లస్టర్‌లో చింతలపాలెం, గుడిమల్కాపురం, కొత్తగూడెం,ఎర్ర కుంట తండా అలాగే మేళ్లచెరువు క్లస్టర్‌లో మేళ్లచెర్వు, వెల్లటూరు, వెంకట్రాంపురం, ఎర్రగట్టు తండా గ్రామాలకు సంబంధించిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక నిమిత్తం నామినేషన్ పత్రాలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. టి పోల్ యాప్ లో నామినేషన్ ల వివరాలను తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్లు రాజేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ఎంపీడీవోలు ఆస్కర్ అలీ, రామ చంద్రరావు, ఎంపిఓ భూపాల్ రెడ్డి,ఆర్వోలు తదితరులు ఉన్నారు.




## ఉచితంగా క్రెడిట్ స్కోరు..
## యస్ బ్యాంక్ మైక్రోసైట్




**న్యూఢిల్లీ:**ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ తాజాగా 'స్కోర్క్యాహువా.బ్యాంక్.ఇన్' పేరిట మైక్రోసైట్ని ప్రవేశపెట్టింది. క్రెడిట్ స్కోర్ను ఉచితంగా చెక్ చేసుకునేందుకు, రుణాల సంబంధ అంశాలు, క్రెడిట్ ప్రొఫైల్ ప్రాధాన్యత గురించి తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది.క్రెడిట్ స్కోర్పై అవగాహన పెంచేందుకు, రుణాల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం వల్ల వచ్చే ప్రయోజనాలను తెలియజేసేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద దీన్ని రూపొందించినట్లు యస్ బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్ తెలిపారు.ఇందులో ఆర్థిక అంశాల సంబంధిత బ్లాగ్లు, వీడియోలు క్రెడిట్ స్కోరుపై అపోహలు తొలగించే సమాచారం మొదలైనవి ఉంటాయి. ఈ సందర్భంగా నాలుగు టీవీ ప్రకటనలను కూడా బ్యాంకు ఆవిష్కరించింది.

## వెండి భారీగా.. బంగారం విచిత్రంగా..




**న్యూఢిల్లీ:**దేశంలో వెండి ధరలు మరింతభారీగాక్షీణించాయి. బంగా రంధరలు మళ్లీపెరుగుదలబాటపట్టాయి. క్రితం రోజున దిగొచ్చినపసిడి ధరలు నేడు కాస్త ఎగిశాయి. ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు మదుపరులు మొగ్గ చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరలలో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గురువారంతో పోలిస్తే శుక్రవారం బంగారం ధరలు స్వల్పంగాపెరిగాయి. ఇక వెండి ధరలు మరోసారిక్షీణించాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో కింద చూద్దాం..

## అనిల్ అంబానీకి ఈడీ షాక్

**ముంబై:**పారిశ్రామికవేత్తఅనిల్అంబానీక ఈడీ ఊహించనిషాక్ఇచ్చింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ , రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ , యస్ బ్యాంక్ మోసం కేసులో రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూప్ నకు చెందిన రూ .1,120 కోట్ల విలువైన 18 ఆస్తులు, ఫిక్స్డ్ డిపాజిట్లు, బ్యాంక్ బ్యాలెన్స్ , షేర్లను ఈడీ శుక్రవారం జప్తు చేసింది.ఇందులోరిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్కుచెందినవి 7 ఆస్తులు, రిలయన్స్ పవర్ లిమిటెడ్కుచెందినవి 2 ప్రాపర్టీలు, రిలయన్స్ వాల్యూ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్కుచెందిన 9 ఆస్తులుఉన్నాయి. అలాగేరిలయన్స్ వాల్యూ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ వెంచర్ అసెట్ మేనేజ్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, ఫై మేనేజ్మెంట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్లు ఉన్నాయి.

# రష్యాకి మరిన్ని ఎగుమతులపై దృష్టి

**న్యూఢిల్లీ:**వాణిజ్య లోటును భర్తీ చేసుకునే దిశగా రష్యాకు ఎగుమతులను మరింతగా పెంచుకోవడానికి ఆస్కారం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ చెప్పారు.వినియోగ వస్తువులు, ఆహారోత్పత్తులు, వాహనాలు, ట్రాక్టర్లు, భారీ వాణిజ్య వాహనాలు, స్మార్ట్ఫోన్స్ లాంటి ఎలక్ట్రానిక్స్ మొదలైన విభాగాల్లో అవకాశాలు ఉన్నాయని ఇరు దేశాల వ్యాపార వర్గాలతో భేటీలో ఆయన పేర్కొన్నారు.ద్వైపాక్షిక వాణిజ్యం 70 బిలియన్ డాలర్లకు చేరుకుందని మంత్రి తెలిపారు. అమెరికా భారీ టారిఫ్లను భారత్, పాశ్చాత్య దేశాల ఆంక్షలను రష్యా ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమీప భవిష్యత్తులో వాణిజ్య అసమానతలను తొలగించుకునే దిశగా కలిసి పని చేయా ల్సి ఉందని పేర్కొన్నారు.2024-25లో రష్యాకు భారత్ ఎగుమతులు 4.96 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 63.8 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2023-24లో 56.89 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్య లోటు 59 బిలియన్ డాలర్లకు చేరింది. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్దేశించు కున్నాయి. భారత పర్యటనకి వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బృంద సభ్యుడు, ప్రెసిడెన్షియల్ ఆఫీస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మ్యాక్సిమ్ ఒరెష్కిన్ పాల్గొన్నారు. భారత్ నుంచి ఫార్మా, వ్యవసాయం, టెలికం పరికరా ల్లాంటి ఆరు విభా గాల్లో ఎగుమతులు పెరిగేందుకు అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్, అమెరికా మధ్య సంబంధాలు సున్నితంగా మారిన తరుణంలో భారత్లో పుతిన్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.



# ఫ్లైట్ క్యాన్సిల్ అయితే ఇవన్నీ ఇవ్వాల్సిందే..!



**దేశంలో విమానాల రద్దు సంఘటనలు ప్రస్తుతం ఎక్కువయ్యాయి. ముఖ్యంగా దేశీయ సర్వీసుల్లో ఇవి ఎక్కువ ఉంటున్నాయి. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ పౌర విమానయాన సంస్థ ఇండిగో..భారీగా విమానాల రద్దుతో వార్తల్లో నిలుస్తోంది. ఈ క్రమంలో విమానాలు క్యాన్సిల్ అయినప్పుడు విమానయాన సంస్థల బాధ్యతలు ఏంటి.. డీజీసీఏ నిబంధనలు ఏం చెబుతున్నాయి.. ప్రయాణికులుగా మనకు ఎటువంటి హక్కులు ఉంటాయి.. ఈ కథనలో తెలుసుకుందాం..**

**జనంసాక్షి:**భారతదేశంలో విమానాలు రద్దు అయినప్పుడు డీజీసీఏ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) నిబంధనల ప్రకారం విమానయాన సంస్థలు ప్రయాణికులకు రిఫండ్, ప్రత్యామ్నాయ విమానం, భోజనం/హోటల్ సౌకర్యం వంటి బాధ్యతలు వహించాలి. అలాగే ప్రయాణికులకు పాసింజర్ ఛార్టర్ ఆఫ్ రైట్స్ ద్వారా కొన్ని స్పష్టమైన హక్కులు కల్పించారు.

**విమానయాన సంస్థల బాధ్యతలు**

సమయానికి సమాచారం ఇవ్వాలి: విమానం క్యాన్సిల్ అయితే ఎస్ఎంఎస్ లేదా ఈమెయిల్ ద్వారా ముందుగానే తెలియజేయాలి. ప్రత్యామ్నాయ విమానం: అదే గమ్యస్థానానికి మరో విమానం ఉచితంగా ఏర్పాటు చేయాలి. రిఫండ్: ప్రయాణికుడు కోరుకుంటే పూర్తి టికెట్ ధర రిఫండ్ చేయాలి. భోజనం/హోటల్ సౌకర్యం: విమానం క్యాన్సిల్ లేదా 2 గంటలకంటే ఎక్కువ ఆలస్యం అయితే ప్రయాణికులకు భోజనం, రిఫ్రెష్మెంట్ వసతి కల్పించాలి. అదే 24 గంటలకంటే ఎక్కువ ఆలస్యం అయితే హోటల్ వసతితోపాటు ట్రాన్స్ఫర్(స్థానిక రవాణా) సౌకర్యం కల్పించాలి.


ప్రయాణికుల హక్కులు ఇవే..


విమానం క్యాన్సిల్ అయితే ప్రయాణికులు ఛార్జీలు రిఫండ్ తీసుకోవచ్చు లేదా మరో విమానంలో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఓవర్బుకింగ్ వల్ల ప్రయాణికుడికి సీటు దొరకకపోతే టికెట్ పూర్తి రిఫండ్తోపాటు పరిహారం పొందవచ్చు. లగేజీని విమానయాన సంస్థలు పోగొడితే నిబంధనల ప్రకారం ప్రయాణికులు పరిహారం పొందవచ్చు. విమానాల ఆలస్యం లేదా క్యాన్సిలేషన్పై స్పష్టమైన సమాచారం పొందే హక్కు ప్రయాణికులకు ఉంటుంది.

డీజీసీఏ నిబంధనలు ఏం చెబుతున్నాయంటే.. ప్రయాణికులు 7 రోజులు ముందే విమాన టికెట్ బుక్ చేసి, 24 గంటలలోపు రద్దు చేస్తే పూర్తి రిఫండ్ పొందవచ్చు. విమానాలు 2 గంటలకు మించి ఆలస్యమైతే ఉచితంగా భోజనం, రిఫ్రెష్మెంట్ సౌకర్యం కల్పించాల్సిందే. 24 గంటలకు మించి ఆలస్యమైతే ఉచితంగా హోటల్ వసతి, స్థానిక రవాణా ఏర్పాట్లు చేయాలి.విమానాల క్యాన్సిలేషన్ సందర్భంలో పూర్తి రిఫండ్ లేదా ప్రత్యామ్నాయ విమానం ఏర్పాటు చేయాలి.

## ఫ్లాట్గా మార్కెట్లు

**ముంబై:**దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం ఫ్లాట్గా ప్రారంభమయ్యాయి. ఆర్బీఐ ద్రవ్య విధాన కమిటీ కీలక వడ్డీ రేట్ల నిర్ణయానికి ముందు భారత ఈక్విటీ మార్కెట్లు స్వల్ప నష్టాల్లో చలిస్తున్నాయి.ఆర్బీఐ ఎంపీసీ మూడు రోజుల సమావేశం ఈరోజు రెపో రేట్ ప్రకటనతో ముగియనుంది.ప్రారంభంలో బీఎస్ఈ సెన్సెక్స్ 79 పాయింట్లు లేదా 0.09 శాతం నష్టపోయి 85,187 వద్ద, నిఫ్టీ 50 సూచీ 12 పాయింట్లు లేదా 0.05 శాతం తగ్గి 26,021 వద్ద ఉంది.ఈ రోజు సెన్సెక్స్లో రిలయన్స్, ట్రెంట్, టాటా స్టీల్, భారతీ ఎయిర్టెల్, టాటా మోటార్స్ పీవీ, సన్ ఫార్మా, టైటాన్ టాప్ లూజర్స్ గా ఉండగా, ఎటర్నల్, బీఈఎల్, మారుతి సుజుకి, బజాజ్ ఫైనాన్స్, కోటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ సిమెంట్ టాప్ గెయినర్స్గా నిలిచాయి.విస్తృత మార్కెట్లలో, నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.07 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.30 శాతం పడిపోయాయి. నిఫ్టీ ఫార్మా, మెటల్ సూచీలు 0.3 శాతం నష్టపోయాయి. నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ 0.28 శాతం పెరిగింది.






# పాక్తో ఇంకా సంబంధాలెందుకు?

- పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్లను బ్యాన్ చేయండి
- అమెరికా ఎంపీల డిమాండ్
- ఆ దేశ విదేశాంగ మంత్రికి లేఖ



**వాషింగ్టన్:**పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్కు అమెరికా అధ్యక్షుడు పెద్దపీట వేస్తుండగా.. అమెరికా ఎంపీలు మాత్రం మునీర్పై నిషేధం విధించాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ మేరకు 44 మంది అమెరికా ఎంపీలు సంతకాలు చేసిన లేఖను ఆ దేశ విదేశాంగ మంత్రికి పంపారు.పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ ఇకపై అమెరికాలోకి రాకుండా.. ఆయనపై నిషేధం విధించాలని డిమాండ్ చేస్తూ.. 44 మంది ఎంపీలు అమెరికా విదేశాంగ మంత్రి మార్కోరూబియోకు లేఖ రాశారు. ఇప్పుడు ఈ అంశం అమెరికాలో సంచలనంగా మారింది. ఆసిమ్ మునీర్ ఒక నేరగాడని, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్పైనా చర్యలు తీసుకోవాలని అమెరికా ఎంపీలు తమ లేఖలో పేర్కొన్నారు. మునీర్పై తక్షణమే ఆంక్షలు విధించాలని డిమాండ్ చేశారు.ఈ లేఖ రాసిన వారిలో డెమోక్రటిక్ సభ్యులు ప్రమీలా జయపాల్, గ్రేగ్ కస్సార్ వంటివారు ఉన్నారు. పాకిస్థాన్లో ప్రభుత్వాన్ని సైన్యం నడుపుతోందని, ఆ దేశంలో నియంతృత్వం, హింసా పెరిగాయని, జర్నలిస్టులను బెదిరిస్తున్నారని, కిడ్నాప్ చేస్తున్నారని పేర్కొంటూ.. వర్జీనియా జర్నలిస్టు నూరానీ కిడ్నాప్ ఉదంతాన్ని ప్రస్తావించారువర్జీనియా జర్నలిస్టు అహ్మద్ నూరానీ పాకిస్థాన్ సైన్యంలో అవినీతిపై వరుస కథనాలు రాశారు. ఆ తర్వాత నూరానీ, పాకిస్థాన్లో ఉంటున్న అతని ఇద్దరు సోదరులు అపహరణకు గురయ్యారు. నెలరోజులకు పైగా వారిని పాక్ సైన్యం నిర్బంధించింది. ఆ తర్వాత విడుదల చేసింది. వీరితోపాటు.. ప్రముఖ సంగీత దర్శకుడు సల్మాన్ అహ్మద్ బావమరిది కిడ్నాప్ ఉదంతాన్ని కూడా ఎంపీలు తమ లేఖలో ప్రస్తావించారు. అమెరికా జోక్యం తర్వాతే అతను విడుదలైన విషయాన్ని గుర్తుచేశారు. పాకిస్థాన్లో విపక్ష నాయకులపై ఎలాంటి ఆరోపణలు లేకున్నా.. వారిని జైలులో నిర్బంధిస్తున్నారని, సోషల్ మీడియాలో గళమెత్తే సాధారణ పౌరులను హింసిస్తున్నారని, మహిళలు, మైనారిటీలు, బలూచిస్థాన్ పౌరులు హింసకు గురవుతున్నారని పేర్కొన్నారు.

ఇంకా ఆ లేఖలో ఏయే అంశాలను ప్రస్తావించారు?

2024 పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికల్లో రిగ్గింగ్ అంశంపై దర్యాప్తు జరపాలని ఎంపీలు తమ లేఖలో డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన పటాన్ రిపోర్టు పూర్తిగా తప్పుడు సాక్ష్యాలు, అబద్ధాలతో నిండి ఉందని వివరించారు. ఈ ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చింది కేవలం తోలుబొమ్మ ప్రభుత్వమేనని విమర్శించారు. సైన్యమే డీఫాక్టోగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పాకిస్థాన్ సుప్రీంకోర్టు కూడా సైనిక న్యాయస్థానాలు సాధారణ పౌరులపై విచారణ జరపవచ్చని తీర్పునివ్వడం సహజ న్యాయ సూత్రాలకు పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు.ఈ ఒక్క తీర్పును బట్టే పాకిస్థాన్లో పరిపాలన సైన్యం నియంత్రణలోకి వెళ్లిందని స్పష్టమవుతున్నట్లు వివరించారు. ఇదే లేఖలో ఇమ్రాన్ ఖాన్ నిర్బంధం, అతని మృతిపై వస్తున్న వార్తలను గురించి ప్రస్తావించారు. అమెరికా చట్టాల ప్రకారం 44 మంది ఎంపీలు రాసిన లేఖను ప్రభుత్వం సీరియస్గా తీసుకోవాల్సి ఉంటుంది. అంటే.. ఆరోపణలను ఎదుర్కొనేవారి వీసాపై అమెరికా నిషేధం విధించాల్సి ఉంటుంది. వారికి సంబంధించిన ఆస్తులు అమెరికాలో ఉంటే.. వాటిని జప్తు చేసే అవకాశాలుంటాయి.పాకిస్తాన్ ప్రధాని మంత్రి షెహబాజ్ షరీఫ్, ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిమ్ మునిర్లు.. ఇప్పుడు అమెరికాకు అత్యంత ఆప్త మిత్రులు అంటే అతిశయోక్తి కాదేమోఇటీవల పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ స్థానంలో మునిర్.. రెండు దఫాలు అమెరికా పర్యటనకు వెళ్లొచ్చారు. ఇక పాక్ ప్రదాని షరీఫ్ కూడా ఒక దఫా అమెరికా పర్యటనకు వెళ్లారు. అయితే యుద్ధ విమానాలను కొనుగోలు చేయడానికి తాము అమెరికా పర్యటనకు వెళ్ళొచ్చినట్లు వారు స్పష్టం చేశారు.అయితే ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన విషయం ఏంటంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మునిర్తో కలిసి ప్రత్యేక విందులో పాల్గొనడం. భారత్పై అక్కసుతోనే ట్రంప్ ఇలా చేస్తున్నారనేది ప్రపంచానికి అర్థమవుతూ వచ్చింది.గతంలో పాక్ పెంచి పోషించిన ఉగ్రవాది బిన్ లాడెన్.. వరల్డ్ ట్రేడ్ సెంటర్పై దాడి చేసిన తర్వాత.. ఆ దేశాన్ని అమెరికా దూరం పెడుతూ వచ్చింది. అయితే ఇటీవల కాలంలో పాకిస్తాన్కు ఎక్కువ సీన్ క్రియేట్ చేస్తున్నారు ట్రంప్. ఆపరేషన్ సిందూర్ను ఆపింది తానేనని పదేప దే చెప్పుకుంటూ, పాకిస్తాన్కు అత్యంత ప్రయారిటీ ఇచ్చారు ట్రంప్.

వారిద్దర్నీ బ్యాన్ చేయండి

ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ మునీర్లను బ్యాన్ చేయాలనేది అమెరికా ఎంపీల డిమాండ్. దీనికి సంబంధించి యూఎస్ కాంగ్రెస్ సభ్యులు 44 మం?ది.. విదేశాంగ కార్యదర్శి మార్కో రుబియోకు లేఖ రాశారు. ప్రధాని, ఆర్మీ చీఫ్లను తక్షణమే బ్యాన్ చేయాలంటూ లేఖ రాశారు. పాకిస్తాన్లో ఆర్మీ పాలన సాగుతుందని, ఇది ప్రజల హక్కులను ఉల్లంఘించడమేనని వారు పేర్కొన్నారు. అటువంటి దేశంతో మనకి మిత్రత్వం ఏమిటి లేఖలో ప్రస్తావించారు. డెమొక్రాటిక్ ఎంపీ ప్రమీలా జయపాల్, గ్రెగ్ కాసర్లు ఆధ్వర్యంలో ఈ లేఖ రాసి.. విదేశాంగ కార్యదర్శికి పంపారు.

**మరి ట్రంప్ యాక్షన్ ఏమిటో?**

దీనిపై ట్రంప్ ఎలా రియాక్ట్ అవుతారో చూడాలి. ప్రతీదానికి పాకిస్తాన్ను వెనకేసుకొస్తున్న ట్రంప్.. ఇప్పుడు ఆ దేశ ఎంపీల డిమాండ్ ఏం చేస్తారనేది ఆసక్తికరం. తన పంథాను మార్చుకుంటారా.. లేక పాక్తో అదే స్నేహాన్ని కొనసాగిస్తారనేది చర్చనీయాంశమైంది. భారత్ను భయపెట్టాలని పాకిస్తాన్కు వెన్నుదన్నుగా ఉంటూ వస్తున్న ట్రంప్కు సొంత దేశంలోనే నిరసన సెగ ఎదురుకావడం, అందులోనూ అది ఎంపీల నుంచి రావడంతో ట్రంప్ను ఇది కచ్చితంగా ఆలోచనలో పడేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

## మాలిలో ఇద్దరు తెలుగు కార్మికుల కిడ్నాప్

**బందీల్లో ఒకరు యాదాద్రి జిల్లావాసి, మరొకరు ఏపీ యువకుడు**
**ఆలస్యంగా వెలుగులోకి ఘటన.. ఇరు కుటుంబాల్లో ఆందోళన**

**మాలి:** ఉపాధి కోసం ఆఫ్రికా దేశమైన మాలికి వెళ్లిన తెలంగాణ, ఏపీకి చెందిన ఇద్దరు యువకులను జమాత్ నుస్రత్ అల్-ఇస్లామ్ వల్-ముస్లిమీన్ (జేఎన్ఐఎం) సంస్థకు చెందిన తీవ్రవాదులు కిడ్నాప్ చేశారు.యాదాద్రి జిల్లా భువనగిరి మండలం బండసోమారం గ్రామానికి చెందిన నల్లమాస ప్రవీణ్ (23), ఏపీలోని సత్యసాయి జిల్లా కదిరి సమీపంలోని పొదరళ్లపల్లికి చెందిన రామచంద్ర (25) గతేడాది హైదరాబాద్కు చెందిన ఓ బోర్వెల్ కంపెనీ పనిపై డ్రిల్లర్లుగా మాలి దేశంలోని కోబ్రి సమీపంలో పనిచేస్తున్నారు. గత నెల 23న వారు పని ముగించుకొని వస్తుండగా సాయుధులైన జేఎన్ఎంఐ తీవ్రవాదులు కిడ్నాప్ చేశారు.వారి ఫోన్లను స్వాధీనం చేసుకొని స్విచ్ఛాఫ్ చేయడంతో కిడ్నాప్ సమాచారం ఆలస్యంగా భారత ఎంబసీతోపాటు వారి కుటుంబ సభ్యులకు చేరింది. దీంతో ఇరు కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. పనుల సీజన్ పూర్తయ్యాక వస్తానని కిడ్నాప్నకు ఒకరోజు ముందు తన కొడుకు ఫోన్ చేసి చెప్పాడని ప్రవీణ్ తండ్రి జంగయ్య 'సాక్షి'తో మాట్లాడుతూ ఆవేదన చెందారు.

## దేవాలయాల డబ్బు బ్యాంకుల మనుగడకు వాడొద్దు

**- డిపాజిట్లను వెంటనే వాపస్ చేయాలన్న సుప్రీం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఆలయాలకు చెందిన డబ్బును ఇతరత్రా పనులకు వినియోగించరాదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కో-ఆపరేటివ్ బ్యాంకులను రక్షించేందుకు ఉపయోగించొద్దంటూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేరళలో ఓ ఆలయానికి చెందిన సొమ్మును వాపస్ చేయడంలో కో ఆపరేటివ్ బ్యాంకులు తాత్సారం చేయడంపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ సొమ్ము పూర్తిగా దేవుడికి చెందినదని తేల్చి చెప్పింది. ఆ నిధులను ఆలయ ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేసింది. సహకార బ్యాంకులకు ఆదాయ వనరుగా లేదా అవి మనుగడ సాగించేందుకు ఆలయ నిధులు ఉపయోగించొద్దని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది.

## చికిత్సకోసం ఖలీదా జియా లండన్కు!



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియాను మెరుగైన చికిత్సకోసం లండన్ తరలిస్తున్నారు. బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్పీ) అధినేత్రి అయిన జియా ఊపిరితిత్తులు, గుండెలో ఇన్ఫెక్షన్ల కారణంగా నవంబర్ చివరి వారంలో ఆస్పత్రిలో చేరారు.వారంరోజుల్లో ఆమె ఆరోగ్యం మరింత విషమంగా మారింది. ప్రభుత్వ తాత్కాలిక చీఫ్ మహమ్మద్ యూనస్ బుధవారం ఆస్పత్రిని సందర్శించారు.ఆమె ఆరోగ్య గురించి ఆరా తీశారు. జియా కుమారుడు బీఎన్పీ తాత్కాలిక చైర్ పర్సన్ తారిక్ రెహమాన్ 2008 నుంచి లండన్లో ఉంటున్నారు. తల్లి అనారోగ్యం గురించి ఆయన సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. అవామీ లీగ్ పాలనలో అప్పటి సైనిక మద్దతుతో మాజీ ప్రధాని షేక్ హసీనా అవినీతి, క్రిమినల్ కేసుల్లో ఆయనను దోషిగా తేల్చడంతో తాను, తన దేశానికి వెళ్లలేకపోతున్నానని పేర్కొన్నారు.

## కష్టకాలంలో పుట్టిన స్నేహం

### రష్యాకు అనుకూలంగా గైర్హాజరైన ఇండియా

**లండన్:** నగరంలోని ట్రాఫాల్గర్ స్క్వేర్.. డిసెంబర్ నెల వచ్చిందంటే చాలు, పండుగ శోభతో నిండిపోతుంది. ఆ స్క్వేర్ మధ్యలో నిటారుగా..వేలాది కాంతులతో వెలిగిపోయే ఒక అద్భుతమైన క్రిస్మస్ చెట్టు కనువిందు చేస్తుంది. ఇది కేవలం ఒక చెట్టు కాదు.. నార్వేజియన్ ప్రజల హృదయం నుండి వచ్చిన ఒక కృతజ్ఞతా బహుమతి. లండన్, నార్వే రాజధాని ఓస్లో నగరాల మధ్య కొనసాగుతున్న ఈ వార్షిక సంప్రదాయం వెనుక దాగిన కథ, మానవ సంబంధాల గొప్పతనాన్ని, చరిత్రను గుర్తు చేస్తుంది.ఈ బంధానికి రెండో ప్రపంచ యుద్ధం కల్లోలంలో పునాదులు ఏర్పడ్డాయి. 1940లో, నాజీ జర్మనీ నార్వేపై దండెత్తినప్పుడు, అప్పటి నార్వే రాజు హాకాన్-7, అతని ప్రభుత్వ ప్రతినిధులు లండన్కు శరణార్థులుగా వచ్చారు. అక్కడే ప్రవాస ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. బ్రిటన్ గడ్డ నుండే నార్వేజియన్ ప్రతిఘటన ఉద్యమానికి బలం చేకూర్చారు. అంతేకాదు, నాజీలు రేడియోలను నిషేధించినా, బీబీసీ సహకారంతో లండన్ నుండి రహస్యంగా నార్వేజియన్ భాషలో వార్తలను ప్రసారం చేసేవారు. ఆ వార్తలు నార్వే దేశ ప్రజలకు ధైర్యాన్ని, ఆశను నింపిన జీవనాడులు. నిరాశలో ఉన్న వేలాది నార్వేజియన్లకు అక్షరాలా అవి ఓ సాంత్వన! యుద్ధం ముగిసిన తర్వాత, నార్వే ప్రజలు తమకు ఆశ్రయం ఇచ్చి, తమ స్వాతంత్ర్య పోరాటానికి సహాయం చేసినందుకు బ్రిటన్పై అపారమైన కృతజ్ఞతను చూపాలనుకున్నారు. ఆ ప్రేమే 1947లో ఓస్లో నగర పాలక సంస్థ ఈ వార్షిక క్రిస్మస్ ట్రీ బహుమతిని ప్రకటించడానికి దారి తీసింది. ఈ బహుమతి కేవలం అలంకరణ వస్తువు కాదు. 'ఓస్లో ప్రజల స్వేచ్ఛా స్ఫూర్తికి లండన్ ప్రజలు ఇచ్చిన అండ'కు ప్రతీక.ఏటా ఓస్లో అడవుల్లో పెరిగే నార్వేజియన్ స్ప్రూస్ జాతి చెట్టును మాత్రమే ఎంపిక చేస్తారు. కొన్నేళ్ల ముందుగానే నాణ్యమైన చెట్లను గుర్తించి, వాటికి ప్రత్యేక సంరక్షణ అందిస్తారు. ఈ ఏడాది చెట్టుకు ముద్దుగా 'ఎవర్ ఓస్లో'అని పేరు పెట్టారు. సుమారు 60 ఏళ్ల వయసు, 20 మీటర్ల ఎత్తు ఉన్న ఈ చెట్టు, వేలాది చెట్ల నుండి ఎంపికైంది. నవంబర్ 21న జరిగిన ప్రత్యేక వేడుకలో దీనిని నరికి, ఓ ప్రత్యేక ఉయ్యాలలో ఉంచి, రోడ్డు మార్గంలో ఓడరేవుకు తరలించారు. అక్కడి నుండి మొదలైంది అసలు ప్రయాణం. దాదాపు 26 గంటల పాటు సముద్రంలో ప్రయాణించాక ఆ చెట్టు లండన్కు చేరుకుంది. లండన్ చేరుకున్నాక, దాన్ని ట్రక్కులో ట్రాఫాల్గర్ స్క్వేర్కు తరలించారు. ఈ ప్రయాణమంతా ఆ చెట్టు.. రెండు దేశాల స్నేహ సందేశాన్ని మోసుకొచ్చిన ఒక రాయబారిలా సాగింది. సోషల్ మీడియాలో ఈ చెట్టును 'బ్రిటన్ జాతీయ నిధి'గా అభివర్ణిస్తారు. ఏటా డిసెంబర్ మొదటి గురువారం జరిగే దీపాలంకరణ వేడుకతో లండన్లో క్రిస్మస్ కౌంట్డౌన్ మొదలవుతుంది. ఈ చెట్టుకు నార్వేజియన్ సంప్రదాయం ప్రకారం నిలువు వరుసలలో దీపాలను అమరుస్తారు. ఈ కాంతులు.. స్క్వేర్లోని ప్రజలకు ఆశ, శాంతి సందేశాన్ని ఇస్తాయి. ఈ క్రిస్మస్ ట్రీ, జనవరి 5 వరకు ట్రాఫాల్గర్ స్క్వేర్లో ప్రకాశిస్తూనే ఉంటుంది. ఆ తర్వాత దీనిని కంపోస్ట్ తయారీకి వినియోగిస్తారు. ప్రతి క్రిస్మస్కు నార్వే పంపే ఈ ట్రీ బహుమతి, కేవలం పండుగ ఆనందం కోసం కాదు. యుద్ధ గాయాలను, మళ్లీ వెలిగించిన ఆశలను గుర్తుచేసే శాశ్వత చిహ్నం. ట్రాఫాల్గర్ స్క్వేర్లో ఈ దీపాలు వెలిగిన ప్రతిసారీ, అది క్రిస్మస్కు సంకేతం మాత్రమే కాదు.. కష్టకాలంలో ఒక దేశం మరో దేశానికి ఇచ్చిన అండ.. సాటి మనిషిపై చూపిన మానవత్వం.. నేటికీ సజీవంగా ఉన్నాయనడానికి హృదయపూర్వకమైన, శాశ్వతమైన కృతజ్ఞతా వెలుగు!



# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం





జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్, డిసెంబర్ 05 : గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. తొలి విడతగా బోధన్ డివిజన్ లోని మండలాలలో ఈ నెల 11న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో, ఆ డివిజన్ కు చెందిన ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓ లకు బోధన్ పట్టణంలోని లయన్స్ భవన్ సమావేశ మందిరంలో శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహన ను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమయ పాలనను పకడ్బందీగా పాటిస్తూ, అప్రమత్తతతో ఎన్నికలు నిర్వహిస్తే ఇబ్బందులు తలెత్తేందుకు ఆస్కారం ఉండదని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, పోలింగ్ మెటీరియల్ ను జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలని, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ల విషయంలో ప్రత్యేక జాగరూకతతో వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల ఆర్.ఓలు తమ బృందంలోని ఎన్నికల సిబ్బంది అందరికీ నియమ, నిబంధనల పట్ల పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. అప్పుడే ఎక్కడ కూడా తప్పిదాలకు తావు లేకుండా సజావుగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయగల్గుతారని అన్నారు. ఉప సర్పంచ్ ఎన్నిక సందర్భంగా తగినంత కోరం ఉందా లేదా అన్నది పరిశీలించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకొని సదుపాయాలను పరిశీలించుకోవాలని, ఓటింగ్ కంపార్ట్ మెంట్, సిటింగ్ ఏర్పాట్లు తదితర వాటిని నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలన్నారు. శిక్షణ తరగతులలో సూచించిన అంశాలను ఆకళింపు చేసుకుని, విధిగా పాటించాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతో పాటు "నోటా" సింబల్ ను కూడా తప్పనిసరిగా సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సజావుగా ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించి, జిల్లాకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. శిక్షణ తరగతుల్లో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఏ.సీ.పీ రామారావు, డీ.ఎల్.పీ.ఓ నాగరాజు, ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలు పాల్గొన్నారు.

### పంచాయతీ ఎన్నికల విధులు
# కట్టుదిట్టంగా నిర్వహించాలి

**మొదటి విడత పోలింగ్ జరిగే మండలాలలో పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**మంథని, (జనంసాక్షి) :** పంచాయతీ ఎన్నికల విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మొదటి విడత పోలింగ్ జరిగే కమాన్పూర్, రామగిరి మంథని, ముత్తారం, శ్రీరాంపూర్ మండలాల లోని ఎంపీడీవో కార్యాలయాలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల సంబంధించి డిసెంబర్ 6న పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలని, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ పంపిణీ నిబంధన ప్రకారం సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పంచాయతీ ఎన్నికల సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ల వద్ద ఏర్పాట్లు పై కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం మంథని పట్టణంలోని శ్రీపాద చౌక్ 4 లైన్ విస్తరణ పనుల కోసం అలైన్మెంట్ ను కలెక్టర్ పరిశీలించి డ్రైనేజ్ కల్వర్ట్ పనులు సజావుగా జరిగేలా చూడాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, జెడ్పీ సీఈఓ నరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గుండెపోటుతో సర్పంచ్ అభ్యర్థి మృతి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండలంలోని చింతల్ఠాణా గ్రామ సర్పంచ్ గా పోటీ చేస్తున్న చెర్ల మురళి గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ముందు గ్రామాల సమస్యలపై నిరాహార దీక్షలు, పోరాటాలు చేసిన అతనికి సర్పంచ్ ఎన్నికలలో రిజర్వేషన్ కలిసి రావడంతో బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థిగా బరిలో ఉన్నాడు. అతను మృతి చెందటంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఆ గ్రామంలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తారా, వాయిదా వేస్తారా అనే విషయంపై జిల్లా పంచాయతీ అధికారిని వివరణ కోరగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు నివేదిక పంపామని, వారి ఆదేశాల ప్రకారం ఉంటుందన్నారు.

# కోర్టు స్థల వివాదం చుట్టూ రాజకీయ కుట్ర

- బార్ అసోసియేషన్‌కు నేనే అధ్యక్షుడిని: లకిడి భాస్కర్
- వర్గ పోరుకు కోర్టు స్థల వివాదమే కారణం
- అధ్యక్షుడి సస్పెన్షన్ చట్ట విరుద్ధం




**పెద్దపల్లి, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్‌ను తొలగిస్తూ కొందరు కార్యవర్గ సభ్యులు,ప్రధాన కార్యదర్శి కలిసి చేపట్టిన అవిశ్వాస తీర్మానం మరియు సస్పెన్షన్ ప్రక్రియపై తీవ్ర దుమారం చెలరేగింది.ఇది పూర్తిగా అక్రమం అని,అసోసియేషన్ బైలాకు విరుద్ధమని అధ్యక్షుడు లకిడి భాస్కర్ స్పష్టం చేశారు. జిల్లా కోర్టు స్థల కేటాయింపు వివాదాన్ని అడ్డుపెట్టుకుని కొందరు సీనియర్ సభ్యులు తనపై రాజకీయ కుట్ర పన్నుతున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.ఈ మేరకు గురువారం జిల్లా కోర్టు వద్ద సీనియర్ సభ్యులు దొంతి కిష్టయ్య,కోశాధికారి గౌరిశెట్టి సత్యనారాయణ,లైబ్రరీ సెక్రెటరీ పుట్ట రవితో కలిసి మీడియాతో మాట్లాడుతూ జిల్లా కోర్టు భవనం కోసం కన్నాల వద్ద స్థలం కేటాయింపును గతంలో వ్యతిరేకించామని, పెద్దపల్లిలో స్థలం దొరకకపోవడంతోనే ప్రభుత్వం రాఘవపూర్ వద్ద 10 ఎకరాలు కేటాయించిందని,ఇది 114 మంది సభ్యుల సంతకాలతో 2023 లోనే ఆమోదించబడిందని వివరించారు.ఈ వివాదం కారణంగా కోర్టు భవనం కోసం మంజూరైన రూ.81 కోట్ల నిధులు వెనక్కిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.తన వరుస విజయాలను జీర్ణించుకోలేని కొందరు,తాను బలహీన వర్గాల నుంచి వచ్చాననే ఏకైక కారణంతో అణగదొక్కాలని చూస్తున్నారని, తనపై అవిశ్వాసం బైలాలో లేదని,తాను మార్చి 31 వరకు అధ్యక్షుడినే అని తేల్చిచెప్పారు.ఈ అక్రమ చర్యకు పాల్పడిన వారిపై హైకోర్టులో లీగల్ చర్యలు తీసుకుంటానని,ఇప్పటికే బార్ కౌన్సిల్‌కు, డీజేకు ఫిర్యాదు చేశానని ప్రకటించారు.

అనంతరం సీనియర్ సభ్యులు దొంతి కిష్టయ్య,గౌరిశెట్టి సత్యనారాయణ,పుట్ట రవి మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులు తీసుకున్న సస్పెన్షన్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు.ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని,అడ్వకేట్ యాక్ట్‌కు వ్యతిరేకమని, అధ్యక్షుడిని సస్పెండ్ చేసే లేదా సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం కార్యవర్గానికి లేదని స్పష్టం చేశారు.కొత్త కోర్టు కాంప్లెక్స్ కోసం రాఘవపూర్‌ను ఎంచుకున్న నిర్ణయం హైకోర్టు మార్గదర్శకా లకు అనుగుణంగా తీసుకున్న మంచి నిర్ణయమని,ఈ తీర్మానంపై ప్రస్తుతానికి వ్యతిరేకిస్తున్న సభ్యులు కూడా గతంలో సంతకాలు చేశారని తెలిపారు.ఈ చర్యలన్నీ అధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకుని చేస్తున్నారని,పెద్దపల్లి బార్ అసోసియేషన్ చరిత్రలో అధ్యక్షుడిని ఈ విధంగా తొలగించడం ఇదే తొలిసారి అని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన లకిడి భాస్కర్ అతని కాల పరిమితి వరకు కొనసాగుతారని,అప్పటివరకు తొలగించే హక్కు లేదని తేల్చి చెప్పారు.భవిష్యత్తులో ఇటువంటి చట్ట విరుద్ధ చర్యలు చేపడితే తాము చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కొండ బత్తుల ఆంజనేయులు, ప్రసాద్ రావు,సొల్లురి మల్లేశం,డివిఎస్ మూర్తి,అమీర్ శెట్టి కృష్ణ,రాజు కార్తీక్,రాజేందర్,బండారి రమేష్,కుంభం సంతోష్, ప్రవీణ్ రావు, రఘువీర్, గడ్డి సదానందం, రాచూరి శ్రీకాంత్, వంశీకృష్ణ తదితరులు పాల్గొని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్ కు మద్దతును ప్రకటించారు.

## ఎన్నికల విధులను అప్రమత్తతతో నిర్వహించాలి

**పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయా శ్రీహర్ష**



**ముత్తారం డిసెంబర్ 05(జనంసాక్షి):** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ బాధ్యతలు కలిగిన అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయా శ్రీహర్ష సూచించారు. ముత్తారం మండల పరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటి విడతలో ముత్తారం మండలానికి ఈ నెల 11న పోలింగ్ ప్రక్రియ జరుగనుండగా, నామినేషన్ల స్వీకరణ నుండి మొదలుకుని ఇప్పటివరకు పూర్తి చేసిన ప్రక్రియలు నిబంధనలకు అనుగుణంగా జరిగాయా. పోలింగ్ నిర్వహణ కోసం చేపట్టాల్సిన చర్యలు,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ విధుల పర్యవేక్షణ అధికారి సురేందర్, ఎం.పీ.డీ.ఓ,సురేష్,తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి తోపాటు ఇతర అధికారులకు వివరించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా,ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఓటింగ్ కు అవసరమైన ఎన్నికల సామాగ్రి సిద్ధంగా ఉండాలన్నారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ,మెటీరియల్,ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం తదితర ఏర్పాట్ల గురించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న వారితో పాటు, భద్రతా బలగాలలో కొనసాగుతున్న సర్వీస్ ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకునేలా నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం మార్గదర్శకాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని,నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులతో మండల ప్రజా పరిషత్ అధికారులు,గ్రామ పంచాయితీ అధికారులు తోపాటు తదితరులు పాల్గొన్నారు



## ఆలూర్‌లో దారుణ హత్య

**ఆర్మూర్, డిసెంబర్ 5 ( జనంసాక్షి):** ఆలూర్ మండల కేంద్రంలో వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా కలకాలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూరు గ్రామానికి చెందిన గొల్ల గంగాధర్ తండ్రి గంగారం ( 46) గొల్లవృత్తి, వ్యవసాయం చేసేవాడు. గురువారం అర్ధరాత్రి బయట ఇంటి ఆవరణలో మంచంపై పడుకున్నాడు.గుర్తు తెలియని వ్యక్తి పదునైన ఆయుధంతో గొల్ల గంగాధర్ చంపారు. మృతుడి చెల్లెలు అంజలి ఫిర్యాదు మేరకు మృతుడి తమ్ముడు చంపి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో తెలిపింది. మృతుడి తమ్ముడితో పలుమార్లు వివాదాలు, పంచాయతీలు జరిగినట్టు తెలిసింది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పరీక్షలు నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు సిఐ సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

### గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా పారదర్శకంగా నిర్వహించేలా
# అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**కొడంగల్, డిసెంబర్ 5(జనం సాక్షి):** గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా, పారదర్శ కంగా నిర్వహించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించా రు. శుక్రవారం కొడంగల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు గ్రామ పంచాయ తీ ఎన్నికల విధి విధానాలపై చేపట్టాల్సిన అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చూడాలన్నారు. పోలింగ్ కౌంటింగ్ సందర్భంగా ఇలాంటి అనుమానాలకు తావునీయకుండా ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు అతి నమ్మకతో కాకుండా మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు ఎన్నికల విధులను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి గుర్తులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో కావలసిన మౌలిక సదుపాయాలను ముందుగానే సమకూర్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సమయానికి అనుకూలంగా అధికారులు పోలింగ్ సామాగ్రితో పాటుగా ముందుస్తుగానే సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా సంబంధిత అధికారులకు దరఖాస్తు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.శిక్షణ కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో ఉషశ్రీ, పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపికైన పారమిత విద్యార్థులు


**పారమిత పాఠశాలల ఛైర్మన్ డా.ఇ. ప్రసాదరావు**



**కరీంనగర్, డిసెంబర్ 05 (జనంసాక్షి) :** ఇటీవల కరీంనగర్ పట్టణంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో నగరంలోని పారమిత విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనభరచి మొదటి స్థానాలు కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ మనక్ పోటీలకు, రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపికయ్యారని పారమిత విద్యాసంస్థల డైరెక్టర్ అనుకర్ రావు తెలిపారు. ఇందులో భాగంగా పారమిత హెరిటేజ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నఎ. వికాస్, పారమిత ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం.హరినాథ్ రెడ్డి రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పారమిత హెరిటేజ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మిహ ముభారక్ వ్యర్థ పదార్థాల నిర్వహణ అనే అంశంపై పారమిత ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న, 8వ తరగతి చదువుతున్న కె. రుగ్వేద్ "ఆరోగ్యం పరిరక్షణ" అనే అంశంపై, అద్భుత ప్రదర్శన ఇచ్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ పోటీలకు, వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ డా.ఇ. ప్రసాదరావు, పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, ప్రాచీ, వినోద రావు, వి.యు. యం ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, గోపీకృష్ణ, బాలాజి, సమన్వయకర్తలు, గైడ్ టీచర్స్ లలిత్ మోహన్ సాహు, అంజన్ కుమార్, మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## సోషల్ మీడియా మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**షీటీం ఇంచార్జి శ్యామ్ సుందర్**



**చేవెళ్ల, డిసెంబరు 05 (జనంసాక్షి) :** బాలికలు భద్రత కోసం సోషల్ మీడియా మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని షీటీం ఇంచార్జి శ్యామ్ సుందర్ సూచించారు. శుక్రవారం చేవెళ్ల జడ్పీ బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పోక్సో, నిర్భయ చట్టం, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై షీ టీమ్స్ అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, ఆన్‌లైన్ మోసాలపై 1930, చిన్నారుల కోసం 1098 నెంబర్‌లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అపరిచితుల మెసేజ్‌లు, లింకులు, వీడియో కాల్స్, ఫ్రెండ్ రిక్వెస్టులు స్వీకరించవద్దని, వ్యక్తిగత వివరాలు, ఒంటరి ఫోటోలు పంపొద్దని హెచ్చరించారు. ఓటీపీ, గేమింగ్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చిన్నారులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి వివరించి, ఏ అనుమానం వచ్చినా ఉపాధ్యాయులు లేదా తల్లిదండ్రులకు వెంటనే చెప్పాలని శ్యామ్ సుందర్ సూచించారు. వేధింపులపై ఫిర్యాదులకు సైబాబాద్ షీ టీం వాట్సాప్ నెంబర్ 8712663061 అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మరాగవల్లి, ఉపాధ్యాయులు, బి.ఎడ్. శిక్షణార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కన్వీనర్‌గా అంబటి జోజిరెడ్డి ఎన్నిక



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 05(జనంసాక్షి):** ఆల్ ఇండియా పాడ్వర్ బ్లాక్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా కరీంనగర్ జిల్లాకు చెందిన అంబటి జోజిరెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ తెలిపారు. శుక్రవారం రోజు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలియజేశారు. సమావేశం అనంతరం మీడియాతో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతం, సంస్థాగత విస్తరణ, రాబోయే రాజకీయ పరిస్థితులకు పార్టీ సిద్ధతపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగిందని తెలియజేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కార్యకలాపాలను మరింత ప్రజలకు చేరువ చేయడానికి, సభ్యత్వాన్ని విస్తరించడానికి శక్తివంతమైన ప్రాతిపదికను ఏర్పరచడానికి పలు ముఖ్యమైన తీర్మానాలను రాష్ట్ర కమిటీ ఆమోదించారు. ముఖ్యంగా సభ్యత్వ పునరుద్ధరణ, లెవీ వసూలు కార్యక్రమం ప్రారంభం పార్టీ సిద్ధాంతాలపై నిబద్ధతతో పని చేసే మంచి క్యాడర్ నిర్మాణం అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, సభ్యుల నుండి సభ్యత్వ పునరుద్ధరణ, లెవీ వసూలు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలనే నిర్ణయం తీసుకున్నారు. ప్రతి జిల్లా, మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు మార్గదర్శకాలు రూపొందించబడనున్నాయని అన్నారు. పార్టీ సిద్ధాంతం, చరిత్ర, ఉద్యమ పరంపర, ప్రజా సమస్యలపై అధ్యయనం, ఉద్యమ నైపుణ్యాలు, నాయకత్వ నైపుణ్యాలు వంటి అంశాల్లో పార్టీ నాయకులకు శిక్షణ ఇవ్వడానికి 2026 జనవరి 31లోపు రాష్ట్రస్థాయి పార్టీ పాఠశాల నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ శిక్షణా శిబిరం ద్వారా కొత్త క్యాడర్ కు దిశానిర్దేశం, పాత క్యాడర్ కు పురోగతి స్ఫూర్తిని అందించడం లక్ష్యం గా పని చెయ్యాలని అన్నారు. సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ కార్యక్రమం పూర్తయిన అనంతరం, పార్టీ తదుపరి కార్యాచరణ, సంస్థాగత విస్తరణ, నాయకత్వ బలపరిచే వ్యూహాలు, ఎన్నికల ప్రణాళిక వంటి అంశాలపై చర్చించడానికి ప్రత్యేక రాష్ట్ర సమావేశం నిర్వహించాలనే ముఖ్య తీర్మానం ఆమోదించబడిందని అన్నారు. ప్రస్తుత రాష్ట్ర కమిటీ ఈ మొత్తం కార్యక్రమాలను పర్యవేక్షించనుంది, సభ్యత్వ నమోదు నుంచి పార్టీ పాఠశాల నిర్వహణ వరకు, అన్ని సంస్థాగత చర్యలు సమన్వయం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా కామ్రేడ్ జోజి రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లాల మధ్య సమన్వయం, కార్యాచరణ వేగవంతం, పార్టీ సందేశాన్ని ప్రజలకు చేరవేయడం వంటి అంశాలు ఆయన పర్యవేక్షణలో కొనసాగుతాయని దేవరాజన్ తెలిపారు. సమావేశం ముగింపులో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్రంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలపై పోరాటాన్ని మరింత బలపరచాలని, ప్రజా సమస్యల కోసం శక్తివంతమైన ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా నిలవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా ఎన్నికైన అంబటి జోజి రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సభ్యత్వం శ్రీకరణ పార్టీ నిర్మాణానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన నిరంతరం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని నా నియమాకానికి సహకరించిన ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ కమిటీ సభ్యులకు, రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీలకు పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రైవేట్ ఆస్పత్రుల్లో జిల్లా వైద్య శాఖ అధికారి వాణిశ్రీ తనిఖీ



**గోదావరిఖని, జనంసాక్షి :** జిల్లా వైద్య.. ఆరోగ్యశాఖ అధికారి డా. వి. వాణిశ్రీ గోదావరిఖని పరిధిలోని ప్రభుత్వ.. ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ రిన్యూవల్‌కు దరఖాస్తు చేసుకున్న సుగుణ డెంటల్ క్లినిక్, సత్య డెంటల్ క్లినిక్, అలాగే స్కానింగ్ సెంటర్ కలిగి ఉన్న జెమినీ నర్సింగ్ హోమ్, శ్రీదేవి నర్సింగ్ హోమ్, సురేఖ హాస్పిటల్ లలో తనిఖీలు నిర్వహించారు. స్కానింగ్ డేటా, ఫారం-ఎఫ్, సంబంధిత రికార్డులను పరిశీలించిన డా. వాణిశ్రీ, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం ప్రీ-కన్సెప్షన్ అండ్ ప్రీ-నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ చట్టం-1994 ప్రకారం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. పుట్టబోయే పిల్లలు ఆడ అయినా, మగ అయినా సమానమే అన్న భావన ప్రజల్లో పెంపొందాలన్నారు.

తదనంతరం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఎస్. ఎన్ .సి. యు. (ఎస్ ఎన్ సి యు) లో నవజాత శిశువుల చికిత్స విధానాన్ని పరిశీలించారు. పిల్లల వైద్య నిపుణుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రాజీవ్, నర్సింగ్ ఆఫీసర్ శ్రీమతి సువర్ణ, ల్యాబ్ ఇన్‌చార్జ్ శివ, ఇతర పిల్లల వార్డు సిబ్బందితో కలిసి సంకల్ప్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, నవజాత శిశువుల మరణాల్ని తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తక్కువ బరువుతో పుట్టిన శిశువులు, నెలలు నిండక ముందే పుట్టిన శిశువులపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు. కంగారు మదర్ కేర్ విధానంపై తల్లులకు అవగాహన కల్పించాలి, ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయిన శిశువుల ఫాలోఅప్‌ను క్షేత్ర స్థాయి సిబ్బందిచే గృహ సందర్శనల ద్వారా జరిగేలా చూస్తాము అని అన్నారు. అదేవిధంగా అడ్డకుంటపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రతి మంగళవారం మహిళా ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహించేందుకు అవసరమైన ప్రతిపాదనలను పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా. బి. శ్రీరాములు, వైద్య అధికారి డా. లక్ష్మీ భవానీ, డిప్యూటీ మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# జోయాలుక్కాస్ "బ్రిల్లియన్స్ డైమండ్ జ్యువెలరీ షో"



కాప్రా, డిసెంబర్ 5 (జనంసాక్షి) : జోయాలుక్కాస్ బ్రిల్లియన్స్ డైమండ్ జ్యువెలరీ షో ఈనెల 5 నుంచి 21 వరకు ఎ.ఎస్.రావు నగర్‌లోని జోయాలు క్కాస్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తన ఐకానిక్ షోరూమ్లో బ్రిల్లియన్స్ డైమండ్ జ్యువెలరీ షోతో తెలంగాణను అబ్బురపరచనుంది. ఈ ప్రదర్శన వజ్రాల ఆభరణాలలో హస్తకళ, చక్కదనం, ఆవిష్కరణల ప్రతి డిజైన్ ఒక ప్రత్యేకమైన సృష్టి ఇది ప్రదర్శనలో పరిమిత సమయం వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జోయాలుక్కాస్ మాట్లాడుతూ బిల్లియన్స్ డైమండ్ జ్యువెలరీ షో అనేది. వజ్రాల ఆభరణాల శాశ్వత ఆకర్షణకు మరియు డిజైన్లో పరిపూర్ణత పట్ల మనకున్న మక్కువకు చిహ్నం. మా ప్రయాణంలో ఎ.ఎస్.రావు నగర్కు ప్రత్యేక స్థానం ఉంది పండుగ సీజన్లో నిర్వహించే ఈ ప్రదర్శన: అందం. వ్యక్తిత్వం, నైపుణ్యాన్ని ఉత్తమంగా ప్రతిబింబించే డిజైన్లను కనుగొనడానికి వినియోగదారులకు ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తు ఒది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ప్రదర్శన కాలంలో రూ 1 లక్ష అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలను కొనుగోలు చేసే వినియోగ దారులు ప్రతి కొనుగోలుతో ఉచిత బంగారు నాణెం అందుకుంటారు. ఇది షాపింగ్ అనుభవాన్ని మరింత ఉత్తేజపరుస్తుంది.బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో డిసెంబర్ 21, ఎ.ఎస్. రావు నగర్ లో జోయ్ అలుక్కా షో రూమ్ లో ప్రత్యేకంగా జరుగుతుంది. సందర్శకులు ఇక్కడ అందమైన వజ్రాల ప్రపంచాన్ని అనుభవించవచ్చు ప్రతి ఆభరణం లగ్జరీ గా అందంగా ఉంటుంది అని తెలిపారు.

# జర్నలిస్టు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

- రాజేందర్ మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి డిసెంబర్ 5 (జనంసాక్షి):
తలకొండపల్లి మండల మెట్రో ఈవినింగ్ రిపోర్టర్ తక్కెళ్ళపల్లి రాజేందర్ (42) ఆకస్మాత్తుగా గుండెపోటుతో శుక్రవారం ఉదయం మరణించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మృతదేహంపై పుష్పగుచ్ఛముంచి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఆయన అన్నారు. గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని ఒక మంచి జర్నలిస్టు మిత్రుని కోల్పోయామని ఆయన అన్నారు.ఇతనికి భార్య,ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ మాజీ చైర్మన్ నల్లపురం శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్,టిఎస్ ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మి నివాస్.బీఆర్ఎస్ మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు డేవిడ్,రేణు రెడ్డి,రాజు,మహేష్,శ్రీనివాస్ రెడ్డి,శరచ్చంద్ర,వివిధ గ్రామాల మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు, ఘన నివాళులు అర్పించారు.



**తలకొండపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మృతునికి ఘన నివాళులు**

తలకొండపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు.తోటి జర్నలిస్టు మిత్రుడు గుండెపోటుతో మరణించడం పట్ల జర్నలిస్టు మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.రాజేందర్ మృతదేహంపై ఉషోగుచాల నుంచి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.మీ కుటుంబానికి మేము అండగా ఉంటామని జర్నలిస్టు మిత్రులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి,విష్ణువర్ధన్,దరువుల శంకర్,తిరుపతయ్య,తూర్పు తూర్పు శ్రీను,మహేష్,బాలరాజ్,శేఖర్,రాజు,తదితరులు ఉన్నారు.





# అల్వాల్‌లో 8.50 కేజీల గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి రవాణా... అదుపులో ముగ్గురు అక్రమ వ్యాపారులు
- ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో అనుమానంతో పరీశీలన
- కేసు నమోదు... రిమాండ్‌కు పంపిన పోలీసులు

**అల్వాల్, డిసెంబర్ 5 (జనంసాక్షి):** అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్టు రహస్య సమాచారం అందుకున్న పోలీసులు గురువారం సాయంత్రం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులు అనుమానం రేకెత్తించడంతో వారిని అడ్డుకుని విచారించారు. వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా 8.50 కేజీల గంజాయి దొరికిపోయింది. అరెస్టు చేసిన నిందితులను కళ్యాల మధు (32, ఫతేనగర్ నివాసి), ఎస్లీ సుదేష్ (36, పార్దీబస్తీ, ఫతేనగర్), కళ్యాణ రాజు (53, వికలాంగుల కాలనీ, కీసర)గా గుర్తించారు. ప్రాథమిక విచారణలో వీరు ఒడిశా రాష్ట్రం కలిమెలా ప్రాంతం నుంచి ఈ గంజాయిని రవాణా చేసి హైదరాబాద్‌లో అక్రమంగా అమ్ముతున్నట్టు వెల్లడైంది. ఈ ముఠాకు చెందిన వారు గత కొంతకాలంగా ఇదే పని చేస్తున్నట్టు స్థిరీకరించిన పోలీసులు వారిపై ఎన్డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదు చేశారు. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపారు. ఈ ఘటనతో స్థానికంగా మత్తు పదార్థాల అక్రమ వ్యాపారంపై పోలీసుల నిఘా మరింత బిగుస్తుందని తెలుస్తోంది.

# అక్రమ మద్యం తరలింపుపై పోలీసుల దాడులు

- గత మూడు రోజులుగా వరుసగా పట్టివేతలు
- 340 లీటర్లతో ఆటో సీజ్... సురేష్ అరెస్ట్
- కిరాణా దుకాణంలో 9 లీటర్లు స్వాధీనం
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: సీఐలు హెచ్చరిక

శంకర్‌పల్లి, **డిసెంబర్ 5 (జనంసాక్షి):** అక్రమ మద్యం రవాణాకు అడ్డాఆపేందుకు శంకర్‌పల్లి, మోకిలా పోలీసులు ప్రత్యేక నిఘా పెంచారు. గత మూడు రోజులుగా వరుసగా జరిపిన దాడుల్లో భారీ మొత్తంలో నిషిద్ధ మద్యాన్ని స్వాధీనం చేస్తూ నిందితులపై కేసులు నమోదు చేశారు.
శుక్రవారం సాయంత్రం శంకర్‌పల్లి నుంచి మహాలింగాపురం వైపు వెళ్తున్న ఆటోను ఆలంఖాన్ గూడెం గేటు వద్ద అడ్డుకున్న పోలీసులు తనిఖీ చేయగా 340 లీటర్ల అక్రమ మద్యం బయటపడింది. ఆటోను సీజ్ చేసిన పోలీసులు మద్యాన్ని తరలిస్తున్న వికారాబాద్ జిల్లా కోడూరు కు చెందిన సురేష్ శేఖర్‌ను అరెస్ట్ చేశారు. "నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలించినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవు" అని శంకర్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.ఇదే క్రమంలో మోకిలా పోలీసులు మోకిలా తండాలోని ఓ కిరాణా దుకాణంపై దాడి చేశారు. దుకాణంలో దాచి అక్రమంగా అమ్ముతున్న 9 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమాని నగేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని మోకిలా సీఐ వీరబాబు తెలిపారు. అక్రమ మద్యం వ్యాపారంపై రెండు స్టేషన్ల పోలీసులు సంయుక్తంగా నిఘా కొనసాగిస్తున్నట్టు సమాచారం.

## తెలంగాణ జడ్చర్ల లో కరాటే లో గ్లోబల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**వికారాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి):** జాతీయస్థాయి కరాటే పోటీలలో గ్లోబల్ స్కూల్ విద్యార్థినిలు బంగారు మరియు వెండి పథకం కైవసం చేసుకున్నారు.కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మస్థర్యం బలపడు తుందని మరియు తనను తాను రక్షించుకోగలరు కరాటే మాస్టర్ మహమ్మద్ గౌస్ అన్నారు. జాతీయ స్థాయిలో ది గ్లోబల్ డిజి గ్లోబల్ స్కూల్ కు చెందిన విద్యార్థులు ప్రథమ ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు.వికారాబాద్ జిల్లా పరిగి ది గ్లోబల్ డిజి స్కూల్లో 4 వ తరగతి చదువుతున్న ఆష్నా సాదియా బేగం జాతీయ స్థాయిలో ప్రథమ స్థానము 3 వ తరగతికి చెందిన అఫ్శిన్ రహమత్ కంకల్ జునైరా షేక్ ను అభినందించిన స్కూల్ యాజమాన్యంకార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆయేషా మేడం మరియు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# తలకొండపల్లి రిపోర్టర్ రాజేందర్ గుండెపోటుతో మృతి

**నివాళులర్పించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య,రాష్ట్ర నేతలు**



**తలకొండపల్లి డిసెంబర్ 5(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెట్రో ఈవినింగ్ దినపత్రిక రిపోర్టర్ తక్కల్లపల్లి రాజేందర్(42) శుక్రవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. రాజేందర్‌కు భార్య,ముగ్గురు చిన్నపిల్లలు.గత ఏడేండ్లుగా రిపోర్టర్ గా పనిచేస్తున్న రాజేందర్ కు శుక్రవారం తెల్లవారుజామున గుండెనొప్పి రావడంతో చికిత్స కోసం కల్వకుర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్)రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య,కో కన్వీనర్ పులిపలుపుల ఆనందం,రంగారెడ్డి జిల్లా టిడబ్ల్యుజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెల సత్యనారాయణ తదితరులు రాజేందర్ స్వగ్రామం గట్టు ఇప్పలపల్లి గ్రామంలోని ఆయన ఇంటికి వెళ్ళి రాజేందర్ భౌతిక కాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ..ఈ మధ్యకాలంలో అనారోగ్య సమస్యల తో అనేకమంది జర్నలిస్టులు పిట్టల్లా రాలిపోతున్నారని,అయినా కూడా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని అన్నారు.జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డ్స్,హెల్త్ కార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల జర్నలిస్టులకు సరైన సమయంలో వైద్యం అందక చనిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి కార్పొరేట్ ప్రైవేటు ఆసుపత్రిలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని,రాజేందర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్ బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్,కార్యదర్శి తిరుపతి,సహాయ కార్యదర్శి తూర్పు శ్రీను,గణేష్ పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా నూతన డిసిసి అధ్యక్షుడిగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

- మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించిన మేడిపల్లి సత్యం

**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 05(జనంసాక్షి):**
కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమితులైన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం రోజు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపడుతూ ప్రమాణస్వీకారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పలువురు ముఖ్య నేతలు హాజరైనారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమ నాయకుని స్థాయి నుండి యూత్ కాంగ్రెస్ చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షునిగా శుక్రవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా పదవి బాధ్యతలు చేపట్టిన మేడిపల్లి సత్యం, నాతోపాటు ఎన్ఎస్ యు ఐ నుండి పనిచేసిన సంగీతం శ్రీనివాస్, వైద్యుల అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కావడం అనేది ఒక గొప్ప అవకాశం అన్నారు. గత జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అనుభవాలను సలహాలను తీసుకొని ప్రభుత్వానికి పార్టీకి మధ్య వారధిగా పనిచేస్తే తప్పకుండా మేమంతా మీ వెంట ఉండి పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని, ఆనాడు ప్రతిపక్ష హోదాలో ఉన్న నాడు కొండగట్టు వేదికగా చొప్పదండి నియోజక వర్గం లో ప్రజల పక్షాన పోరాడినట్లుగా నేడు చొప్పదండి ఎమ్మెల్యేగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా ప్రజల సంక్షేమం సమస్యలు పరిష్కరించే విధంగా కార్యకర్తలను ముందుకు తీసుకుపోయే విధంగా పని చేయాలన్నారు.
వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... నగర అధ్యక్షుడిగా పని చేసిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సుడా చైర్మన్ అయినారు, ఎన్ఎస్యుఐ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన బలుమూరి వెంకట్ ఎమ్మెల్సీ అయినారు, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా పని చేసిన సంగీతం శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అయినారు, కార్యకర్త స్థాయి నుంచి ఎదిగిన అంజన్ కుమార్ అర్బన్ డిసిసి అధ్యక్షులు అయినారు. అంటే ఇది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుంది అని స్పష్టం అయింది.



**కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ...**
నేను అడగకపోయినా నాకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇచ్చి ప్రతి విషయంలో నా ముందుండి నడిపించిన మా అన్న పొన్నం ప్రభాకర్, ఇప్పటివరకు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో మొదటిసారి దళితునిగా ఒక జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా అయి ఉండవచ్చు. అలాంటి గొప్ప నాయకుడు కరీంనగర్ జిల్లాకు దొరకడం కార్యకర్తలు చేసుకున్న అదృష్టంగా భావించవచ్చున్నారు.




మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... కరీంనగర్ జిల్లా ఉత్తర తెలంగాణకు గుండెకాయ అయినటువంటి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నాకు అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్కి, సెక్రటరీ మీనాక్షి నటరాజన్‌కి, చొప్పదండి నియోజకవర్గంలో నన్ను ఎంతగానో కూర్చొనించి రెండుసార్లు టికెట్ రావడానికి నన్ను ఈ స్థితిలో ప్రోత్సహించిన జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్కి, ఈ జిల్లాకు చెందినటువంటి మంత్రి శ్రీధర్ బాబుకి, అడ్లూరు లక్ష్మణ్ కుమార్ కి, పెద్దలు జీవన్ రెడ్డి కి, బల్మూరు వెంకట్ కి, అందరికీ ముఖ్యంగా మానకొండూరు శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా తాజా మాజీ అధ్యక్షులు డాక్టర్ కమ్మపల్లి సత్యనారాయణ కి ప్రభుత్వ విప్పు బడుగు బలహీన వర్గాల నాయకుడు ఆది శీనన్న కి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు అంజన్ కుమార్, మల్లేశంకి, మాజీ ఎమ్మెల్యేలకు, అనుబంధ సంఘాల అధ్యక్షులకు నాయకులకు కార్యకర్తలకు బొమ్మ శ్రీరామ్ కి పెద్దలు ముఖ్య నేతలకు అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు.

## బుదేవినగర్ సన్‌రైజ్ కాలనీలో సీసీ రోడ్లు త్వరగా పూర్తి చేయాలి

- మిగిలిన పనులను వేగవంతం చేయండి: నివాసుల వినతి
- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేత

**అల్వాల్, డిసెంబర్ 5 (జనంసాక్షి):**



బుదేవినగర్ సన్‌రైజ్ కాలనీలో ఇంకా పూర్తికాకుండా మిగిలిపోయిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయించాలని కాలనీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కోరారు. గురువారం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించిన సందర్భంగా ఈ డిమాండ్ చేశారు. కాలనీలో ఇప్పటివరకు కొన్ని రోడ్లు పూర్తయినా, మిగిలినవి గత కొంతకాలంగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, వర్షాలు వస్తే రోడ్లు బురద మయంగా మారి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ పనులు త్వరగా పూర్తయితేనే కాలనీ సమగ్ర అభివృద్ధి సాధ్యమని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.ఈ వినతి సమర్పణ కార్యక్రమంలో కాలనీ సభ్యులు బాబురావు, నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, డోలీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

# రేవంత్‌కు ఉద్యమకారుల స్వాగతం... 250 గజాల స్థలం కోరిక

- ఉస్మానియాలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం
- మేనిఫెస్టో హామీ అమలు చేయాలని డిమాండ్
- 15 ఏళ్లుగా అవకాశాలు లేవని ఆవేదన
- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చేయూత కావాలని వినతి



**హైదరాబాద్, డిసెంబర్ 5 (జనంసాక్షి):** ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో గురువారం తెలంగాణ ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ పిడమర్తి రవి, త్వరలో ఓయూ క్యాంపస్‌లో భారీ కార్యక్రమంతో వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అదే వేదికపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.
ఈ సమావేశానికి తెలంగాణ ఉద్యమ నేత ఎండీ రహీం అధ్యక్షత వహించగా, పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు. పిడమర్తి రవి మాట్లాడుతూ "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఉస్మానియా నుంచి హృదయపూర్వక స్వాగతం. మీరు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇప్పించాల్సిందిగా కోరుతున్నాం" అని పేర్కొన్నారు.
గత 15 సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ఎలాంటి ఉద్యోగ అవకాశాలు లేదా ఆర్థిక చేయూత లభించలేదని, పలువురు తీవ్ర అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ హామీని అమలు చేయాలని, ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. సమావేశంలో ఉద్యమకారులు భావోద్వేగంతో మాట్లాడుతూ, తమ త్యాగాలను గుర్తు చేసుకునేలా ప్రభుత్వం స్పందించాలని కోరారు.

# కందిగూడలో ఫుట్‌బాల్ స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి



**కాప్రా, డిసెంబర్ 5 (జనం సాక్షి) :** కాప్రా డివిజన్‌లో నీ కందిగూడలో రూ 95 లక్షలతో ఫుట్ బాల్ స్టేడియం నిర్మాణం పనులను శుక్రవారం కాప్రా డివిజన్ కార్పొరేటర్స్ స్వర్ణరాజ్ శివమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వర్ణ రాజ్ మాట్లాడుతూ కాప్రా డివిజన్ కందిగూడలో జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పర్యటించిన సందర్భంలో క్రీడా మైదానానికి నిధులు కేటాయించాలని కోరడంతో 95 లక్షల కేటాయించడం చాలా సంతోషకరమన్నారు. ఈ క్రీడామైదానాన్ని అభివృద్ధి చేస్తే కందిగూడలో యువతకు ఫుట్‌బాల్ క్రీడపట్ల ఉన్న మక్కువతో జాతీయ, అంతర్జాతీయ పథకాలను సాధిస్తారన్నారు. క్రీడాకారులను తయారు చేయవచ్చని తెలపగా, తప్పకుండా ప్రతిభ-నైపుణ్యం గల యువతను తయారుచేయడానికి కాప్రా డివిజన్లోని కందిగూడ, అమ్మగూడ, నిర్మల్ నగర్, వళ్లవర్ నగర్ ప్రాంతాలలో ఫుట్‌బాల్ క్రీడకు మంచి ఆదరణ ఉందని, ఇక్కడినుండి జాతీయ, అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఆటలో పాల్గొన్న క్రీడాకారులున్నారన్నారు. రెండుమార్లు అంతర్జాతీయ ఒలంపిక్స్ గేమ్స్‌లో ఆడిన ఏషియన్ గేమ్స్ లో స్వర్ణ పతకం సాధించిన ప్రముఖ ఫుట్బాల్ క్రీడాకారుడు టి.బాలరామన్ ఈ ప్రాంతం కావడం విశేషమన్నారు. యువత చదువుతో పాటు, క్రీడలపై ఆసక్తి పెంచుకొని, ఆటలలో రానిస్తూ ఉన్నతంగా స్థిరపడాలని, రాష్ట్రానికి, దేశానికి ప్రాతినిధ్యం వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డ్ మాజీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ జయప్రకాష్ స్థానిక పెద్దలు-నాయకులు- శ్రీ శివకుమార్ పుష్పరాజ్, సమంత్ కుమార్, గోపాల్, ఫ్రాంక్లిన్, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కొబ్బనూరి నాగశేషు, మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీ విఠల్ నాయక్ ,శ్రీధర్ రెడ్డి, ఏ ఎస్ రావ్ నగర్ డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శ్రీ కొత్త అంజిరెడ్డి, డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ ప్రశాంత్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి పవన్ కుమార్, శ్రీ తన్నీరు శ్రీహరి, రాకేష్ యాదవ్, శ్రీకాంత్ గౌడ్, ఆకుల సంతోష్, రిజ్వాన్ ఖాన్, సోంనాథ్, సత్తి రెడ్డి,మూర్తుజా, నాగరాజు యాదవ్, సంతోష్ చారి, ప్రదీప్, దయాకర్, శివ, అభి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం సాయి ఈశ్వర్ చారి ప్రాణత్యాగం

**మృతదేహానికి నివాళులర్పించిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు**



**కుత్బుల్లాపూర్ డిసెంబర్ 5 (జనం సాక్షి) :** రిజర్వేషన్‌లలో బీసీలకు న్యాయం జరిగిందంటూ జగద్గిరిగుట్ట డివిజన్ బీరప్ప నగర్‌కు చెందిన సాయి ఈశ్వర్‌చారి గురువారం మధ్యాహ్నం తీన్మార్ మల్ల న్న కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్న సంఘటనలో సాయి ఈశ్వర్ చారి చికిత్స పొందుతూ శుక్రవారం గాంధీ ఆసుపత్రిలో మృతి చెందారు. సాయి ఈశ్వర్ మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం జగద్గిరిగుట్టలోని తన సొంత ఇంటికి తీసుకురావడంతో ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయి ఈశ్వర్ చారి స్వగ్రామం సంగారెడ్డి జిల్లా, పుల్కల్ మండలం పోచారం గ్రామానికి చెందిన వాడుగా కుటుంబ సభ్యులు తెలియ జేశారు. అతనికి భార్య కవితతో పాటు తల్లి ప్రమీల, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. క్యాబ్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్టలో నివాసం ఉంటున్నాడు.
సాయి ఈశ్వర్ చారి మృతిని తెలుసుకున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత,డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్, స్థానిక నాయకులు, పలువురు బీసీ సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున తరలి వెళ్లి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
6 డిసెంబర్ 2025



## కారులో తరలిస్తున్న నగదు పట్టివేత

- ఛేజ్ చేసి కారులో 4కోట్లు స్వాధీనం

**హైదరాబాద్, డిసెంబర్5 (జనంసాక్షి) :** కారులో తరలిస్తున్న హవాలా డబ్బును పోలీసులు ఛేజ్ చేసి పట్టుకున్నారు. నగరంలోని శామీర్‌పేటలో కారులో భారీగా హవాలా నగదు లభ్యమైంది. టైర్లు, సీట్ల కింద రూ.4 కోట్ల నగదును పోలీసులు గుర్తించారు. హవాలా మార్గంలో తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బోయిన్‌పల్లి క్రైమ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. హవాలా డబ్బు కేసులో 2024లో ఓ వ్యక్తి పరారయ్యాడు. ఇవాళ ఆ వ్యక్తి భారీ మొత్తంలో నగదుతో నిజామాబాద్ నుంచి వస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో తనిఖీలు నిర్వహించిన పోలీసులు శామిర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకొని, డబ్బును స్వాధీనం చేసుకున్నారు.

## ఎమిరేట్స్ విమానానికి బాంబు బెదిరింపులు

- శంషాబాద్‌లో సురక్షితంగా ల్యాండ్



**హైదరాబాద్, డిసెంబర్5 (జనంసాక్షి) :** హైదరాబాద్‌కు వచ్చే విమానాలే లక్ష్యంగా వరుసగా బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. శుక్రవారం దుబాయ్ నుంచి హైదరాబాద్ వస్తోన్న ఎమిరేట్స్ విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ క్రమంలో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈకే526 విమానం దుబాయ్ నుంచి హైదరాబాద్ కు వస్తోంది. ఈ క్రమంలో విమానాన్ని పేల్చేస్తామంటూ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి ఎయిర్‌పోర్ట్ కస్టమర్ సపోర్ట్ కేంద్రానికి ఇ-మెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎయిర్‌పోర్టులో ఆ విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందికి దింపారు. ఆ తర్వాత విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. కాగా.. గురువారం కూడా హైదరాబాద్‌కు వచ్చే విమానాలు లక్ష్యంగా బాంబు బెదిరింపులు వచ్చాయి. సౌదీ అరేబియాలోని మదీనా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న విమానంలో బాంబు పెట్టినట్లు మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమ య్యారు. విమానాన్ని అహ్మదాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేసి.. తనిఖీలు చేశారు. షార్జా నుంచి హైదరాబాద్ వస్తున్న మరో విమానానికి కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఈ క్రమంలో దాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు.

# పుతిన్‌కు రాష్ట్రపతి విందు

- ఆహ్వానం అందని కాంగ్రెస్
- అనూహ్యంగా శశిథరూర్‌కు ఆహ్వానం



**న్యూఢిల్లీ, డిసెంబర్5 (జనంసాక్షి) :** రెండ్రోజుల భారత్ పర్యటనలో ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విందు ఇవ్వనున్న క్రమంలో కాంగ్రెస్‌కు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు కానీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీకి కానీ ఆహ్వానం దక్కలేదు. అయితే ఇందుకు భిన్నంగా ఆ పార్టీ సీనియర్ నేత శశిథరూర్‌కు మాత్రం ఆహ్వానం లభించింది. పార్టీ లైన్స్‌కు భిన్నంగా శశిథరూర్ ఇటీవల బీజేపీకి దగ్గరవుతున్నారంటూ కాంగ్రెస్ వర్గాల్లో విమర్శలు వెలువడుతున్న క్రమంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. పుతిన్‌కు రాష్ట్రపతి ఇస్తున్న విందుకోసం ఖర్గే, రాహుల్‌కు అహ్వానం అందలేదని కాంగ్రెస్ వర్గాలు ధ్రువీకరించాయి. కీలక దౌత్య ప్రముఖులు హాజరయ్యే కార్యక్రమంలో తమ నేతలకు ఆహ్వానం లేకపోవడంపై ఆ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీనిపై శశిథరూర్ స్పందిస్తూ, తనకు అందిన ఆహ్వానాన్ని గౌరవిస్తానని, ఏ ప్రాతిపదికపై విపక్ష నేతను ఆహ్వానించలేదో తనకు తెలియదని అన్నారు. కాగా, శశిథరూర్‌కు దౌత్య వవహారాల్లో అనుభవం ఉన్నందున ఆయనను ఆహ్వానితుల జాబితాలో చేర్చి ఉండొచ్చని చెబుతున్నారు. అయితే శశిథరూర్ గతంలో ఐక్యరాజ్యసమితి అండర్ సెక్రటరీ జనరల్‌గా బాధ్యతలు నిర్వహించడం, రష్యా అధికారులతో అనుబంధం కారణంగా ఆయనను విందుకు ఆహ్వానించి ఉండొచ్చని తెలుస్తోంది. ఇటీవల ఆపరేషన్ సిందూర్‌పై ప్రపంచ దేశాలకు బ్రీఫింగ్ ఇచ్చేందుకు వెళ్లిన ఎంపీల బృందంలో థరూర్ కూడా ఉన్నారు. ఇటీవల కొన్ని సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా ఆయన వ్యాఖ్యలు చేస్తుండడంతో సొంత పార్టీ నుంచి విమర్శలు వస్తున్నాయి. అయితే, గతంలో ఐక్యరాజ్యసమితిలో దౌత్యవేత్తగా విధులు నిర్వర్తించిన థరూర్‌కు రష్యా అధికారులతో అనుబంధం ఉండడంతోనే ఈ విందుకు ఆహ్వానం అంది ఉండవచ్చని తెలుస్తోంది.

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

- 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'కు హాజరుకావాలని ఆహ్వానం



**అమరావతి, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్- 2025'కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ లో జరప తలపెట్టిన ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రిని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున కోరారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'ను దావోస్ సమ్మిట్ తరహాలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, వివిధ రంగాల నిపుణులు సదస్సుకు హాజరవుతున్నట్టు ముఖ్యమంత్రికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వివరించారు.

## రూ. 347 కోట్లతో జోగులాంబ దేవాలయ అభివృద్ధికి ప్రణాళిక

- తక్షణ పనులకు రూ. 35 కోట్లు అవసరం
- ఆలయ సమీక్షలో పాల్గొన్న చిన్నారెడ్డి, శైలజా రామయ్యర్, స్తపతి గోవింద హరి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తుంగభద్ర నది ఒడ్డున ఆలంపూర్ వద్ద కొలువైన 5వ శక్తి పీఠం జోగులాంబ అమ్మ వారి ఆలయ అభివృద్ధికి రూ. 347 కోట్లతో ప్రణాళికను సిద్ధం చేశారు. తక్షణం బాలాలయం, వజ్ర లేపనం, కుంబాభిషేకం వంటి పనులు ప్రారంభించేందుకు రూ. 35 కోట్లు అవసరం అని నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, స్తపతి గోవింద హరి, ఆలయ అభివృద్ధి రూపశిల్పి సూర్యనారాయణ మూర్తి జోగులాంబ ఆలయ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. త్వరలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశం కావాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. జోగులాంబ ఆలయాన్ని గొప్పగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యం సీఎం రేవంత్ రెడ్డికి ఉందని, ఈ ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం సకల సౌకర్యాలు కల్పించాలన్న తపన సీఎం కు ఉందని చిన్నారెడ్డి తెలిపారు. రూ. 347 కోట్ల ప్రణాళికలో మొదటి దశలో రూ. 138.40 కోట్లు, రెండవ దశలో రూ. 117.60 కోట్లు, మూడవ దశలో రూ. 91 కోట్లు అవసరం అని సమావేశంలో నిర్ణయానికి వచ్చారు.

## ఏసీబీ వలలో 100 కోట్ల అవినీతి తిమింగలం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తప్పుడు సర్వే నెంబర్లతో ప్రభుత్వ భూములను ప్రైవేటుకు కట్టబెట్టి రంగారెడ్డి జిల్లా సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ రూ.100 కోట్ల ఆస్తులు దండుకున్నారు. మై హోమ్ భూజలో ఫ్లాట్, నారాయపేటలో రైస్ మిల్, అనంతపురంలో 11 ఎకరాలు, కర్ణాటకలో 11 ఎకరాల భూములను ఏసీబీ అధికారులు గుర్తించారు. రంగారెడ్డి జిల్లాలో సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కొత్తమ్ శ్రీనివాసులు అనే వ్యక్తి, సంపాదనకు మించిన ఆస్తులు కూడబెట్టాడని ఏసీబీకి ఫిర్యాదు అందింది. దీంతో తన మై హోమ్ భూజ నివాసంతో పాటు అతని స్నేహితులు, బినామీల నివాసాలు, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని అతని కార్యాలయంలో విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించారు. శ్రీనివాసులుకు మై హోమ్ భూజలో విలాసవంతమైన ఫ్లాట్, అనంతపురంలో 11 ఎకరాల భూమి, కర్ణాటకలో 11 ఎకరాల భూమి, మహబూబ్‌నగర్ జిల్లాలో 4 ప్లాట్లు, నారాయణపేటలో ఒక రైస్ మిల్, 4 ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. తన ఇంట్లో సోదాలు చేస్తుండగా 1.6 కిలోల బంగారం, రూ.5 లక్షల నగదు, 770 గ్రాముల వెండి లభించినట్లు అధికారులు వెల్లడించారు. గతంలో శ్రీనివాసులు మీద ఏసీబీ కేసు నమోదు అవ్వడంతో కొంత కాలం సస్పెన్షన్‌లో ఉండి తిరిగి విధుల్లో చేరారని, అయినా తన పద్ధతి మార్చుకోలేదని ఏసీబీ అధికారులు తెలిపారు.

## జనన ధృవీకరణ గడవు వార్తలు అబద్ధం

**న్యూఢిల్లీ, డిసెంబర్5 (జనంసాక్షి) :** జనన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసేందుకు వచ్చే ఏప్రిల్ 27వ తేదీని తుది గడువుగా నిర్ణయించినట్లుగా సామాజిక మాధ్యమాల్లో జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం ఖండించింది. వాట్సప్‌లో ప్రచారం అవుతున్న ఈ సమాచారం పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పింది. ఈ తప్పుడు సందేశాన్ని ఎవరూ నమ్మవద్దని కోరుతూ పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం శుక్రవారం 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది. జనన ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నోటిఫికేషన్‌ను గానీ, నిర్దేశిత గడువును గానీ జారీ చేయలేదని స్పష్టం చేసింది. ప్రజలు ఇలాంటి ధ్రువీకరణలేని సమాచారాన్ని షేర్ చేయొద్దని కోరింది. కచ్చితమైన సమాచారం కోసం ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లలో చెక్ చేసుకోవాలని సూచించింది. ఏదైనా అనుమానాస్పద సమాచారం ప్రజల దృష్టికి వస్తే వెంటనే ఫ్యాక్ట్‌చెక్ విభాగాం 91 8799711259 నంబర్‌కు వాట్సప్ ద్వారా లేదా మెయిల్ ద్వారా పంపాలని కోరింది.

## సాయి ఈశ్వరు కుటుంబానికి మాజీ మంత్రుల పరామర్శ

- 50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్



**హైదరాబాద్, డిసెంబర్5 (జనంసాక్షి) :** రిజర్వేషన్ల పరంగా బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సాయి ఈశ్వర్ మరణించడంపై మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వీరు ఆస్పత్రిలో అంతకుముందు పరామర్శించారు. ఆయన కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. సాయి ఈశ్వర్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. అయితే చికిత్స పొందుతూ మరణించాడు. అనంతరం మాజీ మంత్రులు మీడియాతో మాట్లాడుతూ.. సాయి ఈశ్వర్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 50 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్ మిమ్మల్ని ఎవరు అడిగారని ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. అధికార పార్టీ నేతల దౌర్జన్యాలకు నిర్మల్ జిల్లాలో సర్పంచ్ అభ్యర్థి భర్త రవీందర్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. నల్లగొండ జిల్లాలో సర్పంచ్ అభ్యర్థి భర్తను మంత్రి కోమటిరెడ్డి అనుచరులు కిడ్నాప్ చేసి మూత్రం తాగించారని పేర్కొన్నారు. జనాభాలో సగభాగం ఉన్న బీసీలు ఏకమై ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని హెచ్చరించారు. బీసీ బిడ్డలు ఆవేశాలకు గురై బలవన్మరణాలకు పాల్పడవొద్దని కోరారు.

## శంషాబాద్ విమనాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

- ఇండిగో విమానాల రద్దుతో ప్రయాణికుల ఆగ్రహం
- ఎపి మంత్రి పార్థసారథి చొరవతో అయ్యప్ప భక్తులకు ప్రత్యేక విమానం




**హైదరాబాద్, డిసెంబర్5 (జనంసాక్షి) :** ఇండిగో విమానాల రాకపోకలను నిలిపేయడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం 92 విమానాలు రద్దు చేసినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఇందులో శంషాబాద్‌కు రావాల్సినవి 43, ఇక్కడి నుంచి వెళ్లాల్సినవి 49 ఉన్నాయి. ముందుగా బుక్ చేసుకున్న సర్వీసుల రద్దుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్‌ఇన్ అయిన తర్వాత రద్దు సమాచారం ఇవ్వడంపై నిరసన తెలిపారు. మరోవైపు విశాఖ నుంచి 8 ఇండిగో విమాన సర్వీసులు రద్దు చేశారు. వీటిలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్‌కు వెళ్లాల్సినవి ఉన్నాయి. ఏపీ మంత్రి పార్థసారథి జోక్యంతో శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక విమాన సదుపాయాన్ని కల్పించారు. అంతకుముందు విజయవాడ వెళ్లేందుకు శంషాబాద్‌లో ఇండిగో విమానం కోసం పార్థసారథి వేచి ఉన్నారు. అయ్యప్ప భక్తులు ప్రయాణించే విమానం ఆలస్యంపై అడిగి తెలుసుకున్నారు. వారి ఆందోళనను గమనించి స్వయంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌తో మాట్లాడారు. శబరిమలకు విమాన సర్వీసు ఏర్పాటు చేయించారు. విజయవాడకు వెళ్లాల్సిన విమానం మిస్ కావడంతో మంత్రి పార్థసారథి రోడ్డు మార్గంలో బయలుదేరారు. తమకోసం శ్రమపడి ప్రయాణ సదుపాయం కల్పించిన ఆయనకు అయ్యప్ప భక్తులు ధన్యవాదాలు తెలిపారు. ఇకపోతే దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమానాల రద్దు పరంపర కొనసాగుతున్నది. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలతో వరుసగా మూడో రోజూ పెద్ద సంఖ్యలో సర్వీసులు నిలిచిపోయాయి. శుక్రవారం మొత్తం 500కుపైగా విమానాలను సంస్థ రద్దు చేసింది. దీంతో ఎయిర్‌పోర్టుల్లో ఇండిగో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బోర్డింగ్ పక్రియ ముగిసి 12 గంటలవుతున్నా తాము వెళ్లాల్సిన విమానానికి సంబంధించిన ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆందోళనకు దిగుతున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో అయ్యప్ప స్వాముల నిరసనతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకున్నది. హైదరాబాద్ నుంచి కొచ్చి వెళ్లాల్సిన విమానం 12 గంటల పాటు ఆలస్యం కావడంతో అయ్యప్పలు ఆందోళనకు దిగారు. ఇండిగో విమానం గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కొచ్చి వెళ్లాల్సి ఉంది. ఈ విమానంలో వెళ్లాల్సిన అయ్యప్ప భక్తులు సాయంత్రమే శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే, విమానం శుక్రవారం ఉదయానికి కూడా బయలుదేరకపోవడంతో వారు ఆందోళనకు దిగారు. బోర్డింగ్ గేటుకు అడ్డంగా బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. 12 గంటలుగా తాము విమానాశ్రయంలోనే ఉన్నామని, విమానం గురించి తమకు సమాచారం ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయలేదని ఆసహనం వ్యక్తం చేశారు.

## అఖండ-2 విడుదల వాయిదా

**హైదరాబాద్, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** బాలకృష్ణ - బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2' వాయిదా పడింది. ఈ సినిమా విడుదలపై కొన్ని గంటలుగా సందిగ్ధత నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం సమస్యల్లో చిక్కుకున్నట్లు వార్తలొచ్చాయి. గురువారం రాత్రి ప్లాన్ చేసిన ప్రీమియర్స్‌ను చిత్ర బృందం రద్దు చేయడంతో.. ఆ వార్తలకు బలం చేకూరింది. తాజాగా చిత్ర విడుదలను వాయిదా వేస్తున్నట్లు నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 5న థియేటర్లలో ఈ చిత్రం విడుదల కావాల్సిఉంది. ఈ మేరకు 14 రీల్స్ ప్లస్ సంస్థ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. 'అనివార్య కారణాల వల్ల 'అఖండ 2' షెడ్యూల్ ప్రకారం విడుదల కావడం లేదు. ఈ విషయం పట్ల చింతిస్తున్నాం. ఈ క్షణం మాకు చాలా బాధాకరమైనది. ప్రతి అభిమాని, సినీ ప్రేమికుడికి ఇది కలిగించే నిరాశను మేము అర్థం చేసుకుంటాము. ఈ విషయాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాము. ఈ నిర్ణయం పట్ల కలిగిన అసౌకర్యానికి మా హృదయపూర్వక క్షమాపణలు. ఈ సమయంలో మీ మద్దతు మాకు చాలా అవసరం. అతి త్వరలో సానుకూల నిర్ణయంతో మీ ముందుకు వస్తాం అని నిర్మాణ సంస్థ పేర్కొంది.

## స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 (జనంసాక్షి) :** మగువలకు బంగారం ధరలు మళ్లీ షాకిచ్చాయి. నిన్న స్వల్పంగా తగ్గిన ధరలు.. శుక్రవారంమళ్లీ పెరిగిపోయాయి. రోజుకోలాగా బంగారం ధరలు హెచ్చు తగ్గులు అవుతున్నాయి. శుక్రవారం తులం గోల్డ్‌పై రూ.270 పెరగగా.. సిల్వర్ ధర మాత్రం దిగొచ్చింది. ఏకంగా రూ.4,000 తగ్గింది.బులియన్ మార్కెట్‌లో ఈరోజు 24 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.270 పెరిగి రూ.1,29, 930 దగ్గర ట్రేడ్ అవుతుండగా.. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.250 పెరిగి రూ.1,19,100 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.210 పెరిగి రూ.97, 450 దగ్గర ట్రేడ్ అవుతోంది.వెండి ధర మాత్రం ఈరోజు భారీ ఉపశమనం కలిగింది. ఈరోజు బులియన్ మార్కెట్‌లో కిలో వెండిపై రూ.4,000 తగ్గి రూ.1,87, 000 దగ్గర ట్రేడ్ అవుతోంది. చెన్నై, హైదరాబాద్‌లో మాత్రం రూ.1,96,000 దగ్గర అమ్ముడవుతోంది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో మాత్రం కిలో వెండి రూ.1,87,000 దగ్గర ట్రేడ్ అవుతోంది.

## శ్రీలంకను కుదిపేసిన దిత్వా తుఫాన్

- ఇప్పటి వరకూ 486 మంది మృత్యువాత
- సుమారు 341 మంది ఆచూకీ గల్లంతు

**కొలంబో, డిసెంబర్5 (జనంసాక్షి) :** దిత్వా తుఫాన్ ద్వీప దేశం శ్రీలంకను భారీగా కుదిపేసింది. తుఫాను బీభత్సానికి కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో ఎక్కడికక్కడ వరదలు సంభవించాయి. ఇళ్లు కూలిపోయాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. అనేక పట్టణాలు పూర్తిగా నీట మునిగాయి. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. శ్రీలంక విపత్తు నిర్వహణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం.. 20 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో జనజీవనం స్తంభించింది. దిత్వా తుఫాను బీభత్సానికి భారీగా ఆస్తి ప్రాణ నష్టం సంభవించింది. నవంబర్ 16 నుంచి ఇప్పటి వరకూ 486 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 341 మంది ఆచూకీ గల్లంతయింది. ఈ సంక్షోభ సమయంలో భారత దేశం శ్రీలంకకు అండగా నిలుస్తోంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370